# కథామంజరి

## పది కథల సమాహారం



**జూన్ 2023**

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త

జూన్ 2023

సంపుటి : 4 ♦ సంచిక : 6



**స్వర్గీయ తిమ్మరాజు వెంకట శివరావు గారు,**
**శ్రీమతి హైమవతి గార్ల**

పేరిట వారి కుమారుడు,

**శ్రీ తిమ్మరాజు భాస్కరమూర్తి గారు**

ఈ నెల కథామంజరి సంచికకి
విరాళం అందజేశారు.
వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# కథామంజరి
## పది కథల సమాహారం

"కథామంజరి" దాదాపు మూడు సంవత్సరాలుగా కొత్త, పాత రచయితల రచనలను ఎంచుకుని, నెల నెలా ఓ పది కథల సమాహారాన్ని పాఠకులకి అందిస్తోంది.

ఈ ఆన్ లైన్ సంచికలో కథలు తప్ప మరేమీ ఉండవు.

ప్రచురించిన పది కథలనూ, శబ్దీకరించి, ఇపుడు శ్రావ్యసంచికగా కూడా విడుదల చేస్తోంది. దీనివలన చదవలేనివారు, చదవడానికి సమయం లేని వారు కూడా ఈ కథలకు దగ్గిరవుతున్నారు.

"కథామంజరి" ఎటువంటి లాభాపేక్ష లేని సంస్థ. ఇంతవరకు, కొద్దిమంది కథాప్రియుల ఆసరాతో సౌఖ్యంగానే నడిచినా, పాఠకులు దన్నుదారులైతే మరింత శోభగా ఉంటుందనే ఆలోచనతో మీ ముందుకు వచ్చాం.

వార్షిక చందా **రూ.200/-**

ఆదరిస్తారని ఆకాంక్షిస్తున్నాం.

చందా చెల్లించుటకు ఇక్కడ నొక్కండి

# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నండూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... ... ... | iii |
| కథా మార్గదర్శి | ... ... ... ... ... ... | v |
| కథా పరిచయం | ... ... ... ... ... ... | vii |
| కథాపుస్తక పరిచయం | ... ... ... ... ... ... | ix |
| వినదగునెవ్వరు చెప్పిన | ... ... ... ... ... ... | xi |


## కథలు, వ్యాసాలూ


| | | | |
|---|---|---|---|
| ఉలిపికట్టె | ... | చాగంటి తులసి ... ... ... | 1 |
| కుదించుకున్న జీవితం! | ... | కొత్తపల్లి ఉదయబాబు ... ... | 5 |
| ప్రేమలేఖ(క) | ... | పి. రాజేంద్ర ప్రసాద్ ... ... | 12 |
| విలువ | ... | శింగరాజు శ్రీనివాస రావు ... | 15 |
| అన్వేషణ | ... | విజయార్కె ... ... ... | 20 |
| మొక్కులు | ... | రేపాక కామేశ్వర రావు ... ... | 26 |
| సుకాయించిన! | ... | వారణాసి భానుమూర్తి రావు ... | 31 |
| ఛీ | ... | మెడికో శ్యామ్ ... ... ... | 35 |
| శాస్త్రాంగనలు | ... | ఎలక్ట్రాన్ ... ... ... | 39 |
| పెళ్లికూతురు | ... | వేదగిరి రాంబాబు ... ... | 44 |


Cover Page Credit : Mason McCall, New Jersey

# కథాకీయం

మానవాళికి మంచి జరగాలని యజ్ఞయాగాదులు జరిపించడం నిత్యం చూస్తూనే ఉంటాం! అలాంటి ఆలోచనతో, తెలుగు కథని పది కాలాలపాటు నిలుపుకోవాలని ఎంతోమంది నడుం కట్టుకుని తమ పరిధిలో కొన్ని కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే అలాంటి కార్యక్రమాల్లో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ ప్రక్రియ... కథలను ఆడియో చేసి మాధ్యమాల ద్వారా పదిమందికి చేరేలా చూడటం! అయితే క్రమం తప్పకుండా రోజుకో కథ చొప్పున, మంచి కథలను అందించాలనే ఆలోచనను ఆచరణలో పెట్టి, వెయ్యి రోజులు నిరాటంకంగా వెయ్యి కథలను ఆ ప్రక్రియ ద్వారా అందించటం ఓ అరుదైన విషయంగా అభివర్ణించుకోవాలి. అంతేకాదు.. ఓ కుటుంబం యావత్తు ఆ పనిలో నిమగ్నమై, అనునిత్యం కృషి చేస్తూ తెలుగు కథకి జీవం పోస్తున్నారంటే... ఇది అసలు సిసలైన కథాయజ్ఞం అని చెప్పాలి! అంతే కాదు.. ఆ కథల ఎంపికలో కూడా వారు ఓ మంచి నిర్ణయం తీసుకున్నారు. కుటుంబ వ్యవస్థ, మనుషుల మధ్య బంధాలు, అనుబంధాలు.. ఈ ఇతివృత్తాలతో వచ్చిన కథలనే వారు ఎంపిక చేసుకుని, శ్రావ్యంగా చదివి, చక్కటి నేపథ్యసంగీతాన్ని జతపరిచి, ప్రతిరోజూ ఉదయాన్నే ఆరు గంటలకి కథాప్రియులకు అందిస్తారు. వానొచ్చినా వరదొచ్చినా సరే, నిర్విఘ్నంగా కథ నెట్టింట్లో వాలిపోతుంది.

వందేళ్ళ క్రిందటి కథ నుంచి నేటి వరకు వచ్చిన, వస్తున్న కథలలో నుంచి ఎంపిక చేసి, శ్రవ్యకథలను అందిస్తున్న సంస్థ పేరు "కథా స్రవంతి". దీని రథసారథి శ్రీ ములగాడ సురేష్ కుమార్. కథామంజరి శ్రోతలకు చిరపరిచితులైన శ్రీ పప్పు భోగారావుగారు ప్రధానంగా, తన మాధుర్యమైన కంఠంతో కథలను చదివితే, సాఫ్టవేర్ ఉద్యోగైన వారబ్బాయి సాంకేతిక సహకారం అందిస్తున్నారు. మరో నలుగురైదుగురు కుటుంబ సభ్యులు, కథాభిమానులు మిగతా పనుల్లో నిమగ్నులై, టైము ప్రకారం ప్రక్రియని పూర్తి చేస్తారు. కొన్ని వేలమందికి ఉచితంగా చేరుతూ, మేలుకొలుపులా దశదిశలా వ్యాపించిన ఈ 'యజ్ఞాన్ని' ఆస్వాదించిన, మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షులు శ్రీ యమ్.వి. రామిరెడ్డి గారు, ఆ ట్రస్టు ఆధ్వర్యంలో పెదపరిమి గ్రామం, గుంటూరు జిల్లాలో 7 మే 2023 న "సాహిత్య విందు" పేరిట కేవలం 'కథా స్రవంతి' బృందాన్ని సత్కరించడానికే ఆ కార్యక్రమం ఏర్పాటు చేసారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల్నుంచి విచ్చేసిన రచయితలు, రచయిత్రులను కూడా ఈ మధ్య కాలంలో విడుదలైన కథా, కవితా సంకలనాలతో "సాహిత్య విందు" చేశారు. మరో మంచి విషయం కూడా ఈ సాహిత్య విందులో తెలిసింది.. పన్నెండు మంది ప్రముఖ కథారచయితల కథలను తొమ్మిదవ తరగతి తెలుగు పాఠ్యాంశంగా చేర్చారనే విషయం తెలుగు సాహితీ ప్రియులందరికి ఆనందాన్ని ఇచ్చింది. ప్రాథమిక స్థాయి పాఠ్యాంశాలలో కథకి ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని 'కథామంజరి' ముందు నుంచి భావిస్తూనే వుంది. ఆ విషయం గతంలో ప్రస్తావించాం కూడా! అది సాకారం అయినందులకు ఆనందిస్తూ, ఆ పాఠాల వలన తప్పకుండా బాలబాలికలలో కొత్త చైతన్యం కలగగలదని భావిస్తున్నాం! ఆశిస్తున్నాం!!

ఇక... గత నాలుగైదు సంవత్సరాలుగా తెలుగు కథలను తమ గళం ద్వారా కథాప్రియులకు అందిస్తూ, శాశ్వతంగా కథలను అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్న 'గళ'కారులందరికి అభివందనాలు తెలియచేస్తున్నాం.

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**ఎలక్ట్రాన్**

'ఏమిటీ... సైన్స్ పరిభాషలో వినబడే ఎలక్ట్రాన్‌ని పేరుగాంచిన ఓ రచయితగా పరిచయం చేస్తున్నారా' అని నేటి తరం పాఠకులు ఆశ్చర్యపోవచ్చు గాని, సరిగ్గా ఆరు దశాబ్దాల క్రిందటే, తాను ఉద్యోగం చేస్తున్న ఓ.యన్.జి.సి లో రోజూ ఎదురయే ఆ పదాన్ని తన కలం పేరుగా పెట్టుకుని సుమారు మూడు వందల పైచిలుకు కథలు, ఓ పదకొండు నవలలు (ధారావాహిక) రచించిన మొన్నటి తరం రచయిత "ఎలక్ట్రాన్" ఉరఫ్ పింగళి వెంకటరమణరావుగారు నిన్నటి కథా పాఠకులకు చిరపరిచితులే! 1953 సంవత్సరం అంటే ఎలక్ట్రాన్‌గారి పదహారో ఏట, గోదావరికి వరదలు రావడంతో కాలేజీకి సెలవులిచ్చేసారుట.. ఇంట్లో ఖాళీగా ఉన్నప్పుడు "నువ్వు వ్యాసాలు గట్రా రాస్తావుగా, ఓ కథ రాయొచ్చుగా" అని మేనమామ గారు అనడం, అదే సమయంలో ఆ వూరు వచ్చి ఇరుక్కుపోయిన మేనత్తగారి అబ్బాయి తోడవడం.. ఇద్దరు కలిసి ఓ కథ వ్రాసి, ఆంధ్రపత్రికకు పంపితే, రెండు నెలల్లోనే ప్రచురితం కావడం, పదిహేను రూపాయలు పారితోషికం కూడా అందుకోవడం.. రచనావ్యాసంగానికి నాందీప్రస్తావన అని చెప్పుకోవాలి! అదే ఊపులో మరో కథ వ్రాసే ప్రయత్నంలో ఉండగా, వారి పెద్దన్నయ్య 'చదువులు పూర్తయ్యే వరకు ధ్యాస మళ్ళించుకోకు' అనే హెచ్చరికతో మరో ఏడు సంవత్సరాలు కలం మూలపడిపోయింది. 1960 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎస్సి (అప్లైడ్ ఫిజిక్స్-ఎలక్ట్రానిక్స్) పట్టా తీసుకుని ఓ.యన్.జి.సి.లో ఉద్యోగంలో చేరిన తర్వాత తిరిగి కలం పట్టుకున్నారు. తిరిగి 1980-95 కాలంలో ఉద్యోగభారంతో కలం కథలవైపు పరిగెత్తలేదు. పదవీవిరమణ తర్వాత 1996 నుండి, పట్టాలు తప్పిన కథారచనని తిరిగి పట్టాలమీదకు తీసుకొచ్చిన ఘనత 'రచన శాయి' గారని ఆనందంగా చెప్పే ఎలక్ట్రాన్‌గారు, అసంపూర్తిగా వదిలేసిన ఎన్నో కథలను, నవలలను తిరిగి పూర్తిచేసారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, యువ, జ్యోతి, నవ్య, స్వాతి, రచన.. మొదలైన అన్ని పత్రికలలో తరచుగా ఎలక్ట్రాన్‌గారి కథలు కనబడేవి.

"నాకు నచ్చిన విషయంపై, నాకు నచ్చిన రీతిలో కథలు వ్రాసాను. నా రచనలన్నింటినీ వాదాలకు దూరంగానే ఉంచాను. వాదభరితమైన కథారచన తెలుగు కథల్ని కొత్తపుంతలు తొక్కకుండా చేసిందని నేను అనుకుంటున్నాను. అలాగే మితిమీరిన ఆంగ్లపద ప్రయోగం.. తెలుగు కథని చిత్రహింసలు పెడుతున్నాయి. గతకాలపు రచయితలు పెద్ద కథలు వ్రాసేవారు. కాలక్రమేణా పత్రికలు కథల నిడివి తగ్గిస్తూ పోవడం వలన పఠనంలో సౌలభ్యం పెరిగి, పాఠకులు పెరిగారు. అయితే పేజీలు, వాక్యాలు, ఆఖరికి పదాల సంఖ్యకూ ఆంక్షలు విధిస్తూ ఉండటంతో, కొంతవరకు అవి 'కథ'ని దెబ్బ తీస్తున్నాయి. కరోనా

దెబ్బతో మనుషులే కాదు, పత్రికలు కూడా దెబ్బతిన్నాయి. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోనులు ఇప్పుడు భారతీయ బహుభాషా కథా సాహిత్యాన్ని కనుమరుగు చేస్తున్నాయి. అయితే చెప్పుకోదగ్గ పరిణామం ఏమిటంటే... ముద్రణ పత్రికలు మూతపడ్డా, కొత్తగా అంతర్జాల పత్రికలు ఎక్కువ సంఖ్యలోనే వెలిసాయి. ఏతావాతా పత్రికల సంఖ్య పెరిగినా పాఠకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది!" అంటూ నేటి 'తెలుగు కథ' మీద సుస్పష్టమైన తన అభిప్రాయాన్ని వెల్లడించారు ఎలక్ట్రాన్‌గారు.

15 డిసెంబర్ 1937 న తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో జన్మించిన శ్రీ వెంకటరమణరావు పెద్దాపురం, రాజమండ్రి, విశాఖపట్నంలో విద్యాభ్యాసం ముగించి, ఉద్యోగరీత్యా దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు, అమెరికా, యూరోపు దేశాలలో కూడా పర్యటించారు. గ్రూప్ జనరల్ మేనేజర్‌గా పని చేసి పదవీవిరమణ చేసిన తర్వాత కూడా, కొంతకాలం ముడిచమురు అన్వేషణకి సంబంధించిన శాస్త్రవిజ్ఞానం బోధించే కొన్ని విద్యాసంస్థల్లో సందర్శనోపన్యాసకులుగా పని చేసారు. దాదాపు నలభై సంవత్సరాలు ఉత్తర భారతదేశంలో పనిచేసినా సరే, వెంకటరమణరావుగారు తెలుగుభాషకు దూరం కాలేదు. అయితే భాషలు వేరైనా, సంస్కృతీ సంప్రదాయాలలో స్వల్పమైన తేడాలున్నా , భారతీయులందరినీ ఒక్కతాటిన కట్టి పడేసినవి మన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు మాత్రమే అని నమ్మిన ఎలక్ట్రాన్‌గారి రచనలకు పలు బహుమతులు అవార్డులు వచ్చాయి. వీరి కథలు "నేలమీద నక్షత్రాలు, జనారణ్యం, విలువల వెల ఎంత, ముళ్ళ కుర్చీలు" సంపుటాలు వచ్చాయి. అలాగే "జనారణ్యం" కథవ్యాస సమాచారాన్ని 'Silent explosion' పేరిట ఆంగ్లానువాదం స్వయంగానే చేసారు. ఆ సంకలనం మీద ప్రధానమంత్రి గారి ఆఫీసువారు కూడా అభినందించారు! 85 ఏళ్ల వయసులో కూడా ఎంతో ఉషారుగా సంభాషిస్తూ, రాతకోతలను కంప్యూటర్ మీద చేస్తూ.. ఎంతోమందికి ఆదర్శంగా జీవితాన్ని గడుపుతున్న ఎలక్ట్రాన్‌గా సాహితీలోకంలో పేరుగాంచిన శ్రీ పింగళి వెంకటరమణ రావుగారు ఆరోగ్యంగా పదికాలలపాటు మంచి కథారచనలతో విలసిల్లాలనీ కోరుకుంటూ, అడిగిన వెంటనే కథామంజరి విశిష్ట అతిథిగా విచ్చేయడానికి అంగీకారం తెలిపి, సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

*కథామంజరి బృందం*

# కథా మార్గదర్శి



**కీ.శే. వేదగిరి రాంబాబు**

ఓ నాలుగు వందల పైగా కథలు, వ్యాసాలు వ్రాసి, తన రచనా వ్యాసంగంతోనే సరిపుచ్చుకోకుండా.. తెలుగు నేల మీద పుట్టిన కథలకోసం తన జీవితాన్ని అంకితం చేసిన అతి కొద్దిమంది రచయితలలో అగ్రగణ్యులు, ప్రఖ్యాత కథారచయిత కీ.శే.డా. వేదగిరి రాంబాబు. గడిచిన రెండు మూడు దశాబ్దాల కాలంలో తెలుగు కథ కోసం ఆయన పడిన తపన, కృషి మరువలేనివనే చెప్పాలి. మరో శతాబ్ద కాలం పాటు తెలుగుకథ నిలిచిపోయేటట్టు దీపపు చమురై కాంతి వెదజల్లిన కార్యశీలి డా. రాంబాబుగారని చెప్పితీరాలి. దానికి నిదర్శనమే.. ఆయన చేపట్టిన అతి ముఖ్యమైన కార్యక్రమం... తెలుగు కథానిక శతజయంతి ఉత్సవాలు! అలా తెలుగు కథానికకు శాశ్వత గుర్తింపు రావాలనే ఓ ఆలోచనతో, ఆ ఉత్సవాలు జరపాలనే ఓ సత్సంకల్పం తో, ఆ ఉత్సవాలను విజయనగరంలో 2009 ఫిబ్రవరి 9,10 తేదిలలో గురజాడవారి ఇంటి నుంచే ప్రారంభించి, తెలుగు రాష్ట్రాల నలుమూలలా కథా సదస్సులను నిర్వహించారు. అన్ని జిల్లాల కథానిక చరిత్రపై వ్యాసాలు రాయించి, వాటికి పారితోషికం ఇప్పించి, వాటిని "తెలుగు కథానికకు వందేళ్ళు" గా సంపుటీకరించారు. గురజాడ వారి సాహిత్యమే కాకుండా, వారి జీవనయానం కూడా, డా. రాంబాబుగారిని ఎంతగానో ప్రభావితం చేసి, ఉద్యమశీలిగా మార్చాయి.

తెలుగు కథకి పట్టం కట్టే కార్యక్రమాలకి శ్రీకారం చుట్టి, 1994 లో కథా సదస్సుల నిర్వహణతో తెలుగు సాహితీ లోకంలో ఒక నవ చైతన్యాన్నీ, సంచలనాన్నీ కలిగించారు. కథానిక మీద మక్కువతో... కొత్తకథ, సరికొత్తకథ, వినూత్నకథ, నవతరం కథ, పంచసప్తతి అనే సంకలనాలను తన ఖర్చుతో విడుదల చేసారు. అంతే కాదు..ఏఏటికాయేడు అన్ని పత్రికలలో ప్రచురింపబడిన కథలపై 'కథానిక సమీక్ష' గ్రంథాల్ని 1994, 95, 96, 97 సంవత్సరాలలో ప్రచురించారు. ఇలా వ్రాసుకుపోతే, నాటి గురజాడ వారి నుంచి శ్రీపాద, చింతా దీక్షితులు, చాసో, పాలగుమ్మి, బుచ్చిబాబు నుంచి, కాటూరి రవీంద్ర త్రివిక్రమ్, అవసరాల రామకృష్ణారావు, బలివాడ కాంతారావు వంటి ఎంతోమంది ప్రముఖుల కథలను "వేదగిరి కమ్యూనికేషన్" పేరిట ఎన్నో సంపుటాలను ప్రచురించారు. మరోవైపు ప్రముఖల కథలను నాటికలుగా స్వీయరచన చేసి, దర్శకత్వ నిర్వహణ చేపట్టారు. అవి దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి. డా.రాంబాబుగారు వాటితో సరిపెట్టకుండా, పరిశోధనలు చేసి, జైలు గోడలు మధ్య, పాపం పసివాళ్ళు, అగ్నిసాక్షి, వీళ్ళేమంటారు.. వంటి ధారావాహికాలు రచించి, దర్శకత్వం వహించారు. ఇవన్నీ ఆయా తరగతులకు చెందిన ఛిద్రజీవన విషాదజీవుల వాస్తవ కథనాల నుంచి వచ్చి, చాలా ప్రాచుర్యం పొందాయి!

ఇక..స్వీయరచనలవిషయానికివస్తే..నాలుగువందలకథలు వ్రాసినడా.రాంబాబుగారుపదికథాసంపుటాలువెలువరించారు. వాటిలో "సముద్రం" సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. నాలుగు పరిశోధనాగ్రంథాలు, బాలల గ్రంథాలు, వైద్య, ఆధ్యాత్మిక, విమర్శనా గ్రంథాలు... డా. రాంబాబుగారి కలం నుండి వెలువడ్డాయి. అంతేకాకుండా.. తెలుగు భాషాభివృద్ధికి జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ జర్నలిస్టు, నంది అవార్డు గ్రహీత డా. రాంబాబుగారి గురించి ఏకంగా "కథానికా జీవి డా. వేదగిరి రాంబాబు స్ఫూర్తి పథం" అనే పుస్తకాన్ని ఆయన స్నేహితులు, అభిమానులు కలసి ప్రచురించడం.. ఓ గొప్ప విషయమనే చెప్పాలి.

1952లో చుండూరు (తెనాలి తాలుకా) లో జన్మించిన డా. రాంబాబు 1974 లో డిగ్రీ చదువుతున్నప్పుడే వ్రాసిన మొదటి కథ "సముద్రం" కి ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీలో బహుమతి వచ్చింది. ఆ తర్వాత ఆయన వ్రాసిన కథలు అన్ని పత్రికలలో విరివిగా వచ్చాయి. అద్దంలో బింబం, ఇచ్చట సూరిటీలు..., ఇరుకు వయసు, ఖరీదు, కేవలం కాగితాలకే, చపల చిత్తుడు... వంటి ఎన్నో కథలు పాఠకుల మన్ననలు పొందాయి. అద్భుతమైన శైలి, సుస్పష్టమైన భావజాలం, చదివించే కథనం కథాంశం, విషయ పరిజ్ఞానం... డా. రాంబాబుగారి కథల్లో కనబడతాయి. "తెలుగు పత్రికలు – రచనా ధోరణులు" మీద పరిశోధన చేసి పి.హెచ్.డి. పొందిన డా. రాంబాబుగారు కొన్నాళ్ళు దూరదర్శన్‌లోనూ, తర్వాత పత్రికా జర్నలిస్టుగానూ, కొంతకాలం పత్రికా సంపాదకుడుగానూ పనిచేసారు. ఓ టెలిఫిల్మ్ ఉత్తమ నిర్మాతగా, దర్శకునిగా రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు అందుకున్న డా. రాంబాబు గారు అవార్డులు, రివార్డులు, సత్కారాలు... చాలానే అందుకున్నారు.

ఒక వ్యక్తిగా కాకుండా ఓ ఉద్యమ శక్తిగా తన జీవితాన్ని సాహిత్యానికే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడేలా నిరంతరం కృషి చేసిన డా. వేదగిరి రాంబాబుగారు 18 ఆగస్టు 2018 న తన 65 ఏటనే పరమపదించడం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటే! తెలుగు కథానిక కోసం అహర్నిశలు కష్టపడిన డా. రాంబాబుగారికి మా నివాళి అర్పించుకుంటున్నాం!

*కథామంజరి బృందం*

# కథా పరిచయం

## భాస్కర్ పులికాల్ (నిర్మలాదిత్య) గారి కథ "కొవ్వొత్తి దీపం"

మొన్ననీమధ్య భాస్కర్ పులికాల్ గారి పుస్తకం 'సైబీరియన్ క్రేన్స్' నాచేతికి వచ్చింది. 'నిర్మలాదిత్య' ఆయన కలం పేరు. ఇక్కడ రచయిత గురించి కొంచెం చెప్పాలి. ఒకప్పటి చిత్తూరు జిల్లాలో పాకాల మండలంలో రావణయ్యగారి పల్లె అనే పాతిక ఇండ్ల కుగ్రామంలో ఒక చిన్న ఇంట్లో జన్మించిన భాస్కర్‌గారి అదృష్టమేమిటంటే, అదే ఇంట్లో పుట్టిన ప్రముఖ కథకుడు మధురాంతకం రాజారాం గారి మేనల్లుడవడం. ఆ ఇంట్లోంచి భాస్కర్‌గారితో కలిపి అయిదుగురు కథకులు పుట్టడం విశేషమే. అమెరికాలో నివాసమేర్పరచుకున్నా తన మూలాలు మరచిపోని వినమ్రత, ఆలోచన కనిపిస్తాయి కథలలో.

1986 నుంచి 2018 వరకు భాస్కర్‌గారు రాసిన కథలు 24. అందులో 11 ఇండియా కథలు, 13 అమెరికా కథలు (అంటే అమెరికాకొచ్చిన తరవాత రాసినవన్నమాట – ప్రస్తుతం ఆయన అమెరికాలో స్థిరపడ్డారు). అంటే సుమారుగా ముప్పై రెండు సంవత్సరాల్లో రాసినవి ఇరవైనాలుగు కథలన్నమాట – మధ్యలో కొన్నాళ్ళు 'కలం సన్యాసం' తీసుకున్నారనుకున్నా, సంవత్సరానికి ఒక కథకు మించి రాయలేదు. చదివిన ప్రతి కథలోనూ ఏదో ప్రత్యేకత కనిపించింది. అన్నీ రచయిత గుండెల్లోంచి ఉబికి వచ్చినట్లుగా ఉన్నాయి. ప్రతి కథలోనూ మానవత్వపు సడి వినిపించింది. ఆర్ద్రత కనిపించింది. కథలలో వైవిధ్యం ఉంది. చదివి మెచ్చుకోగలిగిన కథలు.

ఈ నెల కథామంజరి పాఠకులకు భాస్కర్‌గారు రాసిన, నాకు నచ్చిన 'కొవ్వొత్తి దీపం' పరిచయం చేస్తున్నాను. కథ ఆంధ్ర ప్రభ 1991 లో ప్రచురించబడింది. కథ చిన్నదే.

కథ ఉత్తమ పురుషలో నడుస్తుంది. మూర్తి ఒక ఆఫీసులో పని చేస్తూంటాడు. ఆ ఆఫీసుకి మార్కెటింగ్ మేనేజర్ చటర్జీ. మూర్తికి ఆయనంటే చాలా ఆరాధనా భావం. చటర్జీ తన ఆఫీసు అలంకరించుకునే విధానమైనా, ఆలోచనా తీరు అయినా, పనిలో ఆయన చూపే నిపుణత అయినా, ఎప్పుడూ నవ్వుతూ ఎలాంటి కోపతాపాలు చూపించని తత్వమైనా, మూర్తికి ఇష్టం. అంతే కాదు ఆయన సన్నిధిలో ఆయన దగ్గర పనిచేసే వారి ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరగడం తన సహోద్యోగులందరికీ అనుభవమే. ఇలాంటి వారంటే ఎవరికి ఇష్టముండదు!

మూర్తికి బొంబాయికి (అప్పట్లో బొంబాయి ముంబాయి అవలేదింకా) ట్రాన్స్ఫర్ అవుతుంది – ఎంత కాదనుకున్నా. వెళ్ళక తప్పదు. చటర్జీ ఉన్న ఆఫీసుకి వస్తాడు మూర్తి ట్రాన్స్ఫర్ గురించి చెప్పడానికి. రావడానికి ఇంకో కారణం కూడా ఉంది.

చటర్జీకి ఒక అలవాటుంది. తన్నెక్కడికి ట్రాన్స్ఫర్ చేసినా, తనలాగా మిగతావారు ఇబ్బంది పడకూడదని, ఆయా ప్రాంత విశేషాలతో ఒక ఫైలు తయారు చేస్తాడు. అలాంటి ఫైల్సు ఎవరు ఆయా ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చినా, ఆ ఫైలు తీసుకుని, చదివి, తిరిగి అతనికే ఇచ్చేయ్యడం పరిపాటి.

బొంబాయికి వెళ్తున్న మూర్తి చటర్జీ ఆఫీసుకు రావడానికి అదో కారణమన్నమాట. "కొంచెం గాభరాగా ఉంది, క్రొత్త ఇంటిని వెదకటం దగ్గరనుంచి పిల్లల స్కూళ్ళ వరకు అన్నీ గొడవలే..." అని తానొచ్చిన మాట బయట పెడతాడు.

ఒంట్లో బాగులేక పోయినా ఒక పద్ధతిలో తన మాత్రలని అమర్చుకుంటున్న చటర్జీ, తను తయారుచేస్తున్న ఫైల్స్ గురించి చెప్పి బొంబాయి ఫైలు తీసి ఇస్తాడు. వెళ్ళే ముందు ఫైలుని ఎంత జాగ్రత్తగా ఉంచుకోవాలో చెప్పి, అవసరమైన తర్వాత తిరిగి ఇమ్మని చెప్తాడు.

ఫైలులో ఒక విషయ సూచిక, అందులో నగర చరిత్ర, నగరానికి చేరే మార్గాలు, ఇల్లు వెతుక్కోవడమెలా, కంపెనీ క్వార్టర్లు ఎక్కడెక్కడున్నాయి, ఎలా అప్లై చెయ్యాలి, ఇలా..., సామాన్లు ఎలా తరలించాలి, పాకింగ్ ఖర్చులెంత, బిల్లు ఎలా సబ్‌మిట్ చెయ్యాలి, పిల్లల స్కూళ్ళు, కాలేజీ వివరాలు, నగరంలో తిరగడానికి ఉన్న రవాణా సదుపాయాలేమిటి, రేషన్ కార్డు మార్పించడమెలా, కార్లు, మోటారు సైకిళ్ళ లాంటి వాహనాల రేజిస్ట్రేషన్లు ఎలా మార్పించాలి, ఏయే వస్తువులు ఎక్కడ చవుకగా దొరుకుతాయి, ఇలాంటి వివరాలెన్నో ఆ ఫైల్లో ఉన్నాయి.

అన్నిటినీ చదివి నోట్ చేసుకుని ఫైలు వాపస్ చేశాడు మూర్తి. ఫైలు ఉపయోగపడినందుకు చటర్జీ కూడా ఆనందం వ్యక్తం చేశాడు.

ఆర్నెల్లు గడిచిపోయాయి బొంబాయి వచ్చి! ఆ ఫైలులోని విషయాలు తను తొందరగా స్థిరపడడానికి బాగా ఉపయోగ పడ్డాయి.

ఒక రోజు ఒక పెద్ద కవరు రిజిస్టరు పార్సెల్‌గా వస్తుంది. ఎక్కడనుంచో కాదు, చటర్జీ గారి దగ్గర నుంచే. అందులో రెండు కవర్లున్నాయి. ఒకటి పెద్ద ఫైలు, రాండోది మూర్తికి రాసిన ఉత్తరం.

ఫైలులో విషయసూచిక చూశాడు మూర్తి. అందులో కనిపించినవి – 1. ఆర్థిక పరిస్థితి, 2. హాస్పిటల్ మేనేజ్‌మెంటు, 3. శ్మశాన వైరాగ్యం, 4. ఫామిలీని సముదాయించడం, 5. ప్రావిడెంట్ ఫండ్, ఎల్.ఐ.సి. పెన్షన్, 6. రి సెటిల్మెంట్. మొదటి నాలుగు చాప్టర్లు రాయబడ్డాయి. చివరి రెండు ఖాళీగా ఉన్నాయి.

మొదటి చాప్టర్లో చటర్జీ గారు తనకు ఎంతెంత డబ్బు ఏయే బాంకుల్లో ఉన్నదో ఆ ఎకౌంట్ వివరాలు, స్థిర చరాస్తుల వివరాలు, లోను వివరాలు, ఎల్.ఐ.సి పాలసీలకు ఏ విధంగా నామినేషన్లు దాఖలు చేయాలో వివరాలు రాసి ఉన్నాయి. రెండో చాప్టర్లో కాన్సర్, ఆస్మా, షుగర్ ఉన్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎవర్ని కలవాలో ఆ డాక్టర్లు, హాస్పిటల్ వివరాలున్నాయి. మూడో చాప్టరులో మనిషి చనిపోయిన తరువాత జరిగే తతంగం, ఏ ఏర్పాట్లు, ఎలా చెయ్యాలో రాసుంది. నాలుగో చాప్టర్లో బంధువుల్ని ఎలా సముదాయించాలో తనకు తోచిన విధంగా రాసి రీడర్స్ డైజెస్టులో వచ్చిన ఒక చక్కటి ఆర్టికిల్ జత చేశారు.

రెండో కవర్లో తనకు రాసిన ఉత్తరాన్ని చదువుతాడు మూర్తి. అందులోని విషయాలివి, సూక్ష్మంగా.

చటర్జీ తనకు ఈ ఫైలు ఎందుకు పంపిందీ చెబుతాడు – మూర్తి ఎంత నిజాయితీపరుడో, పని ఎంత చక్కగా, ఎంత శ్రద్ధగా చేస్తాడో, అదే విధంగా ఈ ఫైలుని పూర్తి చేయగలడన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ. ఈ ఉత్తరం మూర్తిని చేరే వేళకి తను శరీరమనే వస్త్రాన్ని వదిలి మరో వస్త్రం ధరించడానికి తయారవుతూ ఉంటానేమో అని చెప్తాడు.

పి ఎఫ్, ఎల్.ఐ.సి లలో వచ్చిన డబ్బుని సాధ్యమైనంత త్వరలో తన భార్యకి ఇప్పించమని, దానికి కావలసిన పత్రాలను జతపరిచానని రాస్తాడు. అలా అందజేయడంలోని సాధకబాధకాలను అయిదో చాప్టరుగా రాయమని చెప్తాడు.

తన భార్య వయసు నలభై ఏళ్ళేనని, ఇంకా 18 ఏళ్ళు పని చేయడానికి వీలుందని, 'కంపాసినెట్ గ్రౌండ్స్' మీద తాము పని చేసే కంపెనీలో ఉద్యోగం ఇప్పించమని, దానికి కావలసిన ఫార్మాలిటీస్ అన్నిటితోపాటు మూర్తి అనుభవాలని కూడా రాస్తే చివరి చాప్టరు కూడా పూర్తి అవుతుందని రాస్తాడు.

ఇక తను ఎందుకీ ఫైల్స్ తయారు చేస్తాడన్నది చివరగా చెప్పిన వాక్యాలు. “మనిషి అశాంతికి, దుఃఖానికి, కారణం –తను తరువాత ఏం చేయాలి? తనకు భవిష్యత్తులో ఏం జరగబోతోందో? అన్న సందేహం, భయం. దీన్నే నేను ‘ఫియర్ ఆఫ్ ది అన్నోన్’ అని అంటాను.” మూర్తి బొంబాయి నగరానికి ట్రాన్స్ఫర్ అయినప్పుడు కలిగిన భయం తనకి తెలీని విషయాలపై కలిగిన భయమే కదా! అలాగే మనుష్యులకి దేవుడన్నా, దయ్యాలన్నా భయం కలగడానికి కారణం తాము ఎప్పుడూ చూడలేరు కాబట్టి, వాటి గురించి తెలీదు కాబట్టి.

అందుకే తనకి తెలిసిన విషయాలను, తన అనుభవాలను ఒకచోట సమకూర్చి, తెలీని వారికి తెలిసేలా చేసి, వారిలో సందేహాలను తీర్చి, ఆ ‘తెలియని’ భయాన్ని తొలగించడం – తన పరిధిలో – ఒక ఆశయంగా పెట్టుకుని ఈ ఫైల్స్ తయారుచేయడం జరిగింది.

ఇక్కడ కథలో కొంత యధాతథంగా చెప్పడం కథకూ, రచయితకూ న్యాయం. ఇవీ, చటర్జీ గారు రాసిన ఉత్తరంలో చివరి వాక్యాలు.

“నా జీవితం బ్రతికినన్నాళ్ళు వీలైనంత సంతోషాన్నే అనుభవించాను. కానీ మూర్తి గారూ! ఇప్పుడు చనిపోయిన తరువాత ఒక్కటే నాకు తీరని కోరిక. అసలు మనిషికి అన్నింటికంటే భయం కలిగించేది చావు. కారణం నేనన్నదే ‘ఫియర్ ఆఫ్ ది ఆన్నోన్.’ చావు తరువాత ఏం జరుగుతుందో? ఏమౌతామో? మృత్యువు తరువాత ఏమవుతుందో మనకెవ్వరికీ తెలీదు. ఈ ఫైలు మీకు అందే పాటికి, నాకా రహస్యం తెలిసిపోయి ఉంటుంది. ఆ విషయంపై నేనో ఫైలు వ్రాయగల్గినా దానిని మీ లోకంలోకి పంపడమెలా అన్నదే నా బాధ. మరి సెలవా మూర్తిగారూ!”

ఇదీ కథ.

కథలో సస్పెన్స్ ఉందని కాదు. కథలో ఊహించని మలుపులున్నయ్యని కాదు. ఏడెనిమిది పేజీల చిన్న కథ. కాని రచయిత కథకు తీసుకున్న విషయం నన్ను ఎంతగానో ఆకర్షించింది. కథ చెప్పిన విధానం బాగుంది. చటర్జీ పాత్ర చిత్రీకరణలో రచయిత చెప్పిన విధానం బాగుంది. కొన్ని మేనరిజమ్‌లు వివరించడంలో రచయిత ఎంచుకున్న ఉదాహరణలు పాఠకుల మనసులలో చటర్జీ పాత్ర చక్కగా నిలిచిపోతుంది.

1991 లో, ముప్పై సంవత్సరాల క్రితం వచ్చిన ఈ కథ నన్ను ఆకట్టుకుంది. కథ నచ్చడం, నచ్చకపోవడం ఎవరి వారి మనస్తత్వాలపై ఆధారపడి ఉంటుంది. అయినా ఈ కథ చాలా మందిని కొంచెమైనా కదిలిస్తుందేమోనని అనిపించింది.

చిన్న ఉదాహరణ. చాలామందిమి అమెజాన్‌లో ఎన్నో వస్తువుల్ని కొంటాము. ముందస్తుగా రివ్యూలు చదువుతాం. రేటింగులు చూస్తాం. అయితే వస్తువు కొన్న తరువాత ఎంతమంది రివ్యూలు పెడతాం? రేటింగులిస్తాం? మనకి అవి కావాలి. కాని మనమా ఫీడ్‌బాక్ ఇవ్వం. ఇది సహజం. వస్తువు సరిగా ఉన్నా ఇవ్వచ్చు, సరిగా లేకపోయినా ఇవ్వచ్చు. రెండు విధాలుగానూ తరువాత కొనేవారికి ఉపయోగిస్తుంది కదా?

అప్పట్లో ఈ రకమైన ఆలోచన వచ్చిన రచయితని మెచ్చుకోకుండా ఉండలేను. జీవితంలో కావలసిన ఎన్నో విషయాలకు మాన్యువల్స్ రాస్తే ఎలా వుంటుంది? మనకి అప్పుడు కొంచెం కాకపోతే కొంచెమైనా అశాంతి తగ్గుతుందా?

తెలీదనుకున్న విషయాన్ని తెలుసుకుంటే తెలీని ఆ భయం పోతుందా? భయాలకన్నిటికీ అజ్ఞానమే కారణమవనక్కరలేదు. కానీ, అజ్ఞానమున్న చోట భయముండే అవకాశం ఎక్కువ. భయం కంటే ముందు ఆందోళన సహజమైనది. ఆ ఆందోళన తొలగించేది జ్ఞానమే కదా!

రచయిత అక్కడితో ఆగలేదు. మృత్యువు అంటే మనుష్యులకున్న భయాన్ని జ్ఞానంతో తొలగించవచ్చా? స్వాములు, జ్ఞానులు తెలుసుకోమనే 'నిజం', శాస్త్రజ్ఞులు తెలుసుకోవాలనే నిజం ఒకటి కావా? కథలో కనిపించే తాత్వికత రచయిత మనసులోంచి వచ్చింది.

ఈ కథ చదివి మధురాంతకం రాజారాం గారు "కుటుంబ పరిధిని దాటి, తాత్కాలిక సమస్యల్ని అధిగమించి, మానవ జీవితానికి సంబంధించిన నిగూఢమైన, నిరంతరమైన, నిరుత్తరమైన ఒక రహస్యం వైపు పయనించిన కథ ఇది. ఆచి తూచి పేర్చుకుంటూ పోయిన వాక్యాల వల్ల కథాశిల్పం బాగా కుదిరింది. బాగా అంతర్ముఖుడైన కథకుడు మాత్రమే ఇలాంటి ప్రయత్నం చెయ్యగలడు" అంటారు.


కథ కొన్ని ప్రశ్నల్ని లేవనెత్తుతుంది. పెద్ద కంపెనీలలో ఎలా అయితే డాక్యుమెంట్స్ ఫైల్ అవసరమవుతాయో, మన జీవితాల్లో కూడా అలాంటి ఫైల్స్ అవసరమే కాదా?

ఈ కథ, తక్కిన కథలు చదవదల్చుకున్నవారు నవోదయాలోనూ, విశాలాంధ్రా బుక్‌హౌస్ లోనూ దొరికే ఈ 'సైబీరియన్ క్రేన్స్' అనే పుస్తకాన్ని పొందవచ్చు.

***పరిచయకర్త – శాయి రాచకొండ***

## కథాపరిమళాలు

ఏభై ఆరు కథలు, ఏభై ఆరు కథకులు..! ఇంతమంది రచయితల కథలను సంకలనంగా వేయడం, ఈ కథాపరిమళాల సంపాదకులు శ్రీ ఎన్.కె. బాబు గారికి కొత్త కాదు. మూడేళ్లలో ఇది ఆరో కథాసంకలనం. ఇప్పటివరకు 121 మంది రచయితల 257 కథలను పాఠకలోకానికి అందించారు. ఈ కథాపరిమళాలలో 15 మంది రచయిత్రులు కూడా పాలుపంచుకున్నారు. ఎలాంటి పరిధులు, పరిమితులూ లేకుండా, ఉత్తమ కథలను ఒక చోట చేర్చి అందించే కార్యం చేస్తున్న శ్రీ బాబుగారి ఈ కథాపరిమళం.. మార్చి 2023 లో విడుదలయింది. ఖరీదు ₹350/-





ప్రతులకు..

ఎన్.కె. పబ్లికేషన్స్
24-8-1, సమీర్ రెసిడెన్సీ
విజయనగరం - 535:002
(ఫోన్.. 9440343479)



## స్పర్శవేది

ప్రముఖ రచయిత శ్రీ ఎమ్వీ రామిరెడ్డిగారి పదహారు ఆణిముత్యాల్లాంటి కథలతో ఈ స్పర్శవేది కథాసంకలనం ఆగస్టు 2021లో విడుదలయింది. కాళీపట్నం రామారావుగారు, విహారి, ద్విభాష్యం, విరించి, ఆచాళ్ళ ఉమామహేష్ వంటి మహామహులు అందించిన అభినందనల మాటలు చదివిన తర్వాత, ఆ కథలను చదవలేకుండా ఉండలేరు! ముప్పా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు, పెదపరిమి, గుంటూరు జిల్లా వారి సౌజన్యంతో వెలువడిన ఈ కథాసంకలనం ఖరీదు ₹ 160/-.




ప్రతులకు..

యమ్.వి. రాజ్యలక్ష్మి,
ఫ్లాట్ నెం. ఎ–904,
1ఫెజ్, రామ్కి గెలక్సి,
నల్లగండ్ల గ్రామం,
హైదరాబాద్ – 500 019
ఫోన్:9866777870



మే నెల కథా మంజీరం కొత్త మార్పులతో వచ్చింది. ఈతి బాధలు లెక్క చేయకుండా తెలుగు కథ మీద ప్రేమతో, బాధ్యతతో రచనలు చేస్తున్న, ప్రచురిస్తున్న తద్వారా కథాసాహిత్యానికి సేవ చేస్తున్న వారికి జేజేలు పలుకుతున్న సంపాదకీయం బాగుంది.

శాయి రాచకొండ పరిచయం చేసిన కథ క్విల్ట్. డయాస్పోరాకు సరిగ్గా సరిపోయే కథ. కథాసంగ్రహాన్ని కుదురుగా అందించారు. పాఠకులుగా మేము మీ నుండి ఆశిస్తున్నది ఇలా మాకు తరుచూ ఎదురుగాని కథల పరిచయాన్నే! ఈ కథలో భలే మాట ఉంది –Personal differences are like air balloons, pop them with a Kiss. అఫ్ కోర్స్. ఎక్కువ మంది చెప్పే మాటే. కానీ ఈ కథానేపథ్యానికి సూటైన మాట. థాంక్ యూ శాయి గారూ! శాయి – సాయి, ఏది రైటో? ఈ నెల నుండి కథా సంపుటాల పరిచయాలు వాటి లభ్యత గురించిన వివరాలు. ఆలోచన బాగుంది. ప్రయోజనకరం కూడా!

*అర్ధాంగి (విరించి)* కథలో మధుసూదనం పాత్ర శిల్పం కుదరలేదు. అతనికి వచ్చిన సమస్య సామాజిక సేవతో కాదు అధిక తాగుడుతో కదా!

*ప్రేమార్ణవం (వాడపల్లి పూర్ణకామేశ్వరి).* ఇందులో సామాజిక సంక్షేమ మంత్రాలయం అంటే? Social Welfare Ministry అనేనా? అందులో CDO పోస్ట్ ఉందా? ఉంటే ఆయన/ఆమె District Magistrate నియంత్రణలో విధులు నిర్వహిస్తారా? కథలో ఎక్కడా కనపడని రాజారాం మాస్టారు ఒకే ఒక్క చోట మెరుస్తాడు. ఈ మాత్రం దానికి మరో పాత్ర సృష్టి ఎందుకు? అన్ని రాజకీయ పార్టీలు కులగణన కూడా జరగాలని గట్టిగా కోరుకుంటున్నాయి. రచయిత్రి అభిప్రాయమేమిటో? ఇంతకీ ప్రేమార్ణవం అంటే???

*అపవాదు ( ఘండికోట విశ్వనాధం)* కథను ఎలా పడితే అలా రాసినట్టు కనిపించింది. ఇంతకీ 25 ఎకరాలకు పైగా విస్తీర్ణం ఏ రకమైన గోల్ఫ్ ఆటకు సరిపోతుంది? 9 holes (11–15 ఎకరాలు), 18 holes (30 ఎకరాలు). 'పైగా' పదంతో తూకం సరిపోయిందంటారా? కానివ్వండి. అలాగే ఇచ్చిన పని చురుగ్గా చేయడం, గోల్ఫ్ ఆడటం అతని బలహీనతలు(?)

కింది సంభాషణ చూడండి.

> *"కార్ఖానాలో ఏ సమస్య వచ్చినా... .. మరెవ్వరూ లేరా?..."*
>
> *"ఈ రాష్ట్రానికి చెందని వాడినైనా నేనంటే మా అధికార్లకి ఎంత గురి!"*
>
> *"అయినా ఒళ్ళొంచి పని చేయడం అనేది మన తెలుగువాళ్ళకి అలవాటే గానీ .... కష్టపడండి. ఫలితం ఆశించకండి."*
>
> *........ " మీరు చేరి పదేళ్ళు దాటుతోంది. ప్రమోషన్ ఇప్పటికీ రాలేదు."*

ఏమిటో ఆగమాగం! ఒక దారీతెన్నూ లేకుండా కథ నడిచింది. కథ మొదట్లో తెలియాల్సిన కథా కార్యస్థలం మధ్యలో ఎక్కడో వస్తుంది. అంతా కన్ఫ్యూషన్. ఫలితం ఆశించొద్దు. ప్రమోషన్ రాలేదు. ప్రమోషన్ రాలేదని అఘాయిత్య ప్రయత్నం. కథ పేరు అపవాదు. (!?)

*సర్దుబాటు (మాధవి బైటారు).* ఇంతకీ 'ఇగో'లతో ఇబ్బంది పడుతున్న భార్యాభర్తలకు పెద్దవాళ్ళు చెప్పిన మాటలేమిటో కనీసం నా చెవిలోనైనా చెబుదురూ! ఇంతకీ మీకు తెలిస్తేనే సుమా!!

ఎప్పటి మాదిరిగానే అతిధుల కథ 'మాక్లీదుర్గంలో కుక్క' బాగుంది. అధ్యయనం చేయాల్సిన కథ. కుక్కలతో కథను నడిపి, మనుష్యుల మనస్తత్వాలు, సామ్యవాద భావనలు ... వ్యంగ్యంగా గుదిగుచ్చిన రచన.

కథలు రాస్తున్న వారి సంఖ్య ఎక్కువే. కానీ సీరియస్‌గా రాస్తున్న వారి సంఖ్య ఎంత? బహుశా సరైన మార్గదర్శకత్వం చూపే వారు కరువనుకుంటాను? పెద్దలు ఎవరైనా పూనుకుంటే బాగుణ్ణు. ఇంతకు ముందు కథామంజరి సంపాదకత్వం ఈ దిశలో ప్రయత్నం చేసినట్టున్నారు కానీ ఫలితం లేదు. నేర్చుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు కాబోలు!! రాసిందంతా చదివి నేను పెసిమిస్ట్‌ని అంటారా? ఫరవాలేదు. రాయడం తప్పులెంచడం అంత సులభం కాదు. నిజమే!! కానీ నా వైపు నుండి కూడా ఓ కారణం చెప్పగలను. అది నా సమయం. కాదనరు గదా! ఉచితంగా OTT కంటెంట్, డిజిటల్ టెక్స్ట్ కుప్పలకొద్ది దొరుకుతుంటే ఆ సమయాన్ని, చదవడం కోసం కేటాయించాలంటే రచయతలు కష్టపడాల్సిందే. ఏమంటారు? నా అభిప్రాయాలతో ఏకీభవించకపోయే హక్కు మీకుంది. అది అంగీకరించాల్సిన బాధ్యతా నాకుంది.

– **రాంబో**

## "చేవగల చిగురుకొమ్మ"

మే నెల 'కథామంజరి' లో ప్రచురించిన శ్రీ ఘండికోట విశ్వనాధం కథ "అపవాదు" అద్భుతంగా పండింది. చెయ్యితిరిగిన రచనలా ఉంది. నిజాయితీగల ఇంజనీర్ పడే వేదనని చక్కగా ప్రతిబింబించాడు రచయిత. ఇహ, ప్రకృతి వర్ణనలు – "నిశ్చలమైన సరస్సు – నీళ్ళలో కెంపులు – సూర్యాస్త సమయం..." మనోహరంగా ఉంది. 'ఘూర్ణిల్లడం' లాంటి పదాలు రచయితకు భాషపై పట్టుకు పట్టుగొమ్మలే. కథానాయకుడు స్నేహితుడు తెచ్చిన ఫేక్ న్యూస్‌కి కృంగిపోయినా, అదే స్నేహితుడు ఒరిజినల్ ప్రమోషన్ లిస్టు చూపిస్తాడు – వారి మచ్చలేని స్నేహానికి అది మచ్చుతునక. కథనంలో మనోజ్ఞత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రచయిత స్వతంత్ర శైలి ప్రస్ఫుటంగానే తెలుస్తోంది. ఇది కథల పోటీకి పంపిన కథ. కాయ/పండు కోసి తిన్న తర్వాతనే చెట్టుపేరు తెలుస్తుంది – కదా! ఇంకొన్ని మంచి కథలు ఇతని నుంచి ఆశిద్దాం. రచయితకి అభినందనలు. 'కథామంజరి'కి కృతజ్ఞతలు.

– ***భమిడిపాటి సుబ్బారావు***
సౌభాగ్యరాయ పురం

# ఉలిపికట్టె

చాగంటి తులసి



✆ 7995691171

***నిజమే! ఆలోచించి చూస్తే దేశంలో బీదాబిక్కీ ఉండాలి. వాళ్ల సంఖ్య ఎంత పెరిగితే అంత మంచిది. ముష్టివాళ్లంటూ లేకపోతే ముష్టి ఎవరికి వేస్తారు? పాత్రత ఎరిగి దానం చెయ్యమన్నారు. వాళ్లకన్నా పాత్రత ఉన్నవాళ్లు ఇంకెవరు? దానం ధర్మం చెయ్యాలంటే ఫిలాంత్రఫిస్టులం అవాలంటే వాళ్లు ఉండి తీరాలి. వాళ్లే లేకపోతే ఇచ్చేవాళ్ల మొహాల్లో గొప్ప సంతోషం ఎలా వెలుగుతుంది? ఔదార్యం, దాతృత్వం, దాక్షిణ్యదృష్టి గొప్ప ఉత్కృష్ట గుణాలు! అవి పెరగాలంటే పోటీ ఉండాలి!***

"ఆవిడ దగ్గరకా నేను రాను బాబూ!" అన్నాడు ఓ కుర్రాడు.

"ఆవిడో ముళ్ల కంప!"

"అలా అంటే ఎలా?" అన్నాడు శీను.

"ఆవిడతో మాట్లాడ్డం కష్టం!" అన్నాడు ఇంకో కుర్రాడు.

"ఏం? ఎలా మాట్లాడుతుందేం?" అడిగేను నేను.

"నువ్వన్న ప్రతి మాటనీ కాదంటుంది! ఆవిడ చెప్పినదానికి 'అవును' అని ఆవిడ ఎదుట తల ఆడించక తప్పదు!"

నిజమే! తల వాయగొట్టింది. తలవాల్చుకుని విండమే తప్ప నోరెత్తి మరోమాట అండం చేతకాలేదు.

ఆవిడ చెప్పినవన్నీ సత్యాలే!

సత్యాన్ని ఖండించడం కష్టం!!

నా ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది!

కొత్తగా వచ్చేం ఈ కోలనీకి. శీను నా ఈడువాడే. పక్కపక్క ఇళ్లు అవడంతో స్నేహం కలిసింది. దగ్గరయ్యేడు. ఇద్దరం ఉద్యోగాల వేటలో ఉన్నాం. ఈ టెస్టనీ, ఆ టెస్టనీ ఈ పరీక్షనీ ఆ పరీక్షని వెళ్తున్నాం. ఏదీ కలిసిరావటం లేదు.

ఊళ్లో వినాయక చవితి హడావిడి మొదలయింది. మా పక్క కోలనీ వాళ్లు అయిదారడుగుల గణపతి విగ్రహాన్ని కటకం నుండి తెప్పిస్తున్నారట! శీను కబురు పట్టుకువచ్చాడు.

పెద్ద చెరువు గట్టున చిన్నాపెద్దా విగ్రహాలు అమ్మకానికి కొలువు తీరుతున్నాయి.

"మన కోలనీలో మనమూ వినాయకుణ్ణి పెడ్దాం. వాళ్ల కన్నా ఘనంగా చేద్దాం!" అంటూ శీను నలుగురు కుర్రాళ్లనీ పోగేసేడు!

డబ్బు బాగానే దండేం. దండొద్దామరి! పెండాలు వేదిక కట్టాలి. పేద్ద విగ్రహం తేవాలి. ఓరోజు సంబరం కాదాయె! పూరాగా తొమ్మిదిరోజులు! నవరాత్రులు!

పూజాప్రసాదాలు, తెల్లారీ తెల్లారకుండా వినాయకస్తుతీ 'ఏకదంతం మహాకాయం, వినాయకాష్టకం' కోలనీలోనే కాక చుట్టుపక్కల అంతటికీ వినిపించాలి. తర్వాత సినిమా పాటలు హోరెత్తాలి. ఇరవై ఒక్క రకాల పత్రీ, పువ్వులు, పళ్లు, ధూపదీపాలు, అనుపు నాటికి పెద్దలారీ, బేండు, బార్‌లైటు దీపాల తోరణాలు, ఊరేగింపు పెద్ద ఎత్తున జరపాలి. ముష్టివాళ్లకి, బీదాబిక్కికి పులిహోరా మిఠాయితో భోగాలు పెట్టాలి!!

అదిగో చందాలకని బయల్దేరి నలుగురిళ్లకీ తిరిగామే, అప్పుడు ఆవిడ గురించి విన్నాను. నలుగురితో కలిసి ఆవిడ ఇంటికి వెళ్లేను. గేటు స్థంభం మీద డా.డబ్ల్యు.పిచ్చమ్మ అని చూసి "డాక్టరా?" అని అడిగాను.

"జబ్బుల డాక్టరు కాదు"




"మరి?"

"సైంటిస్టుట! ఎక్కడెక్కడో పని చేసిందట! పుట్టిన ఊరి మీద మమకారంతో ఇక్కడికి వచ్చిందట!"

"ఇప్పుడు ఏం చేస్తున్నాదీ?"

"నిన్నూ నన్నూ తిడుతూ ఉంటుంది! అదే పని!"

"పేరే కాదు. నిజంగానే పిచ్చిదిలే!

రక్కెస పొదో, గచ్చపొదో అన్నట్టు ఆవిడ గురించి అందరూ చెప్పారు.

ఒక్కొక్కరిని చూడగానే రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టాలనిపిస్తుంది. ఒక్కొక్కరికి పక్కనున్న వాళ్లు 'దణ్ణం పెట్టరా' అని పొడిచి చెప్పినా దణ్ణం పెట్టబుద్ధి కాదు.

పిచ్చమ్మగారిని చూసీ చూడగానే అప్రయత్నంగా దణ్ణం పెట్టాను.

రిటైరయిన పెద్దావిడలాలేదు. సన్నగా పొడుగ్గా చిన్న అమ్మాయిలా ఉంది!!

"ఈ అబ్బాయి ఎవరూ? కొత్త కుర్రాడిలా ఉన్నాడూ?" అంటూ నాగురించి భోగట్టా చేసింది.

ఆవిడ ఇంటి నుంచి తిరిగివచ్చాం. అందరి మొహాలు ముడుచుకునే ఉన్నాయి.

"ఆవిడ ఇంటికి వద్దురా అన్నానా? విన్నారా?" అన్నాడు ఒకడు.

"గంటసేపు పూరాగా గంటసేపు చావబాదింది" అన్నాడు మరోడు.

"పోన్లేరా!"

"ఆవిడ మాటలు ఈ చెవితో విని, ఆ చెవితో వదిలేయాలి! మనకి ముందే తెలుసు!"

"నాకలా అనిపించటం లేదు. అవునూ! ఎందుకట ప్రతి కోలనీకీ ప్రతీపేటకీ, జంక్షనుకి ఓ పెండాలు ఓ పెద్ద బొమ్మా పూజానూ? మనం వినాయకుణ్ణి పెట్టొద్దు!" అన్నాను.

"సరిసరి! పిచ్చమ్మగారి పిచ్చి తలకెక్కిందీ!!!"

"చందాలెత్తేం. అనుకున్నదానికన్నా ఎక్కువే వచ్చింది! ఇప్పుడు వినాయకుణ్ణి పెట్టొద్దంటావా!!"

"ఎవరి డబ్బు వాళ్లకిచ్చేద్దాం!"

"ఏడిసినట్టే ఉంది! విన్నవాళ్లు నవ్విపోతారు!!"

"నామాట వినండి. పిచ్చమ్మగారు చెప్పినట్టు ఎవరి ఇళ్లల్లో వాళ్లం పూజ చేసుకుందాం."

"నువ్వు బయట నుండి వచ్చినవాడివి. ఇవాళ ఉంటావు, రేపు ఇక్కణ్ణించి ఉడాయిస్తావు. మేం ఇక్కడ ఉండవలసినవాళ్లం! మా పరువు పోదూ?"

"పరువు పోవడం ఏఁవిటి?"

"మన కోలనీలో వినాయకుణ్ణి, ఆ కోలనీవాళ్ల వినాయకుడి తల తన్నేలా పెడ్తామని అందరికీ చెప్పామా లేదా?? ఇప్పుడు వెనక తీస్తామా!"

"వినాయకుడి మీద భక్తా? ఉండ్రాళ్ల మీద భక్తా అన్నట్టు ఆ కోలనీ వాళ్లతో పోటీకా మన ఈ పూజ?"

"పోటీవేరా! పోటీవే!"

"మనం బతుకుతున్నది పోటీ ప్రపంచం!"

"దేవుడి దగ్గర పోటీ ఏవిట్రా!"

"చూస్తూ ఉండు! మన వినాయకుణ్ణి చూడ్డానికి ఎంతమంది వస్తారో! ఊరంతా తిరగబడుతుంది!! హైద్రాబాదు ఖైరతాబాదు వినాయకుణ్ణి చూడ్డానికి వస్తారే అల్లాగ్గా వస్తారు!! ఏమనుకున్నావో!! అప్పుడు ఆ కాలనీ వాళ్ల మొహాలు చూసి తీరాల్సిందే!!"

"పిచ్చమ్మగారికి కాదురా మీ అందరికీ పిచ్చి పట్టింది. ఒక్కసారి బుర్రపెట్టి ఆలోచించి చూడండి." అర్థం అవుతుంది.

"ఓ గంటసేపు ఆ ఒంటిపిల్లి రాకాసి చెప్పింది విన్నాడో లేదో వీడికి ఆవిడ వెర్రి అంటింది!"

శీను వినాయకుణ్ణి పెడ్దాం అన్నప్పుడు నాకు ఎలాంటి ఆలోచనా తర్కం లేవు. దేవుడంటే భయం భక్తి ఉన్నవాణ్ణి. అందరూ పెడ్తున్నారు. మనమూ పెడ్తాం అనుకున్నాను. అందరూ సరదా పడుతూ ఉంటే నేనూ సరదా పడ్డాను.

పిచ్చమ్మగారు ఎత్తి చూపిన అంశాలనన్నిటినీ తర్కించుకొన్నాక ఏది వెర్రో, ఏది వెర్రి కాదో అర్థం అయింది. పాపం పిచ్చమ్మగారు! ఓపక్క ఆవిణ్ణి ముళ్లకంపలాంటిదని అంటున్నారు. ఇంకోపక్క ఆవిడో వెర్రి వెంగళప్పని నవ్వుకుంటున్నారు!!

అనుకున్నట్టూ మా ఘనంగా వినాయకుణ్ణి పెట్టారు. తొమ్మిది రోజులూ కోలనీ ప్రభ వెలిగిపోయింది. హుండీ నిండిపోయింది. రెండోది పెట్టాల్సివచ్చింది.

అనుపునాడు బార్‌లైటు తోరణాల వెలుగులో చేసిన ఈనాటి నృత్యాలూ, కాల్చిన బాణసంచా, తాగిన తాగుడు గురించి ఎంత చెప్పినా అది తక్కువే!!

పక్క కోలనీలో బీదాబిక్కీ ఓ నూరు మంది మాత్రమే తిన్నారట! ఇక్కడ రెండు వందల పైచిలుకే అయ్యారు!!

భోజనాలు చేస్తున్న ఆ బీదాబిక్కీని చూస్తే ఇంతమంది ఇలా ఉన్నారా అని అనిపించింది. సీనూ, వాడి గేంగు... అందరి మొహాల్లో గర్వం, గొప్పా తాండవిచ్చాయి.

నిజమే! ఆలోచించి చూస్తే దేశంలో బీదాబిక్కీ ఉండాలి. వాళ్ల సంఖ్య ఎంత పెరిగితే అంత మంచిది. ముష్టివాళ్లంటూ లేకపోతే ముష్టి ఎవరికి వేస్తారు? పాత్రత ఎరిగి దానం చెయ్యమన్నారు. వాళ్లకన్నా పాత్రత ఉన్నవాళ్లు ఇంకెవరు? దానం ధర్మం చెయ్యాలంటే ఫిలాంత్రఫిస్టులం అవాలంటే వాళ్లు ఉండి తీరాలి. వాళ్లే లేకపోతే ఇచ్చేవాళ్ల మొహాల్లో గొప్ప సంతోషం ఎలా వెలుగుతుంది? ఔదార్యం, దాతృత్వం, దాక్షిణ్య దృష్టి గొప్ప ఉత్కృష్ట గుణాలు! అవి పెరగాలంటే పోటీ ఉండాలి!! ఇచ్చేవాళ్ల పోటీతో చెయ్యి చాచేవాళ్ల సంఖ్య వెయ్యింతలు పెరుగుతుంది!! వేలం వెర్రితో దేవుణ్ణి సరుకుగా చలామణీ చేస్తున్నారనీ, వాడూ డబ్బు సంపాదించే వ్యాపార వస్తువు అయ్యాడనీ ఊరూరా జాడ్యం విస్తరిస్తోందని ముదిరిపోతోందని రోగనిదానం చేసిన డాక్టరు పిచ్చమ్మగారు ఉలిపికట్టె. ఊరందరిదీ ఒకదారి అయితే ఉలిపికట్టెది మరోదారి!!

విశేషం ఏమిటంటే రోగులకి రోగం ఉన్నట్టు తెలీటం లేదు. రోగం అని చెప్పినా వాళ్లు పట్టించుకోవటం లేదు. ఎన్నో స్టేజిలో ఈ జాడ్యం జనానికి తెలిసేటట్టు మహా ఉధృతంగా బయటపడుతుందో!! అంతదాకా రోగనిదానం చేసినవారు పిచ్చివాళ్లు! ఉలిపికట్టెలు!!

# కుదించుకున్న జీవితం!

కొత్తపల్లి ఉదయబాబు



✆ 9441860161

***నానమ్మకి నావల్ల బాధ కలగకుండా ఉండాలంటే, కుదించుకున్న జీవితమే నాకు న్యాయం అనిపించింది! అందుకే నానమ్మ బాధ పట్టించుకోలేదు! ఇప్పుడు చెప్పండి పిన్నీ...***
***ఇది మేమిద్దరం కలిసి తీసుకున్న నిర్ణయం! మా నిర్ణయం తప్పా? రైటా?"***

ఆయనా, పిల్లలూ ఆఫీసుకి, స్కూళ్ళకీ వెళ్లిపోయాక ఎంతో కాలమైంది అని అనుకొని అత్తయ్యకి ఫోన్ చేద్దామని సెల్ తీశాను. అందులో అత్తయ్యవి ఆరు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. పని హడావుడిలోనూ, ఫోన్ ఛార్జింగ్‌లో ఉండడంతోను నేను కాల్స్ చూసుకోనే లేదు.

ఎందుకో... ఏమిటా అని అత్తయ్యకి ఫోన్ చేసాను.

అవతల నుంచి అత్తయ్య చెప్పిన మాటలు వింటూనే కొయ్యబారిపోయాను.

"అత్తయ్యా, నిజమా?" అన్నాను.

"అవునమ్మా! తల్లీ తండ్రీ లేని పిల్ల అని ఎంతో జాగ్రత్తగా పెంచుకుంటూ వచ్చాను. కంటికి రెప్పలా చూసుకుంటున్నాను. అయినా నా కన్నుగప్పి ఎవరో గుళ్లో పూజారిని పెళ్లి చేసేసుకుందమ్మా! అతనికి బాగా ఆస్తిపాస్తులు ఉన్నాయట. తెలివైన పిల్ల. చక్కగా చదువుకుంటున్నదని అనుకున్నాను కానీ, ఇలా నా కళ్ళల్లో కారం కొట్టి నన్ను ఇంతలా మోసం చేస్తుందని ఊహించలేకపోయాను." అని భోరుమంది అత్తయ్య.

"అంత బాగా చదువుకునే తెలివైన పిల్ల అయి ఉండి కూడా... రంభ అలా ఎలా చేసిందత్తయ్యా? నేను తనతో మాట్లాడుతానాగు!" అన్నాను.

"వద్దమ్మా! ఈ విషయం తెలుసా... నేను నా చిన్న కొడుకుని తీసుకొని పోలీస్ స్టేషన్ కూడా వెళ్లాను. అక్కడ... అక్కడది ఎంత ధైర్యంగా మాట్లాడింది అనుకున్నావ్? నా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడడానికి భయపడేది. ఎంత చిన్న పని చేయాలన్నా, నన్ను అడగకుండా చేసేది కాదు. నా ముందు తలెత్తడానికి కూడా భయపడేది. అలాంటిది... ఆ ఎస్. ఐ. గారి ముందు నాతో చెప్పిన మాటలు వింటే నీ గుండె తరుక్కుపోతుందే తల్లీ!"

"అంత పెద్ద ఆరిందా అయిపోయిందా! ఏమంది అత్తయ్యా అది నిన్ను?"

"అమ్మాయ్... అతను మన శాఖ కాదు... రేపొద్దున్న తన ముచ్చట తీర్చుకుని, నిన్ను తగిలి తన్నేస్తే నేను ఏం చేసేది? నా ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపోతుందే అమ్మా! 'ఆ చదువేదో పూర్తి చేసుకుంటే మంచి ఇంజనీరు కుర్రాడి సంబంధం చూసి నేను పెళ్లి చేస్తానే' అని చేతులు పట్టుకుని ఏడ్చానమ్మా! 'నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాను నానమ్మా! పైగా మేమిద్దరం కూడా మేజర్‌లం. అతను నాకు ఏ కష్టం రాకుండా చూసుకుంటానని తాను పూజ చేస్తున్న అమ్మవారి మీద ఒట్టేసి చెప్పాడు. ఒకవేళ అదే అబద్ధం అయితే చావనైనా చస్తాను గాని... మీ ఇంటికి వచ్చి మళ్ళీ నీకు భారం

అవను నానమ్మా!' అందమ్మా. ఇంక ఏమీ చేయలేక ఎస్ఐ గారికే వాళ్ళ మంచి చెడ్డ చూసుకోమని చెప్పి, దగ్గరుండి కాగితాలన్నీ పూర్తిచేయించి ఇంటికి వచ్చేసానమ్మా! ఆరు నెలల పసి గుడ్డుగా వాళ్ళ అమ్మ నాకు దాన్ని అప్పగించి చచ్చిపోయింది. వాళ్ల నాన్న యాక్సిడెంట్ లో నడుము విరిగిపోయి జీవచ్ఛవంలా మంచంలోనే మానసిక వేదనతో చచ్చిపోయాడు. అప్పటినుంచి అపురూపంగా పెంచుకున్నా! అది నన్ను ఇంత మోసం చేస్తుందని కలలో కూడా అనుకోలేదే అమ్మా!" అంటూ ఫోన్లో మాట్లాడుతూ వెక్కుతూనే ఉంది అత్తయ్య.



"కన్నప్రేమ కన్నా పెంచిన ప్రేమ గొప్పదని... పెద్దదానివి... నీకు నేను చెప్పక్కర్లేదు అత్తయ్యా. పోనీలే చెట్టంత కొడుకు చచ్చిపోతేనే మనసుకు నచ్చ చెప్పుకొని తట్టుకున్నావు! పోనీలే... ఇక నీకు దాని పెళ్లి బాధ్యత తప్పింది. జీవితంలో మావయ్య పోయిన తర్వాత ఎన్నో కష్టాలు పడ్డావు. ఇప్పుడైనా ప్రశాంతంగా సుఖంగా ఉండత్తయ్యా. నేను శని ఆదివారాలలో వస్తాను. ధైర్యంగా ఉండత్తయ్యా!" అని మరి కాసేపు రంభ చిన్ననాటి ముచ్చట్లు కొన్ని చెప్పుకున్నాక అత్తయ్య ఫోన్ పెట్టేసింది.

నేను ఆలోచనలో పడ్డాను. ఈ రోజుల్లో ఎక్కువ శాతం మంది ఆడపిల్లలు ఇలాగే ప్రవర్తిస్తున్నారు. వారి ఆలోచనలే అలా ఉంటున్నాయో, కుర్రాళ్ళే వాళ్ళని ప్రభావితం చేస్తున్నారో, ఖచ్చితంగా చెప్పలేను గాని జీవితంలో అతి ముఖ్య ఘట్టమైన పెళ్లి విషయంలో మాత్రం చాలా తొందరపాటు నిర్ణయం స్వయంగా తీసేసుకుంటున్నారు... కనీసం తమను కన్న పెద్దవాళ్ళను కూడా సంప్రదించకుండా, వారికి తెలియకుండా!!

సాయంత్రం ఆయన ఇంటికి వచ్చాక చెప్పాను విషయం.

"అయ్యో! ఆ వయసులోనే కొడుకు కోడలు పోయిన దుఃఖం కడుపులో దాచుకుని మనవరాల్ని అపురూపంగా పెంచుకుంటే, ఆ అమ్మాయి ఇలా చేసిందా! రేపు మన పిల్లలేం చేస్తారో!! అందుకే అన్నారు పిల్లల్ని కనగలం గాని, వాళ్ళ రాతల్ని కనలేమని!"

"ఈ రోజుల్లో పిల్లల పెంపకాలు అద్దాలమేడలో పెంపకాల్లా తయారయ్యాయండి. ఏ చిన్న గులకరాయి కూడా తగలకుండా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిందే మనమే! సరే రేపు శని ఆదివారాలలో అత్తయ్యని చూసొస్తానండి... బాగుండదు!" అన్నాను ఆయనతో.

"నేను రావాలా!" అడిగారాయన.

"అవసరం లేదండి. ఈ విషయం ఇక్కడ తోటి మర్చిపోదాం. పిల్లల్ని కూడా ఆ రెండు రోజులు మీరే చూసుకోండి. ఇలాంటి కథలు వాళ్లు వినడం మంచిది కాదు!"

"సరే సులోచనా!" అన్నారాయన.

★★★

శనివారం ఉదయం బయలుదేరి అత్తయ్య దగ్గరకు వచ్చాను. ఈ వారం రోజుల్లోనే అత్తయ్య మరీ ముసలిది అయిపోయినట్టుగా నీరసపడిపోయింది. జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పింది.

"నేను వెళ్లి ఒకసారి రంభని చూసి వస్తాను అత్తయ్య... తీసుకురావడానికి మాత్రం కాదు, కాస్త ధైర్యం చెప్పి వస్తాను అంతే!" అన్నాను.

"జాగ్రత్తమ్మా... ఆ పిల్ల ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. నన్ను ఎస్ఐ గారి ముందు ఎన్ని మాటలు అందనుకున్నావ్!" అంది ముక్కు చీదుతూ.

"చూడత్తయ్యా! రోజులు మారాయి, పిల్లలు ఆవేశంలో ఏం మాట్లాడినా సర్దుకుపోవాల్సింది మనమే. పెద్దా, చిన్నా... గౌరవం లేదు. చదువుకున్న వాళ్ళయ్యుండి కూడా సంస్కారం లేకుండా ప్రవర్తిస్తున్నారు! మరి ఆ స్కూల్లోనూ, ఆ కాలేజీల్లోనూ ఏం నేర్పుతున్నారో, వీళ్ళు ఏం నేర్చుకుంటున్నారో! ఇంతకీ ఆ కుర్రాడు ఏ గుళ్లో పని చేస్తున్నాడు?"

అత్తయ్య దగ్గర ఆ అబ్బాయి అడ్రసు, ఫోన్ నెంబర్ తీసుకున్నాను. రంభ ఫోన్ నెంబర్ నా సెల్‌లో ఉంది. నేను బయటికి వచ్చి ఆ అబ్బాయికి ఫోన్ చేశాను.

"నేను పొరుగూరి నుంచి వచ్చాను బాబూ. నా పేరు సులోచన. నేను రంభకి పిన్నిని అవుతాను. ఒకసారి మిమ్మల్ని చూడ్డానికి మీ ఇంటికి రావచ్చా? మీకు అభ్యంతరం అయితే ఇప్పుడే తిరుగు బస్సు ఎక్కేస్తాను!"

"అయ్యో... ఎంత మాట! తప్పనిసరిగా రండమ్మా. నేను గుడిలో ఉన్నాను. మీరు ఇక్కడికి వస్తే, నేను మిమ్మల్ని ఇంటికి తీసుకెళ్తాను. ఈ నెంబర్‌కి లొకేషన్ పంపిస్తాను!" అని లొకేషన్ పంపించాడు.

నేను ఆటో చేసుకుని అక్కడికి వెళ్లాను.

అది లలితాపరమేశ్వరి గుడి. అందులో అతను ప్రధాన పూజారి. పక్కన రెండు ఉపాలయాలు కూడా ఉన్నాయి. విశాలమైన ఎత్తయిన ప్రహరీగోడ రక్షణగా, లోపల నేలంతా నాపరాళ్ళు పరచి బిల్వ, గన్నేరు, రావి మొదలైన పెద్ద చెట్లతో మధ్యాహ్నం పదకొండు గంటలైనా ఎండ తగలకుండా చల్లగా ఉంది ఆ వాతావరణం.

నేను గుడిలోకి వెళ్లేసరికి అతను వేదపీఠంలో ఏదో గ్రంథాన్ని పఠిస్తున్నాడు. నన్ను చూస్తూనే లేచి నమస్కరిస్తూ, "రండమ్మా!" అన్నాడు.

నేను అతని ఎదురుగా చాప మీద కూర్చున్నాను.

"బాగున్నావా పిన్నీ. మంచినీళ్లు తీసుకో పిన్నీ!" గుడి వెనకనుంచి హఠాత్తుగా వచ్చినటువంటి రంభ, భుజాన ఫ్లాస్కు పక్కన పెట్టి, మంచినీటి గ్లాస్ నాకు అందించి, పక్కన కూర్చుంది.

మడి కట్టుకున్నట్టుగా కచ్చాబోసిన చీరలో, కాళ్ళకి ముఖానికి పసుపుతో, నుదుట గుండ్రని కుంకుమ బొట్టుతో ఒక చక్కని గృహిణిగా కనిపిస్తున్న రంభని చూసి, నేను ముచ్చటపడుతూనే నివ్వెరపోయాను.

"ఏవండీ మీరు కూడా ఆ చదవడం ఆపి ఇలా వచ్చి కూర్చోండి!" అంది రంభ.

"మీరేమైనా రహస్యాలు మాట్లాడుకోవాలేమో!" అన్నాడతను నవ్వుతూ.

"మీకు చెప్పానుగా! నాకు ఈ ప్రపంచంలో మా నాన్నమ్మ పెంచి పెద్ద చేస్తే, ఎలా పెరగాలో, ఎందుకు పెరగాలో తెలియచెప్పింది మా పిన్ని! ఒక విధంగా చెప్పాలంటే నా గైడ్, నా మార్గదర్శి! నేను తప్పు పని చేశాననుకుంటే, అది ఎలా సరిదిద్దుకోవాలో చెబుతుంది. ఒప్పే చేశాను అనుకుంటే అభినందిస్తుంది!" రంభ మాటలు వింటూనే అతను చదువుతున్న పేజీ దగ్గర ఒక దర్భపుల్ల అడ్డుపెట్టి వచ్చి కూర్చున్నాడు.

"మీ పేరు?" అతడ్ని చూస్తూ అడిగాను.

"రాఘవేంద్ర"

"నేను మిమ్మల్ని ఎక్కడో చూశాను." అన్నాడు అతనే మళ్ళీ. రంభ అతనికేసి చురుగ్గా చూసింది.

"అవును... నేను మిమ్మల్ని చూశాను! రంభ నా దగ్గర ఉండగా 9, 10 తరగతి చదివింది. రంగనాథ్ అని ఒక కుర్రాడు రంభను చూసి చాలా జలసీగా ఫీల్ అయేవాడు. ఆ అబ్బాయితో ఓ రోజు వచ్చారు మీరు. అబ్బాయి ఎవరని అడిగాను మిమ్మల్ని చూపించి. 'మా అత్తయ్యగారి అబ్బాయి ఈ ఊరిలో వేదపాఠశాలలో చదువుకుంటున్నాడు మేడం. ఈవేళ సెలవిచ్చారు వాడికి. అందుకని సరదాగా మా ఇంటికి వచ్చాడు. ఇంట్లో బోర్ కొడుతోంది అంటే నాతో తీసుకొచ్చాను మేడం... అన్నాడు. గుర్తొచ్చిందా?" అన్నాను.

"చాలా సంవత్సరాల క్రితం జరిగిన ఓ విషయాన్ని, మీరు ఇంతగా గుర్తు పెట్టుకున్నారంటే... మీకు హృదయపూర్వక అభినందనలు. నాకు మిమ్మల్ని చూసినట్టు అనిపించింది గానీ... అడగడానికి మొహమాటపడ్డాను!" అన్నాడు అతను.

"ఆ రోజు నేను మిమ్మల్ని ఒక ప్రశ్న అడిగాను. 'దేశంలో యువతీ యువకులందరూ కూడా ఇంజనీర్లు, డాక్టర్లు అయి విదేశాలకు వెళ్ళిపోవాలని కలలు కంటుంటే, ఈ వేదం ఎందుకు నేర్చుకుంటున్నావ్ బాబూ?' అని! దానికి మీరు చెప్పిన సమాధానం నన్ను చాలా ఆలోచింపజేసింది.

'మన భారతదేశం వంటి పవిత్ర దేశంలో పుట్టి, తమ తల్లిదండ్రులు కష్టార్జితంతో పెరిగి, విదేశాలకు వెళ్లిపోయి ఆ దేశానికి సేవలు అందిద్దాం. మన దేశాన్ని ఎప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంచేద్దాం అనుకునే వాళ్ళకి లోటు లేదు మేడం! మన దేశ విజ్ఞాన సారమంతా విదేశాలు వెళ్ళిపోతే, ఎక్కువ శాతం మంది నేరస్థులు రాజకీయ నాయకులుగా, మిగతావాళ్లు వాళ్లని ఆశ్రయించి బతికేటువంటి పరాన్నజీవులై మన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ప్రజల్ని మభ్యపెడుతూ, తమ పబ్బం గడుపుకుంటున్న వాళ్ళు ఎంతోమంది ఉన్నారు! ఎన్నెన్నో స్వయంభూ దేవాలయాలు, పవిత్ర దేవాలయాలు వేదపఠనం చేసే అర్చకులు లేక వెలవెలబోతున్నాయి. నా వంతు దేశానికి ఈ రకమైన చిన్న సేవ చేద్దాం అన్నదే నా ఉద్దేశం.

మా నాన్నగారు, అమ్మగారు కూడా నా ఆలోచనలకు నన్ను కోప్పడ్డారు. నాకీ జీవితం చాలు... అని చెప్పాను వాళ్లతో. వాళ్లు అంగీకరించి నన్ను వేద పాఠశాలలో చేర్పించారు.' అనే సమాధానం చెప్పారు మీరు. గుర్తొచ్చిందా!" అన్నాను.

"అక్షరాలా నిజం మేడం. మీరు ఇంత వివరంగా చెప్పాక నాకు ఇప్పుడు పూర్తిగా గుర్తొచ్చింది. నన్ను క్షమించండి. మీరు దయచేసి నన్ను మీరు అని పిలవద్దు పిలవకూడదు కూడా!" అన్నాడు రాఘవేంద్ర వినయంగా.

"అది సరే. మరి... మీకు రంభతో ఎలా పరిచయం?" అడిగాను.

"దానికి నేను సమాధానం చెప్తాను పిన్నీ! ఓ రోజు రంగనాథ్ నాకు ఈయన చేత ఒక ప్రేమలేఖ రాయించి పంపించాడు. అలా నా మైండ్ డైవర్ట్ చేసి చదువులో నన్ను ఓడించాలన్నది అతని ప్రయత్నమని తర్వాత తెలిసింది. అది నాకు ఈయన ధైర్యంగా పట్టుకొచ్చి ఇచ్చారు. తన ఇంట్లోవాళ్లకి తెలిసిపోతుందని తెలివిగా రంగనాథ్ ఆ ఉత్తరంలో ఈయన ఉంటున్న హాస్టల్ చిరునామా ఇచ్చాడు.

ఆ ఉత్తరం చాలా ప్రేమభావగర్భితంగా ఉంది. రంగనాథ్ తాను నన్ను ప్రేమిస్తున్నట్లు ప్రేమలేఖ రాయమంటే ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని, ఆయన నిజంగానే నాకు ఆ ప్రేమలేఖ రాసారు అని అర్థం చేసుకున్న నేను, అందరి ముందు ఆయన మాట్లాడిన మాటలు, ఆ ప్రేమలేఖలోని భావాలు నాకు చాలా నచ్చి, ఆయన ఇచ్చిన చిరునామాకి నేను తిరిగి జవాబు ఇచ్చాను. ఆశ్చర్యంగా ఆయన మళ్లీ జవాబు ఇచ్చారు. అలా మా పరిచయం పెరిగి ప్రేమగా మారింది.

పదవ తరగతి నీ దగ్గర పాస్ అయిన తర్వాత నేను మళ్ళీ నానమ్మ దగ్గరకు వచ్చేసాను. అయినా మా ఇద్దరి మధ్య ఆ ప్రేమ అలా కొనసాగుతూనే ఉంది. నానమ్మ నన్ను చాలా కష్టపడి చదివిస్తోంది అన్న విషయం నాకు ఇంటర్లో అర్థమైంది. నేను గొప్ప చదువు చదవాలని, నాకు మంచి డబ్బున్న వాడితో పెళ్లి చేయాలని నానమ్మ ఆలోచన అని తెలుసుకున్నాను. అందుకోసమే నాన్నమ్మ నన్ను ఇంజనీరింగ్‌లో చేర్పించింది. అయితే ఫీజు కట్టడానికి ఎవరైనా సహాయం చేస్తారేమో అని, ఆమె ఎన్నో చోట్లకి తిరగడం కళ్ళారా చూశాను. అమ్మ, నాన్న లేని నాకు, నాన్నమ్మ ఎంత చదువైనా చెప్పిస్తుంది... ఎంత కట్నమైనా తెలిసిన వారందరినీ అడిగి తెచ్చి మరీ పెళ్లి చేస్తుంది. నేను సంతోషంగా పెళ్లి చేసుకుని నా మానాన అత్తారింటికి వెళ్ళిపోతాను. మరి కేవలం తాతగారి పెన్షన్‌తో బతుకుతున్న నాన్నమ్మ, ఆ అప్పంతా ఎలా తీర్చగలదు? అందుకే ఆయన్ని నిస్సిగ్గుగా అడిగాను. 'ఈ ఇంజనీరింగ్ పూర్తి చెయ్యాలంటే ఇంకా రెండేళ్ల ఫీజు కట్టాలి. ఆ పని మీరే చేస్తే నేను పెళ్లి అయ్యాకా ఉద్యోగం చేసి, మీ ఫీజు అంతా తీర్చేస్తానని' ఆయనకు ఉత్తరం రాసాను.

'నా ప్రేమను నువ్వు డబ్బుతో కొలుస్తున్నావా? నన్ను డబ్బు మనిషిగా చూస్తున్నావా? నేను నిన్ను తొలిచూపులోనే మనస్ఫూర్తిగా ప్రేమించాను. నేను నీ గురించి తెలుసుకున్న తర్వాత మీ నాన్నమ్మ పెంపకంలో నువ్వు ఎంత పద్ధతిగా పెరిగావో నాకు అర్థమైంది. నేను కోరుకున్నది నీలాంటి లక్షణాలున్న భార్యనే...' అని ఆయనే మా పెళ్లి ముహూర్తం పెట్టారు. ఆ ముహూర్తానికే మేము స్వామి సన్నిధిలో వివాహం చేసుకున్నాము!

పిన్నీ... నాతో ఎప్పుడూ ఒక మాట అనేదానివి గుర్తుందా? 'మూడువందలలోను చీర దొరుకుతుంది... మూడు వేలల్లోనూ చీర దొరుకుతుంది. మూడువేల చీర కొనలేని స్థోమత, అవకాశం లేనపుడు మన కోరికని మనమే కుదించుకోవాలమ్మా. ఏ చీర కట్టుకున్నా అదే సంతృప్తి. మనది పుట్టుకనుంచి మూడువేల చీర కట్టే స్తోమతే అయితే, అదే కొనుక్కో... కానీ మూడువందల చీర కొనుక్కునే స్థాయిలో ఉండి, మూడువేల రూపాయల చీర కొని కట్టడం మాత్రం అత్యాశే అవుతుంది. ఇలాగే ప్రతీ కోరికా పెరిగిపోతే అది అసంతృప్తి జీవితం అవుతుందే తప్ప మనస్ఫూర్తిగా బ్రతికే బ్రతుకు కాదు' అని! మీ పెద్దవాళ్ళను ఎదిరించి

మీరు మీ మనసుకు నచ్చిన విధంగా సుఖంగా సంతృప్తిగా బ్రతుకుతున్నానని చెప్పారు. మీతో చెప్పే పెళ్లి చేసుకుందాం అన్నారాయన. కానీ మీ మాటలు ఆదర్శంగా తీసుకున్న నేను... మీ విద్యార్థిగా మీకు తెలియపరచడానికి భయపడ్డాను. మమ్మల్ని క్షమించండి!" అంది రంభ.

"సరేనమ్మా, ఇప్పుడు నీ కాపురం అది ఎలా సాగుతోంది?"

"చాలా సంతోషంగా ఉన్నాను పిన్నీ! నానమ్మతో నిర్మొహమాటంగా చెప్పాను... ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి అక్కడికి రానని! నానమ్మ పెంచిన ప్రేమతో నన్ను వాటేసుకుని హృదయవిదారకంగా ఏడ్చింది, కుమిలిపోయింది. నానమ్మకి నావల్ల బాధ కలగకుండా ఉండాలంటే, కుదించుకున్న జీవితమే నాకు న్యాయం అనిపించింది! అందుకే నానమ్మ బాధ పట్టించుకోలేదు! ఇప్పుడు చెప్పండి పిన్నీ... ఇది మేమిద్దరం కలిసి తీసుకున్న నిర్ణయం! మా నిర్ణయం తప్పా? రైటా?"

"నీ దూరాలోచన నాకు చాలా నచ్చిందమ్మా. చాలా మెచ్యూరిటీతో ఆలోచించావు. మిమ్మల్ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ దీవిస్తున్నాను. సంవత్సరం తిరిగేలోపు మీ దంపతులు పండంటి బిడ్డతో నానమ్మ ఇంట్లో అడుగుపెట్టి ఆమె ఆశీర్వాదాలు తీసుకోండి. ఆమె ఇక ఈ జన్మలో మళ్ళీ మీ గురించి బాధపడదు. మీకు కూడా ధన్యవాదాలు బాబూ!" అన్నాను.

వాళ్ళిద్దరూ నాకు మనస్ఫూర్తిగా నమస్కరించారు.

ఆరోజు వాళ్ళింట్లోనే భోజనం చేసి, నాకు తోచిన బహుమతి వాళ్ళకి అప్పగించి ఇంటికి వచ్చేసాను.

★★★

సరిగ్గా పది నెలల తర్వాత బిడ్డ పుట్టాడని ఫోన్ చేసి చెప్పింది. నేను ఈసారి ఆయనతో సహా వెళ్లి ఆశీర్వదించి వచ్చాను.

అత్తయ్య మాత్రం రంభ ఆలోచనలతో రోజురోజుకి క్రుంగిపోతోంది అని తెలిసింది. నేను అప్పుడప్పుడు ఫోన్లో మాట్లాడి తనని సాంత్వన పరుస్తూనే ఉన్నాను. అటు రంభతో ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నాను. అత్తయ్య కోలుకోవాలంటే, రంభ మనవడితో సహా అత్తయ్యకు కనిపించడమే పరిష్కారంగా తోచింది.

రాఘవేంద్రతో ఆమాటే అన్నాను.

అతను తన భార్య, బిడ్డతో సహా అత్తయ్య గారి ఇంటికి వచ్చేసరికి నేను కూడా అక్కడ ఉండేలా కోరాడు.

★★★

ఆరోజు నేను అత్తయ్య వాళ్ళ ఇంట్లో అడుగు పెట్టి, కాళ్లు చేతులు కడుక్కుని .. మంచినీళ్లు తాగి, అత్తయ్యతో కబుర్లలో పడ్డాను.

అంతలోనే రంభ, ఆమె భర్త బాబుతో సహా అడుగు పెట్టారు.

నేను చెప్పినట్టుగానే రంభ, బాబుని అత్తయ్య పక్కలో పడుకోబెట్టి "నీ మనసు బాధ పెట్టినందుకు నన్ను క్షమించు నానమ్మా. అందుకే నువ్వు మళ్ళీ లేచి తిరగడం కోసం ఈ 'మందు'ను నీకు అప్పగిస్తున్నాను. నీకు అభ్యంతరం లేకపోతే నువ్వు కోలుకునేంతవరకూ నీ దగ్గరే ఉంటాను!" అంది అత్తయ్య కాళ్ల దగ్గర మోకాళ్ళ మీద కూర్చుని.

అత్తయ్య లేచి మంచం మీద కూర్చుంది. నేను బాబును అత్తయ్య ఒళ్ళో పడుకోబెట్టాను. ఆమె, రంభని పిలిచి తన పక్కలో

కూర్చోబెట్టుకుని నుదుట ముద్దుపెట్టుకుంటూ, “నేను ఇబ్బంది పడకూడదని నీ జీవితాన్ని కుదించుకున్నావా! నీ అంత బాగా నేను ఆలోచించలేకపోయానమ్మా. డబ్బున్న వాళ్ల ఇళ్లలోనే పిల్లలు సుఖంగా ఉంటారు అనుకున్న నా ఆలోచన తప్పు అని నిరూపించావు. నాకీ సంతృప్తి చాలమ్మా!” అంది.

ఆమెలోని తెలియని తేజస్సుకు కారణం తానే అన్నట్టు బాబు కేరింతలు కొట్టడం చూసి వాడి ముచ్చట్లలో మునిగిపోయింది, అత్తయ్య.

# ప్రేమలేఖ(క)

పి. రాజేంద్ర ప్రసాద్



✆ 9492525607

***ఎవరైనా ఒక నేరస్థుడికి శిక్ష పడితే ఆ నేరస్థుడే కాక అతని కుటుంబమూ కోర్టు చెప్పని ఇంకో రకం శిక్షను అనుభవించాల్సి వస్తుంది. ఇది శిక్షాస్మృతిలో రాయకపోయినా ప్రపంచమంతటా అమలవుతున్న నీతి. ఇదే నీతిని, ఇదే శిక్షాస్మృతిని మన విషయంలోనూ అమలు పరిచాను బావా!***

బావా,

ఆఫీసుకి వెళుతున్నాను అని నాతో చెప్పి బయలుదేరావు గానీ నిజానికి ఆఫీసుకు వెళ్లనే వెళ్లకుండా నేరుగా కోర్టుకెళ్ళి ఇప్పుడే వచ్చావు! ఈ విషయం నాకెలా తెలిసిందోనని ఆశ్చర్యపోతున్నావు కదూ! నువ్వు కోర్టుకి వెళ్లడమూ, అక్కడ నీకు వ్యతిరేకంగా తీర్పు రావడమూ... అన్నీ నేను ఇంట్లో ఉండే తెలుసుకున్నాను బావా! అవన్నీ అలా జరగడానికి కారణం నేనే. ఎలా అంటావా? ఎంతో కష్టపడి డబ్బు కుమ్మరించి ఏర్పాటు చేసింది నేనే మరి.

'ఇంత చికాకుతో ఇంటికి వస్తే తాళం వేసి ఉందేమిటి?' అని నీలో నువ్వే అనుకొని చిరాకుపడ్డా, కొద్దిగా ఆశ్చర్యపోతున్నావు కూడా కదూ! తెలిసేలా అన్నీ చెప్తాను. కొంచెం వివరంగానే చెప్తాను.

పెళ్ళైన వెంటనే నిన్ను ఇక బావా అని పిలవడం మానెయ్యమనీ, మీరూ, ఏమండీ అనే అనాలనీ అమ్మ నాకు రెండు రోజుల పాటు అదే పనిగా నూరిపోసింది. కానీ నేను అమ్మ మాట వినలేదు. నాకు భగవంతుడు అలాంటి బుద్ధి ఎందుకు కలిగించలేదో మరి! భర్తగా మారిన బావని ఇంకా బావా అనే పిలుస్తూ ఉంటేనే నువ్వు బావగా ఉండిపోయావో, లేక ఎప్పటికీ భర్తగా మారవని నా సిక్స్త్ సెన్స్ ఏదో చెప్పడం వల్ల నేను అలా ఫిక్సయిపోయానో... నేను కనుక్కోలేకపోయాను బావా!

ఈ రోజు నువ్వు ఆఫీసుకని నాకు అబద్ధం చెప్పి వెళ్ళిపోయాక, నేను కూరగాయల కోసమని బజారుకి వెళ్ళాను. ఓ గంటకి కాబోలు ఇంటికొచ్చాను. తీరా వచ్చి చూస్తే నీకూ, నాకూ ఎంతో ఇష్టమైన రాధాకృష్ణుల బొమ్మ, మరి ఎలా పడిపోయిందో గాని, షోకేసులోంచి కింద పడి, ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది... నీకు అర్పించాననుకున్న నా హృదయం పగిలిపోయినట్టు! గాజుసామానంటే నీకు ప్రాణం. గాజుకప్పులూ, గాజుప్లేట్లూ, గాజు డిన్నర్ సెట్టూ, చివరికి డైనింగ్ టేబుల్ కూడా గాజుదే... అన్నీ గాజువే కొన్నావు. నన్ను కూడా గాజుబొమ్మలాగానే బయట పడిపోతే ముక్కలు చెక్కలైపోతానేమోనని షెల్ఫులో లాక్ చేసేసి జాగ్రత్తగా దాచి ఉంచావు కదూ? ఎందుకు బావా? తాళాల గదిలోంచి బయటపడి అప్పుడు నీ సంగతులన్నీ బయటపడిపోతే నా గుండెలు పగిలిపోతాయనీ, పగిలితే ఇక అతకవనీ చాలా జాగ్రత్తపడ్డావు కదూ! కానీ ఇప్పుడు జరిగిందదే కదా!

చిన్నప్పట్నుంచి నిన్ను మనసులో నా భర్తగా ఊహించుకొంటూనే పెరిగాను. భర్తంటే ఏమిటో తెలియని రోజుల్నించీ నిన్ను ప్రేమించాను. ప్రేమంటే ఏమిటో తెలియని రోజుల్నించీ నిన్ను ఇష్టపడ్డాను. ఆ ఇష్టం ప్రేమగా మారి, మన ఇద్దరి జీవితాలూ పెద్దల అంగీకారంతో పెళ్లిగా మారి, నువ్వు నా తలమీద చెయ్యి పెట్టి, ఒట్టు పెట్టి మంత్రం చెపుతూ ఉంటే నువ్వు బావనించి భర్తగా మారిపోయావని నా ఒళ్ళంతా ఝల్లుమని, అదోరకమైన మైకంలో కూరుకుపోయాను. ఆ మైకంలోనే ఇన్నాళ్లూ

ఉండిపోయానని ఇప్పుడు అనిపిస్తోంది.

నువ్వు ఎప్పుడూ ఒక్కలాగే ఉన్నావనీ, బావనించి భర్తగా మారనేలేదనీ మొదటిసారి తెలిసినప్పుడు...

అప్పుడు... మొదటిసారి నా హృదయం ముక్కలుగా పగిలిపోయింది. ఒకసారి పగిలితే ఇక మళ్లీ పగలదులే ఇంతకన్నా ఏముంది అనుకున్నాను. కానీ నీ గురించి ఒక్కొక్క విషయం తెలిసినకొద్దీ ముక్కలు ముక్కలవుతూనే ఉంది.

కొన్ని రోజుల క్రితం కరోనా ఉధృతంతో విధించిన విమానాల లాక్‌డౌన్ వల్ల నువ్వు అనుకోకుండా విదేశాల్లో ఇరుక్కుపోయావు కదా! ఆ సమయంలో నీతో ఫోన్లో చెపుదామని అనుకుంటూనే ఆఫీసు పని ఒత్తిడిలో మరిచిపోయి, నేను మన కంపెనీ బ్రాంచి ఉన్న 'ఆ' ఊరికి వెళ్ళవలసి వచ్చింది. నీతో చెప్పకుండానే వెళ్ళిపోయాను. అప్పుడు మన... సారీ నీ కథ అన్‌లాక్ అయిపోయింది బావా! అప్పుడే బావా... సరిగ్గా అప్పుడే... అగ్నిపర్వతం విస్ఫోటనం చెందినట్టు... నా మనసు లోపలి సముద్రం ఏదో ఉన్నట్టుండి పొంగిపోయినట్టు... నువ్వు ఇష్టపడి నా కోసం కొన్న గాజు డిన్నర్ సెట్టు షో కేసులోని అతి ఎత్తైన అరలోంచి పాలరాతి గచ్చుమీద పడిపోయి... ముక్కలుగా, చెక్కలుగా, తునకలుగా పగిలినట్టు నా హృదయం మొదటిసారి పగిలిపోయింది.



దాని ఫలితం ఏడాది తరువాత పుణ్యదినమో, పాపదినమో అయిన ఈ రోజున తీర్పు ఇవ్వబడింది. ఇన్నాళ్లూ, నన్నూ ఆమెనీ మోసం చేస్తున్న నిన్ను, ఆ మహిళ నుండీ, మీ ఇద్దరి కలయిక ఫలితంగా పుట్టిన మీ ఏడేళ్ల కొడుకునుండీ దూరంగా ఉండాలనీ, ఇకపై వాళ్ళను కలవడానికి వీలులేదనీ, ఇంకా నీకు జరిమానాతో పాటు వాళ్ళకి నెల నెలా భరణం ఇవ్వాలని కూడా న్యాయస్థానం నిన్ను ఆదేశించింది.

ఎందుకూ? మీది అక్రమ సంబంధమని నిరూపించబడింది. అలాగని నువ్వు ఏలుకుంటానన్నా కూడా ఆమె నీతో ఇక ఉండడానికీ ఒప్పుకోలేదు. ఎందుకు తను విడిగా ఉండదల్చుకుందో... ఆమె నీకూ, న్యాయస్థానానికీ కూడా కారణం చెప్పలేదు. కేవలం నువ్వు తనని పెళ్లి చేసుకోకుండా బిడ్డను కనేందుకు కారణమయ్యావని మాత్రమే చెప్పింది. భరణం నీకో లెక్క కాదు. కానీ నీకిష్టమైన వాళ్లే నీకు ఎదురుతిరగడం, విడిపోవడం మాత్రం నీకు ఎదురుచూడని దెబ్బే కదా? వెనకనుండి పావులు కదుపుతూ లక్షలు ఖర్చుపెట్టి ఇంత చేయించింది నేనే. నీ గుండె కూడా నాకు లాగా పగిలిపోతుందేమోనని, ఆ బాధ

నువ్వు పడుతుంటే నేను నిన్ను చూస్తూ పైశాచికంగా నవ్వుకోవాలనీ ఇంతా కష్టపడి చేశాను కదా బావా!

అదేమిటో... కోర్టు దగ్గర నేను రహస్యంగా నియమించిన మనిషి, ఫోన్ చేసి ఇదంతా చెపుతుంటే నా గుండె మళ్లీ లెక్కలేనన్ని సార్లు ముక్కలు చెక్కలుగా పగిలిపోయి... నీతో సమానంగా నాకూ దుఃఖం వచ్చి కన్నీళ్లు ఆపుకోలేకపోయి... ఆఫ్ట్రాల్ నేనొక ఆడదాన్నని గుర్తు చేసింది.

ఇంతా చేసింది నిన్ను నేను దక్కించుకోవడానికి అనుకొంటున్నావా? కానే కాదు. నీ గురించీ, నీ సంసారం గురించీ కోర్టొక నిర్ణయం తీసుకుంది. నీ గురించి ఇప్పుడు నువ్వూ ఒక నిర్ణయం తీసుకొని ఉంటావు. అలాగే నేను కూడా ఒక నిర్ణయం తీసుకున్నాను. అదేమిటో తెలుసా! నీకు సంసారమనేదీ, భార్యా, కుటుంబమూ శాశ్వతంగా దూరమైతేనే నీకు పూర్తిగా శిక్ష వేసినట్టు. అందుకని నేను కూడా నిన్ను శాశ్వతంగా విడిచి వెళ్లిపోతున్నాను... ఇలా అని చెప్పడానికి నా గుండె గొంతుకకు అడ్డం పడుతోంది బావా! నా నరాలు తెగిపోతున్నాయి. ఎందుకో చెప్పనా! ఎవరైనా ఒక నేరస్థుడికి శిక్షపడితే, ఆ నేరస్థుడే కాక అతని కుటుంబమూ కోర్టు చెప్పని ఇంకో రకం శిక్షను అనుభవించాల్సి వస్తుంది. ఇది శిక్షాస్మృతిలో రాయకపోయినా ప్రపంచమంతటా అమలవుతున్న నీతి. ఇదే నీతిని, ఇదే శిక్షాస్మృతిని మన విషయంలోనూ అమలు పరిచాను బావా!

దీనంతటికీ కారణం నేనే! పెళ్లవక ముందునుండీ, నువ్వు నన్నెలా మోసం చేశావో అదే విధంగా మొన్న మొన్నట్నుంచీ నిన్నూ కావాలనే నేనూ తెలివిగా మోసం చేశాను. ఇందులో నేనూ నష్టపోయినా నేను మనసా, వాచా, కర్మణా కోరుకున్న బావనుండి నా అంతట నేను దూరంగా వెళిపోతున్నా కూడా, నేను లెక్క చేయలేదు. నీకు విడాకులంటూ ఇవ్వదలచుకోలేదు. విడాకులిస్తే నాలాంటి, సింహాద్రిలాంటి ఇంకో అమాయకురాల్ని నీ కట్టిపడేసే రూపంతో, ఎన్నాళ్ళైనా తరగని నీ ఆస్తితో చాలా సులభంగా మోసం చేస్తావు. ఆ అవకాశం నీకివ్వకుండా, నీకు కోర్టునుండి విడాకులు రాకుండా నేను ఎప్పటికీ కృషి చేస్తూనే ఉంటాను. ఇది నీకూ, నీలాంటి వాళ్ళకీ ఒక పాఠమో, కనువిప్పో కావాలి బావా!

ప్రపంచం నిండా మగవాళ్ల దౌష్ట్యాలను మౌనంగా భరించే మామూలు ఆడవాళ్లే కాక, నీవల్ల మోసపోయినా, తన పొరబాటు దిద్దుకొని, నిన్ను చట్టానికి పట్టిచ్చిన ఆమెలాంటి, నాలాంటి తిరుగుబాటుదారులు కూడా ఉంటారనీ, కొన్నాళ్ళు పోతే మాలాంటివాళ్లే ఎక్కువుండి నీలాంటి మోసం చేసే మగవాళ్ల ఆట కట్టిస్తారనీ నువ్వూ, నీ లాంటి మగవాళ్ళూ తెలుసుకోవాలి. ఉంటాను మరి...

ఇక సెలవు...

ఎప్పటికీ నీదాన్ని కాలేని

పేరుకే నీ భార్యని.

# విలువ

శింగరాజు శ్రీనివాస రావు



✆ 9052048706

***నా సహాయం వాడిని గట్టెక్కించేదో, లేదో నాకు తెలియదు కానీ, నాలో ఆత్మన్యూనత మాత్రం ఇప్పటికీ అలాగే మిగిలిపోయింది. స్నేహం విలువ తెలిసినవాడు కనుక వాడు నా గురించి వీళ్ళ వద్ద నోరు మెదపలేదు. నన్ను అడగనట్టుగానే ఉంచి నా విలువను కాపాడాడు. మరి నేనేం చేశాను. సాయం చేయగలిగే స్థితిలో ఉండి కూడ స్నేహితుడికి సాయపడలేదు***

పదవీవిరమణ తరువాత ఖాళీగా ఉండడం ఎందుకని ఒక ఫైనాన్సు కంపెనీలో మేనేజరుగా చేరాను. విజయవాడలో ఖాళీలు లేవని తెనాలి బ్రాంచికి నాకు పోస్టింగు ఇచ్చారు. నేను చదువుకున్న ఊరు కూడా తెనాలి కావడంతో సంతోషంగానే పోస్టింగుకు ఒప్పుకున్నాను. ఆ బ్రాంచికి వచ్చే కస్టమర్లు ఎక్కువ శాతం బంగారం మీద ఋణాల కోసమే వస్తారు. ఒక శాతం వడ్డీ ఎక్కువయినా, ఈ ఫైనాన్సు కంపెనీకే రావడం అక్కడికి వాళ్ళకు ఇష్టం. దానికి కారణం వాళ్ళు వచ్చిన పనికి పట్టే సమయం కేవలం పావుగంటే. వచ్చినవాళ్ళు తెచ్చిన బంగారాన్ని క్వాలిటీ చూసి, తూకం వేసి పంపుతాను. మా అసిస్టెంటు దాని పైన వచ్చే ఋణమెంతో చెప్పి, డాక్యుమెంట్లు పూర్తిచేసి, శాంక్షను కోసం నా వద్దకు మరల పంపుతాడు. ఈ క్రమంలో ఒకరోజు నా చిన్ననాటి మిత్రుడి బావగారు కనిపించారు. అతను కూడ నాకు బాగా పరిచయం. అతను కూడ బంగారం మీద ఋణం కోసమే వచ్చాడు. నేను అతడిని గుర్తుపట్టాను. అతను నన్ను గుర్తు పట్టినట్టు లేదు. తెలిసిన ముఖంలా ఉందే అన్నట్లు చూస్తున్నాడు. చొరవ తీసుకుని నేనే పలకరించాను.

"గోపీ.... బాగున్నావా? ఎన్నిరోజులైందిరా నిన్ను చూసి!"

"శీనన్నయ్యా.... నువ్వేనా. అవునా... కాదా అని సందేహపడుతున్నాను. చాలా మార్పు వచ్చింది నీలో! రింగుల జుట్టంతా ఏమయిపోయిందన్నయ్యా? కొంచెం లావు కూడా అయ్యావు. అందుకే గుర్తుపట్టలేక పోయాను. చూచి ఇరవై సంవత్సరాలు దాటింది కదా. సారీ అన్నయ్యా!"

"భలేవాడివిరా. వయసు పైబడింది కదా. మార్పులు తప్పవు! నువ్వు మాత్రం మారలేదురా. అలానే ఉన్నావు. అందుకే వెంటనే గుర్తుపట్టగలిగాను. ఇంతకూ మీ బావ సత్యం ఎలా ఉన్నాడురా? ఎప్పుడో పదిహేను సంవత్సరాల కిందట ఒక ఉత్తరం వ్రాశాడు. అంతే. ఇక తరువాత వాడి నుంచి ఎలాంటి కమ్యూనికేషన్ లేదు!"

"ఇంకెక్కడ బావ... లోకాన్ని వదిలి ఏడు సంవత్సరాలు అయిందన్నయ్యా!"

"ఏమిట్రా నువ్వనేది?"

"నిజమన్నయ్యా... సత్యం బావ కాలంచేసి ఏడు సంవత్సరాలు అయింది. అప్పటి నుంచి అక్క నా దగ్గరే ఉంటున్నది. దాని కూతురు నీలూ గుంటూరు విజ్ఞాన్ కాలేజీలో ఇంజనీరింగు ఫైనలియర్ చదువుతున్నది!"

"సారీరా... ఇలాంటి వార్త వింటానని అనుకోలేదు. కుట్టికి ఇంత చిన్న వయసులో అంత పెద్ద కష్టం వచ్చింది! వాడికి ఏదైనా అనారోగ్యమా?"

"లేదన్నయ్యా... ఊరంతా అప్పులు చేశాడు. అవి తీర్చడానికి బ్యాంకులో ఫ్రాడ్ చేశాడు. బ్యాంకు కదన్నయ్యా... దొరక్కుండా ఉంటాడా? బావ చేసిన పదిలక్షల ఫ్రాడును ఇన్స్పెక్షనులో పట్టుకున్నారు. దాంతో బావను సస్పెండు చేశారు. ఒక సంవత్సరం పాటు సస్పెన్షనులో ఉన్నాడు. అప్పుల వాళ్ళ ఒత్తిడి పెరిగింది. ఆ సమయంలో తెలిసిన వారికందరికీ ఉత్తరాలు వ్రాసి సహాయమడిగాడు. అంతా ముఖం చాటేశారు.

మనం బాగుంటే భుజాల మీద చేతులేసే వారు, ఇబ్బందులలో ఉంటే తలతిప్పి కూడా చూడరు. అదే జరిగింది. ఎవరూ సమాధానం కూడ ఇవ్వలేదు. మేము కూడా అంతంత మాత్రమే కదా. అప్పటికీ పెద్దన్నయ్య ఒక ఎకరా ఎర్రపొలం అమ్మి అయిదులక్షలు ఇచ్చాడు. అవి ఏమూలలకు వస్తాయి? మొత్తం యాభై లక్షల అప్పు! నువ్వెక్కడున్నావో బావకు తెలియదనుకుంటా. తెలిసివుంటే నీవెంట పడేవాడు. సంవత్సరం కాగానే బ్యాంకు వాళ్ళు ఉద్యోగం నుంచి తొలగించారు. రావలసిన డబ్బంతా బ్యాంకులో తీసుకున్న లోన్లకు సరిపోయాయి. పెన్షను లేదు. పూట గడిచే మార్గం దొరకలేదు. అప్పుల బాధ ఎక్కువై రైలు కింద పడి చనిపోయాడు.

రాజన్నయ్య లాయరు కదా, అతనే దగ్గరుండి బాకీల వాళ్ళకు చెప్పి ఒక సెటిల్మెంటుకు ఒప్పించాడు. అప్పు తీసుకున్నవాడు లేకపోయేసరికి, వాళ్ళు కూడ తలవంచి ఇచ్చినది పట్టుకెళ్ళారు. అప్పుడు ఊర్లో రాజన్నయ్య పేరున ఉన్న మాగాణి అమ్మాల్సి వచ్చింది. ఇక నా వంతుగా కుట్టిని, నీలును తెచ్చి పోషిస్తున్నాను!" బాధపడుతూ విషయమంతా చెప్పాడు గోపి.



ఇంకా ఎక్కువ సమయం వాడితో గడిపే అవకాశం లేక, సాయంత్రం ఇంటికి వస్తానని చెప్పి వాణ్ణి పంపేశాను. సీటులో కూర్చుని పని చేస్తున్నానే గానీ నా మనసు మనసులో లేదు. నేను చాలా పెద్ద తప్పు చేశానని అనిపిస్తున్నది. వాడు నన్ను సహాయం అడిగినపుడు స్పందించివుంటే, ఈరోజు వాడి కుటుంబం ఇలా అయ్యేది కాదేమో. వాడు నన్ను సహాయము అడిగినట్లు వీళ్ళకు తెలియదు. తెలిసివుంటే నాతో ఇంతసేపు మాట్లాడేవాడు కాదు గోపి. తప్పుచేశాను. తెలిసి తెలిసీ తప్పు చేశాను. మనసు బాధతో మూలిగింది.

★★★

నేను, సత్యం బాల్యస్నేహితులం. మా నాన్నగారు అంగలకుదురు ప్రాథమిక పాఠశాలలో పనిచేసేటప్పుడు మేము రామారావుగారింట్లో అద్దెకు ఉండేవాళ్ళం. మా ఇంటికి నాలుగు ఇళ్ళకు పక్కగా సత్యం వాళ్ళ మేనమామ వెంకట నరసయ్య వాళ్ళు ఉండేవాళ్ళు. వాళ్ళ పిల్లలే వెంకట్, రాజు, గోపి, కళావతి. కళావతిని అందరం కుట్టి అని పిలిచేవాళ్ళం. రామారావు గారికి సత్యం ఒక్కడే కొడుకు. సత్యం కూడ నా క్లాసే. వెంకట్, రాజు మాకంటే పెద్దవాళ్ళు. గోపి, కుట్టి మాకంటే చిన్నవాళ్ళు. పదవ తరగతి వరకు సత్యం, నేను కలిసే చదువుకున్నాం. తరువాత నేను మా మామయ్య దగ్గరకు సత్తెనపల్లి వెళ్ళిపోయాను.

మా నాన్నగారికి చేబ్రోలు బదిలీ రావడంతో సత్యం వాళ్ళ కుటుంబం మాకు దూరమైంది. అంగలకుదురులో ఉన్నన్ని రోజులూ మా మూడు కుటుంబాలూ చాలా అన్యోన్యంగా ఉండేవి. ఆ అనుబంధం ఒక పది సంవత్సరాలు కొనసాగింది. నా డిగ్రీ చదువు కోసమని మా నాన్న గుంటూరులో ఫ్యామిలీ పెట్టాడు. అప్పుడు సత్యం మా ఇంటికి వస్తూ, పోతూ ఉండేవాడు. ఆ సమయంలో ఇద్దరం కలిసి బాగా తిరిగేవాళ్ళం. ఇద్దరికీ ఉద్యోగాలు వస్తే ఎలా ఖర్చుపెట్టాలో, ఒకరికొకరం ఎలా సహాయపడాలో చర్చించుకునేవాళ్ళం. అలా మా డిగ్రీలు పూర్తయినాయి. అదృష్టవశాత్తు ఇద్దరికీ బ్యాంకులో ఉద్యోగాలు వచ్చాయి. నాకు ఆంధ్రాబ్యాంకులోను, వాడికి కెనరా బ్యాంకులోనూ వచ్చాయి. వాడికి కడప దగ్గర పల్లెలోనూ, నాకు విశాఖపట్టణం దగ్గరగానూ పోస్టింగు వచ్చింది.

అలా వేరైపోయిన మా బంధం క్రమేపి బలహీనపడింది. నేను వాడిని ముఖాముఖి కలవడం వాడికి, కుట్టికి, పెళ్ళి జరిగినపుడే. అది జరిగి ఇప్పటికి పాతిక సంవత్సరాలు. సుమారు పదిహేను సంవత్సరాలకు ముందు సత్యం నుంచి నాకు ఒక ఉత్తరం వచ్చింది. అతని దీనావస్థ గురించి వ్రాస్తూ, ఒక పది లక్షలు అప్పుగా పంపమన్నాడు. వడ్డీ కూడ ఇస్తానన్నాడు. వేరే వాళ్ళ ఖాతానుంచి డబ్బు తీసి వాడానని, ఆ డబ్బు కట్టకపోతే అతను బ్యాంకు మేనేజిమెంటుకు ఫిర్యాదు చేస్తానన్నాడని వ్రాశాడు. వాడి దురదృష్టం వాడి ఉత్తరం చేరడానికి పది రోజుల ముందే నేను గుంటూరులో స్థలం కొన్నాను. మా నాన్న రిటైరయినపుడు వచ్చిన డబ్బు ఉన్నది. కానీ పంపడం నాకు ఇష్టంలేక, బ్యాంకులో మిగిలివున్న యాభైవేలు కావాలంటే పంపుతానని తిరుగు ఉత్తరం వ్రాశాను. వాడి నుంచి జవాబు రాలేదు. బ్యాంకులో వాడు చేసిన పని నాకు నచ్చలేదు. క్రమంగా నేను ఆ విషయం మర్చిపోయాను. మరల ఇన్నాళ్ళకు గోపి ద్వారా వాడి ప్రస్తావన వచ్చింది. బహుశా ఆ రోజు నేను డబ్బులు ఇచ్చి ఉంటే వాడి ఉద్యోగం నిలబడి, వాడు ప్రాణం పోగొట్టుకోకుండా ఉండేవాడేమో!

ఆలోచనలు సాగుతుండగానే గోపి చెప్పిన అడ్రసుకు చేరుకుని కాలింగ్ బెల్ నొక్కాను.

“రా అన్నయ్యా” తలుపు తీసి లోపలకు ఆహ్వానించాడు గోపి.

“బాగున్నావా అన్నయ్యా” అంటూ పలకరించింది కుట్టి. తలంతా నెరసి వుంది. బాగా బక్కచిక్కిపోయింది.

“బాగున్నానమ్మా. ఏంటి తల్లీ, ఇలా అయిపోయావు!” అన్నాను.

“తలరాత అలా తగలడింది అన్నయ్యా. కూర్చో!” అని కుర్చీ చూపింది.

“బాధపడకమ్మా. రాతను మనం తప్పించలేము కదా!”

“వదిన, పిల్లలు బాగున్నారా?”

“బాగున్నారమ్మా!”

"కుట్టీ... అన్నయ్యకు మంచినీళ్ళు తెచ్చివ్వమ్మా!" అని గోపి చెప్పడంతో లోపలికి వెళ్ళింది.

"ఎందుకు చేశాడురా వాడు అంత అప్పు?" అడిగాను గోపిని.

"షేర్లు అన్నయ్యా! బావకు బాగా డబ్బు సంపాదించాలనే యావ ఎక్కువ. సంపద ఉంటేనే విలువ అని నమ్మే మనిషి. మొదట్లో బాగా లాభాలొచ్చాయి. తరువాత సెకండరీ మార్కెట్లో షేర్లు కొనడం మొదలుపెట్టాడు. అవీ భారీగా కొనేవాడు. అందుకోసం అప్పులు చేసేవాడు. ప్రారంభంలో రెండు రూపాయల వడ్డీకి తెచ్చేవాడు. షేర్లలో నష్టాలు రావడంతో, పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు తెచ్చేవాడు. వడ్డీల ధర నెలకు అయిదు రూపాయల దాక పోయింది. అసలు పది లక్షలైతే, వడ్డీతో కలిసి యాభై లక్షలయింది. బ్యాంకులో ఫ్రాడ్ చేయడం మొదలుపెట్టాడు. చివరకు పట్టుబడ్డాడు. ఒత్తిడికి తట్టుకోలేక మరణాన్ని ఆశ్రయించాడు. చివరకు షేర్ల ఏజెంటు కూడ మోసం చేశాడు బావని. ఏదోలే అన్నయ్యా... అంతా మా తలరాత!" గోపి గొంతులో విపరీతమైన బాధ తొంగిచూసింది.

"అన్నయ్యా... కాఫీ తీసుకో!" అని మంచినీళ్ళు, కాఫీ తెచ్చింది కుట్టి. తీసుకున్నాను.

"ఇందులో తప్పు నాదికూడ ఉందన్నయ్యా. నేనూ చిన్నదాన్ని కనుక, డబ్బు విలువ తెలియలేదు. డబ్బు వస్తున్నది కదా అని మితం లేకుండా ఖర్చుపెట్టాను. చెప్పి కొన్ని, చెప్పక కొన్ని! వందనోటును రూపాయినోటుగా చూశాను. అప్పట్లో వెంకటన్నయ్య చెప్పేవాడు. ఎక్కడైనా మంచి స్థలం కొనుక్కోవే... అదే రేపు నీకు ఆధారమవుతుంది అని. వినలేదు. కారణం... సంపద విలువ తెలియకపోవడమే.

బావ కూడా నాకెప్పుడూ అడ్డు చెప్పలేదు. బావకు సస్పెన్షన్ ఆర్డర్ వచ్చేవరకూ, అప్పుల సంగతే నాకు తెలియదు. బావ కూడా ఏదో సంపాదించాలని ప్రాకులాడాడు. అందర్నీ నమ్మాడు. డబ్బు విషయంలో ఎవరినీ నమ్మకూడదని తెలిసేసరికి చేతులు కాలిపోయాయి. ఉన్నప్పుడు లెక్కలేకుండా అందరికీ చేబదులు ఇచ్చాడు. చివరకు మాకు అవసరం వచ్చేసరికి అంతా చేతులెత్తేశారు. గట్టిగా అడిగేసరికి ప్రామిసరీ నోటు చూపించమన్నారు. నమ్మకం మీద ఇచ్చిన చేబదులుకు నోటు తీసుకోము కదన్నయ్యా. చేసేదిలేక చేతులు ముడుచుకున్నాం. అప్పటికీ స్నేహితులందరినీ అడిగాడు. బహుశా నీదాకా రాలేదేమో. ఎవరూ ఆదుకోలేదు. పెద్దన్నయ్య ఇచ్చిన డబ్బులు బ్యాంకుకు కట్టాడు. అయినా ఉద్యోగం నిలవలేదు. బ్రతుకు భారమై పోయింది. నా తలరాతకు నన్ను వదిలేసి బావ ఎగిరిపోయాడు!" వెక్కి వెక్కి ఏడుస్తున్నది కుట్టి.

అతికష్టం మీద ఆమె ఏడుపు ఆపగలిగాము. ఇక్కడ నాకు ఒక విషయం అర్థమైంది. వాడు నన్ను సహాయం అడిగిన విషయం ఇంట్లో చెప్పలేదు. నేను ఇస్తానో, ఇవ్వనో అనే అనుమానంతోనా? లేక నన్ను చెడుగా వీళ్ళు అనుకోకూడదనా? ఏమైనా... నేను తప్పు చేశాను. వాడి చావులో నాది కూడ కొంత బాధ్యత ఉంది. మనసు తప్పు చేశానని మూలుగుతున్నది. వాడి ఉత్తరం చూసి వాడిని కలిసి వివరాలు తెలుసుకుని ఉన్నా, కొంతవరకు వాడిని ఆపగలిగేవాడిని. కొంతలో కొంత ఆదుకోగలిగే వాడిని. కానీ నాలోని స్వార్థం నన్ను ఆలోచింప చేయనీయలేదు. నా సంపదను నేను నిలుపుకోవాలనే తాపత్రయం తప్ప, ఎదుటివాడి ఇబ్బందిని గుర్తించలేక పోయాను. స్నేహంలోనూ స్వార్థం. నామీద నాకే అసహ్యం వేసింది. జరిగిన తప్పు జరిగిపోయింది. అనుకొని ప్రయోజనం లేదు. కనీసం ఇప్పుడన్నా వాడి కుటుంబానికి సాయం చేయాలి.

"కుట్టీ... బాధపడకమ్మా. ఉద్యోగం విలువ వాడికి తెలియలేదు. డబ్బు విలువ నీకు తెలియలేదు. సంపద అంటే కేవలం డబ్బు సంపాదనే అనుకుని అడ్డదారులు తొక్కాడు. వాడు షేర్ల వ్యాపారం బదులు స్థలాలమీద పెట్టివున్నా ఇంత అధోగతి పాలయ్యేవాడు కాదు. ఇప్పుడనుకుని ప్రయోజనం లేదు. వాడి స్నేహితుడిగా నేను ఒక్క సహాయం చేయగలనమ్మా. నీలూకు

పెళ్ళిసంబంధం నేను చూస్తాను. దాని పెళ్ళి ఘనంగా చేస్తాను. ఈ ఒక్క అవకాశం నాకివ్వమ్మా. వాడి ఋణం తీర్చుకునే భాగ్యం నాకు కలిగించు!" స్నేహం విలువ గుర్తించలేని నా పాపాన్ని కడిగేసుకోవాలనే తపన నాది.

"ఎందుకన్నయ్యా... నీకెందుకంత శ్రమ? మేమున్నాముగా. దాన్ని వెంకటన్నయ్య కొడుక్కు ఇచ్చి చేద్దామనుకుంటున్నాము!" అన్నాడు గోపి.

"సంతోషంరా... చాలా సంతోషం. మీలాంటి తోబుట్టువులు ఉండడం కుట్టి అదృష్టం. కుట్టికి నేనూ అన్నయ్యనేరా. నావంతు బాధ్యతగా నీలూ పెళ్ళి ఖర్చంతా నాది. ఇక ఈ విషయంలో మీరు అడ్డు చెప్పకండి. ఇదే ఫైనల్!" నాలో ఏదో ఆనందం. నా స్నేహితుడి బాధ్యతను కొంత నేను తీరుస్తున్నాననే తృప్తి.

ముందు అభ్యంతరాలు చెప్పినా తరువాత ఒప్పుకున్నారు వాళ్ళు. ఇక మీతో టచ్‌లో ఉంటానని చెప్పి, నా అడ్రసు, ఫోను నెంబరు ఇచ్చి వచ్చాను. వచ్చేముందు కుట్టిలో నాపట్ల కనిపించిన కృతజ్ఞతాభావం మాటలలో చెప్పలేనిది.

ఇదే సహాయం నేను ఆరోజు సత్యానికి చేసి వుంటే, ఈరోజు కుట్టిని ఈ స్థితిలో కాకుండా సుమంగళిగా చూసి ఉండేవాడినేమో... నా సహాయం వాడిని గట్టెక్కించేదో, లేదో నాకు తెలియదు కానీ, నాలో ఆత్మన్యూనత మాత్రం ఇప్పటికీ అలాగే మిగిలిపోయింది. స్నేహం విలువ తెలిసినవాడు కనుక వాడు నా గురించి వీళ్ళ వద్ద నోరు మెదపలేదు. నన్ను అడగనట్టుగానే ఉంచి నా విలువను కాపాడాడు. మరి నేనేం చేశాను? సాయం చేయగలిగే స్థితిలో ఉండి కూడా స్నేహితుడికి సాయపడలేదు. నిజం తెలిసి ఉంటే వీళ్ళు ఇప్పుడు నా సాయాన్ని కూడ తిప్పికొట్టేవాళ్ళు.

'నువ్వు చాలా గొప్పవాడివిరా... స్నేహం విలువ తెలిసినవాడివి. నీముందు నేనిప్పుడు అల్పుడిని...' నా కళ్ళు వర్షిస్తున్నాయి. వాడి కూతురికి పెళ్ళి చేసినంత మాత్రాన నా తప్పు ఒప్పు కాదు. ఒక తృప్తి మాత్రమే...

# అన్వేషణ

విజయార్కె



✆ 9700289681

***జూపిటర్ ఫండ్ మేనేజ్మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆండ్రూ ఫార్మికా తన సి. ఇ. ఓ. పదవికి రాజీనామా చేసి, స్వదేశమైన ఆస్ట్రేలియాకు వెళ్లి వృద్ధులైన తన తల్లిదండ్రులతో గడపాలని అనుకున్నాడట. అతని ఆస్తుల విలువ అరవై బిలియన్ డాలర్లు... అంటే అయిదు లక్షల కోట్లరూపాయలు! అతనికి ఆనందం తన సంపాదనలో లేదు. ఒక విధంగా ఆండ్రు ఫార్మికా చేసిన ఆనందమనే అన్వేషణ, తను తీసుకున్న నిర్ణయానికి నాంది పలికింది!***

ప్రపంచంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరైన సిద్ధార్థ తన కుటుంబంలో ఆనందాన్ని అన్వేషిస్తూ చివరి ప్రయత్నంగా 'తన తల్లిని, భార్యాపిల్లలను ఆనందంగా వుంచినవాళ్లకు నా ఆస్తిలో నాలుగవ భాగం ఇస్తానని' ఒక ప్రకటన ఇచ్చాడు. సిద్ధార్థ కళ్ళు తెరిచాడు. ప్రత్యేక విమానం సముద్రం మీదుగా ఎగురుతోంది. అది అతని స్వంత ఫ్లైట్. అత్యవసరం... అనివార్యం అయితే తప్ప, తోటి ప్రయాణికులతో కలిసి విమాన ప్రయాణం చేయడు. దాదాపు చాలా దేశాల్లో అతనికి ప్రత్యేక విమానాలు సిద్ధంగా ఉంటాయి. రైలులో థర్డ్ క్లాస్‌లో ప్రయాణించడానికి కూడా ఇబ్బంది పడ్డ రోజులు... కిక్కిరిసిన జనం మధ్య చెమటలు కక్కుతూ ప్రయాణం చేసిన సంఘటనలు... షేర్ ఆటోల్లో వెళ్లిన వెళ్లిన జ్ఞాపకాలు... పెళ్ళైన కొత్తలో ఒకే గదిలో అమ్మ, భార్య తను పడుకున్న రోజులు... పేదరికం అనే పదానికి భయంతో వణికిపోయిన క్షణాలు...

కసితో, కృషితో తండ్రి మరణం తర్వాత, తల్లి దగ్గర తండ్రి జ్ఞాపకంగా వున్న తాళిని తెగనమ్మి, చిన్న వ్యాపారంతో జీవన ప్రస్థానాన్ని మొదలుపెట్టి, పదేళ్లలో దేశంలోని టాప్ టెన్లో, అత్యంత సంపన్నుల్లో ఒకడిగా నిలిచాడు సిద్ధార్థ! ఎన్నో పరిశ్రమలు, వ్యాపారాలు, ప్రముఖ కంపెనీలలో షేర్లు... విదేశాల్లో విల్లాలు, స్వదేశంలో లెక్కకు మించిన సంపద. కొన్ని ద్వీపాలకు అతను అధిపతి. ఒక మనిషి తలచుకుంటే, సాధించలేనిది ఏదీ లేదని చెప్పడానికి ఉదాహరణ సిద్ధార్థ! అయినా తన మూలాలు మర్చిపోలేదు. కష్టాల్లో ఉన్నవాళ్లను ఆదుకున్నాడు. వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఏడేళ్ల కూతురు వర్ష, భార్య వాణి, తల్లి వీళ్ళే తన ప్రపంచం! తల్లి తన ఒంటి మీద వున్న చివరి బంగారాన్ని, తాళిని కొడుక్కి ఇచ్చింది. ఆ విషయం సిద్ధార్థ మర్చిపోలేదు. అందుకే తల్లి పేరు మీద ప్రపంచవ్యాప్తంగా జువెల్లరీ షాప్స్ ఓపెన్ చేసాడు. అమ్మ గోల్డ్ ఫ్రాంచైజీలు ప్రారంభించాడు.

★★★

తన కష్టాల్లో పాలు పంచుకున్న భార్యకు పేదరికం కారణంగా పండక్కి కొత్త చీర కొనివ్వలేని రోజులు గుర్తొచ్చాయి. అందుకే వాణి వస్త్ర ప్రపంచాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించాడు. వందలాది షో రూములు. కూతురిని ఢిల్లీలోని ఖరీదైన స్కూల్లో చదివిస్తున్నాడు. ఒక్క సంవత్సరం కూతురికి కట్టిన ఫీజుతో ఒక కుటుంబం జీవితాంతం నిశ్చింతగా బ్రతికేయొచ్చు. కూతురుని చూడడానికి వెళ్ళడానికి ఛాపర్ రెడీగా ఉంటుంది. వ్యాపార రంగంలో డేర్ డెవిల్, సాహసి... అని పేరు! అలాంటి సిద్ధార్థ ఇప్పుడు ఆత్మరక్షణలో పడ్డాడు. ఆలోచనలో కూరుకుపోయాడు! భార్యలో... తల్లిలో... చివరికి ఢిల్లీలో వున్న కూతురిలో కూడా ఆనందం కనిపించడం లేదు! ఆర్థిక బాధలు లేవు. తన ప్రేమలో లోపం లేదు. ఎంత రాత్రయినా, ఇంటికి రాగానే భార్యను, తల్లిని పలకరిస్తాడు. వాళ్ళ కోసం తెచ్చిన కానుకలు ఇస్తాడు. వారానికొకసారి కూతురు దగ్గరికి వెళ్తాడు. కూతురికి ఇష్టమైన

గిఫ్ట్స్ ఇస్తాడు. కూతురి కోసం ఒక బ్లాక్ మొత్తం ప్రత్యేకంగా తీసుకున్నాడు. సెక్యూరిటీ కూడా ఉంటుంది. "థాంక్స్ డాడీ" అని మాత్రం అంటుంది!

తన తల్లిలో, భార్యలో, కూతురిలో కనుమరుగైన ఆనందాన్ని అతను ఇటీవలే గుర్తించాడు. బిజినెస్‌లో ఒక వ్యాపారంలో నష్టం వస్తుందని తెలిస్తే, వెంటనే నష్ట నివారణ చర్యలు చేపడతాడు. వ్యాపారాన్ని తిరిగి లాభాల బాట పట్టేలా చేస్తాడు... లేదా, ఆ వ్యాపారాన్ని వైండప్ చేస్తాడు. కానీ ఇది జీవితం! ఇది తన కుటుంబం. ఏ కుటుంబం కోసం నిద్రాహారాలు మాని, ఈ స్థాయికి వచ్చాడో, ఆ కుటుంబమే ఆనందంగా లేకపోతే, అందుకు కారణాలు అన్వేషించాలి. వాళ్ళు కోల్పోయిన ఆనందం తిరిగివ్వాలి!

ఒక రోజు భార్యను అడిగాడు... "నా ప్రేమలో లోపం ఉందా? నిన్ను బాగానే చూసుకుంటున్నాను కదా? " అని.



"ఛ... ఛ... నాకే లోటూ లేదు!" అంది ముభావంగా. ఆమె మనసును చదివే ప్రయత్నం చేసి ఉంటే కొంతైనా అర్థమై ఉండేది.

తల్లినీ అడిగాడు "ఒక బిడ్డగా నేను నిన్ను బాగానే చూసుకుంటున్నాను కదమ్మా? " అని.

"నువ్వు బంగారం!" అంది కొడుకు చూడకుండా చీరకొంగుతో కన్నీళ్ళొత్తుకుంటూ!

ఢిల్లీలో చదువుకుంటున్న కూతురిని అడిగాడు వీడియో కాల్లో... "నేను హ్యాపీ గా వున్నాను డాడీ" అంది.

కానీ ముగ్గురిలో ఏదో అసంతృప్తి!

వ్యాపారంలో నష్టం వస్తేనే దిద్దుబాటు చర్యలు చేపట్టి, లాభాలబాట వైపు మళ్లించే అతను, తన కుటుంబంలో ఆనందాన్ని కోల్పోవడం అనే నష్టం వస్తే ఊరుకుంటాడా?

అదే సమయంలో సిద్దార్థ ఒక పత్రికలో స్టాండప్ కమెడియన్స్ గురించి చదివాడు. తల్లికి, భార్యకు, కూతురికి ఎంటర్టైన్మెంట్ ఇవ్వాలనుకున్నాడు. ప్రపంచంలోని పేరుమోసిన స్టాండప్ కమెడియన్స్ గురించి ఆరా తీసాడు. బాధల్లో ఉన్నవాళ్ళని మాత్రమే కాకుండా, దిగులుగా ఉన్నవాళ్ళని, ప్లజంట్ మూడ్‌లోకి తెచ్చే ప్రముఖ స్టాండప్ కమెడియన్స్ ని, తన ప్యాలస్ లాంటి ఇంటికి పిలిపించారు. వివిధ భాషలకు చెందిన స్టాండప్ కమెడియన్స్ వున్నారు. తన ప్యాలెస్‌లో ఓపెన్ థియేటర్‌లో తను, భార్య, కూతురు, తల్లి మాత్రమే ఉన్నారు. గంటకు లక్షల రూపాయలు చెల్లించాడు. రకరకాల జోక్స్, హావభావాలు, కామెడీ స్కిట్స్, పంచులు... ఆడిటోరియంలో ప్రేక్షకుల ఈలలు మధ్య చేసే ప్రోగ్రాం, నాలుగు గోడల మధ్య ప్రత్యేకంగా చేస్తున్నారు. సిద్ధార్థ

గమనిస్తున్నాడు. ఎవ్వరి మొహంలోనూ చిన్న నవ్వు లేదు, ఆనందం లేదు. స్టాండప్ కమెడియన్స్ తాము తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వబోయారు.

“మీరు మీ ప్రోగ్రాం అద్భుతంగా చేశారు” అని చెప్పి వాళ్ళను సత్కరించి పంపించాడు.

ఢిల్లీలో పేరుమోసిన సర్కస్‌ని తన ప్యాలెస్‌లో ఏర్పాటు చేసాడు. కేవలం తన కుటుంబం కోసమే... ఒక సినిమా చూసినట్టు చూస్తున్నారు. అంతకు మించి ఎవ్వరిలోనూ తను కోరుకున్న తృప్తి ఆనందం కనిపించలేదు!

పేపర్లో ప్రకటన చూసి చాలామంది ముందుకు వచ్చారు. సలహాలు ఇచ్చారు. విదేశాలకు తీసుకు వెళ్ళమని, చెప్పారు. వాళ్లకు ఇష్టమైనవి ఏమిటో కనుక్కోమన్నారు. నోరు తెరిచి ఏమీ చెప్పరే... అడగరే! అప్పటికే ప్రత్యేక విమానంలో అన్ని దేశాలు తీసుకువెళ్లాడు. అలాంటి పరిస్థితుల్లో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్లో సిద్ధార్థ సమస్యకు పరిష్కారం దొరికింది అతని రూపంలో!

కొన్ని యాదృచ్ఛికమైన సంఘటనలు జీవితంలో అద్భుతాలకు దారి చూపుతాయి. సిద్ధార్థ ఎయిర్‌పోర్ట్‌లో దిగి వస్తుంటే అనుకోకుండా ఒక వ్యక్తి ఎదురు వచ్చాడు. ఇద్దరూ చూసుకోలేదు. అపరిచిత వ్యక్తి చేతిలో ఫైల్ కిందపడిపోయింది. వెంటనే సిద్ధార్థ అతనికి సారీ చెప్పాడు. ఆ అపరిచిత వ్యక్తి వెంటనే... “ఇందులో నా తప్పు కూడా వుంది. నేను కూడా చూసుకోలేదు” అంటూ సిద్ధార్థ వైపు చూసి “మీరు సిద్ధార్థగారు కదా! పేపర్లో మీ ప్రకటన చూసాను.” చిన్నగా నవ్వి అన్నాడు.

“ఓహ్... కానీ ఆ ప్రకటన అనుకున్నంత ఫలితాన్ని ఇవ్వలేదు!” చెప్పాడు సిద్ధార్థ.

“ఓహ్... సారీ! మీరు ఎలాంటి ప్రయత్నాలు చేసారో తెలుసుకోవచ్చా? “ అడిగాడు.

అపరిచిత వ్యక్తి మాటల్లో నిజాయితీ, అతని మొహంలో తేజస్సు చూసి చిన్నగా నిట్టూర్చి జరిగింది చెప్పాడు సిద్ధార్థ.

“మీరు అతి తక్కువ సమయంలో ఈ ఉన్నతమైన స్థాయికి చేరుకోవడానికి పెద్ద యుద్ధమే చేసి ఉంటారు. సమస్యలతో, ఓటమితో... కదా!” అన్నాడు అపరిచిత వ్యక్తి.

“అఫ్ కోర్స్ జీవితంలో యుద్ధం తప్పదు. సాహసం చేయకా తప్పదు!” కాస్త గర్వంగా అన్నాడు.

“ఇప్పుడు అదే సాహసం చేస్తారా? మీ కుటుంబం కళ్ళలో ఆనందం సంతృప్తి చూడడం కోసం!” సూటిగా అడిగాడు అపరిచిత వ్యక్తి.

“నేను బ్రతుకుతున్నదే నా కుటుంబం కోసం!” చెప్పాడు సిద్ధార్థ

“మీకు అభ్యంతరం లేకపోతే కొన్నాళ్ళు నేను చెప్పినట్టు ఎందుకు... ఏమిటి... అని అడక్కుండా చేయగలరా? “ అపరిచిత వ్యక్తి అడిగాడు.

“తప్పకుండా... మీ మాటల్లో ఏదో మ్యాజిక్ ఉంది! “ అన్నాడు సిద్ధార్థ చిన్నగా నవ్వి.

“అయితే నేను మీతో వస్తాను. నన్ను మీ ఫ్రెండ్‌గా పరిచయం చేయండి చాలు!” అన్నాడు.

భగవద్గీతలో అర్జునుడికి గీతాబోధ చేస్తున్న కృష్ణుడిలా కనిపించాడు అపరిచిత వ్యక్తి సిద్ధార్థ కళ్ళకు!

★★★

ఒక కాలనీ నివసించేంత విస్తీర్ణంలో ఉన్న ఇల్లు. సెక్యూరిటీ, నలుగురు వంటవాళ్లు... సౌత్ నార్త్ వంటకాలే కాదు ఇటాలియన్, చైనీస్ వంటకాలు కూడా చేయగలిగే వంటవాళ్లు. జీతాలు వేలల్లో... నెలకు ఖర్చు లక్షల్లో!

అపరిచిత వ్యక్తిని తన స్నేహితుడిగా పరిచయం చేసాడు. వివరాలు వాళ్ళు అడగలేదు... సిద్ధార్థ చెప్పలేదు. అది ఆ ఇంట్లో వాళ్లకు ఉన్న సంస్కారం. సిద్ధార్థ తల్లి ఆప్యాయంగా పలకరించింది. అదే రోజు ఢిల్లీలో చదువుతున్న కూతురిని పిలిపించాడు అపరిచిత వ్యక్తి చెప్పినందున! అదే రోజు రాత్రి సిద్దార్థకు ఏం చేయాలో చెప్పాడు అపరిచిత వ్యక్తి.

మరుసటి రోజే ఒక చిన్న ఇంట్లోకి మారిపోయింది సిద్ధార్థ కుటుంబం. ఖరీదైన కార్లు రోల్స్ రాయిస్, బెంజ్, జాగ్వార్, అన్నీ షెడ్లో విశ్రాంతి తీసుకుంటున్నాయి. ఒకప్పటి తను వాడిన పాత స్కూటర్ రిపేర్ అయి, కొత్త ఇంటికి వచ్చింది. కేవలం రెండు పడక గదుల ఇల్లు. చిన్న కిచెన్. చుట్టూ ప్రహరీ. పూల మొక్కలు. పెరట్లో జామ చెట్టు. విశాలమైన మనసు వున్న కుటుంబం నివసించడానికి ఇరుకైన ఇల్లు.

రాత్రి అంతా ఇల్లు సర్దుకోవడంతో నిద్రలేదు. ఎక్కువ భాగం ఇల్లు సర్దింది సిద్ధార్థనే. పనివాళ్ళు సామాన్లు దింపేసి వెళ్లారు. తల్లి, భార్య, కూతురు వింతగా చూస్తున్నారు. చాలాకాలం తర్వాత అలసటగా నిద్రపోయారు. ఉదయాన్నే లేచి స్నానం చేసొచ్చాడు. భార్య కూడా లేచి, అలానే చూస్తూ ఉండిపోయింది. ఖరీదైన నైట్ డ్రెస్‌లో కనిపించే భర్త, లుంగీ బనియన్‌తో వున్నాడు. కిచెన్ రూమ్‌లో కుస్తీ పడుతున్నాడు. ఫిల్టర్ కాఫీ తయారుచేసి కప్పులోకి ఒంపి తల్లికి ఇచ్చాడు.

"అమ్మా కాఫీ... నీకిష్టమైన ఫిల్టర్ కాఫీ. రుచి తక్కువైతే తిట్టుకోకమ్మా... రేపు సూపర్‌గా చేస్తాను!" తల్లి చేతికి ఇచ్చి అన్నాడు. ఆమె అక్కడే అలాగే వాలు కుర్చీలో కూర్చొని కొడుకు వంకే చూస్తోంది. సిద్ధార్థ నేలమీద కూర్చుని తల్లి వంకే చూస్తున్నాడు.

"ఏమైందమ్మా పంచదార తక్కువైందా? ఫిల్టర్ ఎక్కువైందా?" అడిగాడు తల్లి కళ్ళలోకి చూస్తూ.

కొడుకు తలను తన ఒళ్ళో పెట్టుకుంది. ఆమె కళ్ళు తడిబారాయి. 'నీ ప్రేమ ఎక్కువైంది. నాలోని దిగులు తక్కువైంది' అని చెప్పాలనిపించింది.

ఆ దృశ్యం చూసిన భార్య వాణి అలాగే ఉండిపోయింది!

"వాణీ ఈ రోజు వంట నేను చేస్తాను. నువ్వు, వర్ష, అమ్మ రుచి చూసి ఎలా ఉందో చెప్పండి. జస్ట్ నాకు నువ్వు హెల్ప్ చేస్తే చాలు!" అన్నాడు.

తలకు టవల్ చుట్టుకుని, భర్త వంట చేస్తుంటే వాణి మనసు పదేళ్లు వెనక్కి వెళ్ళింది. పొద్దున్నే కిచెన్ వంక కూడా చూడకుండా ఆఫీసుకు వెళ్లే భర్త వంట చేయడమా? భర్త ఇడ్లీ చేస్తుంటే వాణి చట్నీ చేసింది. చిన్న డైనింగ్ టేబుల్. తల్లి, భార్య, కూతురు, అపరిచిత వ్యక్తి, సిద్ధార్థ కూర్చొని తిన్నారు. వంట వాళ్ళు లేరు. పనివాళ్ళు లేరు.

స్కూటర్ మీద కూతురిని కొత్త స్కూల్లో చేర్పించాడు. వర్ష ఆనందంగా వుంది. ఇంపోర్టెడ్ కారులో ఒక్కర్తే స్కూల్‌కు వెళ్లిన ఫీలింగ్ కన్నా... నాన్న వెనకాల, నాన్నను గట్టిగా పట్టుకుని కూర్చుని స్కూల్‌కు వెళ్లి, నాన్న వెళ్లేవరకు టాటా చెప్పడం బాగుంది. సాయంత్రం వచ్చేప్పుడు దారిలో ఆపి, పీచుమిఠాయి కొనిపెట్టాడు. పుస్తకాలకు అట్టలు వేసాడు. సాయంత్రం భార్యను తీసుకుని కూరగాయల మార్కెట్‌కు వెళ్ళాడు. ఇద్దరూ కూరగాయలు తీసుకున్నారు. దారిలో ఆగి, చిన్న రోడ్డు పక్కన వున్న

చాట్ లో భార్యకు ఇష్టమైన పానీపూరి తినిపించాడు. తనూ తిన్నాడు. రాత్రి భార్యతో కలిసి, తల్లి కోసం చపాతీ చేసాడు. వేడివేడి సాంబార్, వడియాలు... అందరూ కలిసి డిన్నర్ చేశారు. భార్యాబిడ్డలను, తల్లిని తీసుకుని సెకండ్ షో సినిమాకు వెళ్ళాడు సిద్ధార్థ. తల్లికి ఇష్టమైన ఎన్టీఆర్, అక్కినేని సినిమా 'గుండమ్మ కథ'. పొద్దున్నే తల్లిని తీసుకుని మార్నింగ్ వాక్‌కు వెళ్తున్నాడు. భార్యను చీరల షాప్‌కు తీసుకెళ్ళి, తనే చీరలు సెలెక్ట్ చేసాడు. వచ్చేప్పుడు మార్కెట్ దగ్గర పూలు తీసుకున్నాడు.

★★★

తన వ్యాపారం కోసం తల్లి తాళిబొట్టును అమ్మాడు. వెంటనే ఆ తాళిబొట్టు కోసం అన్వేషించాడు. అతని అదృష్టం... ఆ తాళిబొట్టు అలాగే వుంది! తను అమ్మిన ధరకు వందరెట్లు చెల్లించి తాళిబొట్టు తీసుకువచ్చాడు!

అది బంగారం మాత్రమే కాదు తల్లికి తండ్రి జ్ఞాపకం. తల్లి పాదాల దగ్గర పెట్టాడు. తల్లి కళ్ళలో నుండి కన్నీళ్ళు జలజల రాలాయి. "నువ్వు నా పేరుతో పెట్టిన బంగారం కొట్లు అన్నీ, నువ్వు నాకు తిరిగి తీసుకువచ్చినా.. మీ నాన్న జ్ఞాపకం అయిన ఈ తాళిబొట్టుకు సరిపోవు!" కొడుకుని గుండెలకు హత్తుకుని చెప్పింది.

ఎప్పుడూ మంచం మీద పడుకుని శూన్యంలోకి చూస్తూ వుండే తల్లిలో కొత్త ఉత్సాహం. పొద్దున్నే లేవడం, కొడుకు కోడలితో వాకింగ్ చేయడం, సాయంత్రం మనవరాలితో ఆడుకోవడం, కళ్ళముందే కొడుకు.

సిద్ధార్థ భార్య వాణిలో కూడా ఎంతో మార్పు వచ్చింది. సిద్ధార్థ కోరుకున్న ఆనందం కుటుంబంలో కనిపించింది.

పది రోజులు గడిచాయి. అప్పటివరకు తమతో ఉన్న అపరిచిత వ్యక్తి... "ఇక నే వెళ్లొస్తాను!" అంటూ సిద్ధార్థ వైపు చూశాడు.

"మీ ఋణం తీర్చుకోలేనిది. మీ పరిచయం మర్చిపోలేనిది! నా కుటుంబం మీవల్లే ఆనందంగా వుంది. వాళ్ళ కళ్ళలో తృప్తి చూసాను!" నిజాయితీగా అన్నాడు సిద్ధార్థ.

"అందరూ 'డౌన్ టు ఎర్త్' అంటారు, కానీ మీరు ఎర్త్ టు డౌన్ వచ్చారు... మీ కుటుంబం కోసం! జీవితంలో డబ్బు, స్టేటస్ సంపాదించడం గొప్పే కావచ్చు. కానీ వాటిని వదులుకుని ఎర్త్ టు డౌన్‌కు వచ్చి, భార్య కళ్ళల్లో ఆనందం, కూతురి కళ్ళలో సంతోషం, తల్లి కళ్ళలో సంతృప్తి చూడటం కోసం, మీరు ఒక సామాన్యుడిగా మారారు. ఎన్ని పడగ్గదులు ఉన్నా, పడుకోవడానికి పనికివచ్చే గది ఒక్కటే! పిలిస్తే పలికినంత దూరంలో ఉన్నప్పుడు ఆ పిలుపు పులకించిపోతుంది. స్కూటర్ మీద మీరు మీ కూతురిని దించినప్పుడు తనలో ఉండే సంతోషం, బస్సులో పంపిస్తేనో, ఖరీదైన కాన్వెంట్ లో చదివిస్తేనో ఉండదు కదా! కొడుకు కళ్ళముందే ఉండి రోజుకోసారి పలకరిస్తే, ఆ తల్లికి అంతకన్నా సంతృప్తి ఏముంటుంది! ఎన్ని కోట్లు సంపాదించినా, ఎన్ని స్థిరాస్తులు పోగు చేసినా, మన దేహం ఖననమో... దహనమో... ఉన్న కొద్దికాలం ఆనందంతో గడిపే ప్రయత్నం ఒక సాహసమే!" చిన్నగా నవ్వి అన్నాడు అపరిచిత వ్యక్తి.

సిద్ధార్థ అపరిచిత వ్యక్తి చేతుల్ని అప్రయత్నంగా తన చేతుల్లోకి తీసుకుంటూ... "మీరన్నది నిజమే. సరిపడినంత సంపద సంపాదించాక.. సరిపడినంత సంతృప్తిని కూడా సంపాదించాలి!" అన్నాడు సిద్ధార్థ.

"ఇక మీ ఇంట్లో ఆనందమే ఉంటుంది. ఎంత పెద్ద ఇంట్లోకి వెళ్లినా, ఈ ఆనందాన్ని మిస్సవ్వరు. ఎందుకంటే జీవితాన్ని అర్థం చేసుకుని, ఎక్కడ తగ్గాలో తెలిసి గెలిచిన నిజమైన అడ్వెంచర్ మీ లైఫ్ లోకి వచ్చేసింది. ఇక నాకు సెలవ్! మీరు మీ ప్యాలెస్‌కు వెళ్లొచ్చు. కానీ మీ వాళ్ళతో గడిపే సమయాన్ని మిస్సవ్వొద్దు. సంపాదనకు సమయం కుదించండి. సంతృప్తికి సమయాన్ని

వెచ్చించండి. ఆనందాన్ని ఇచ్చే అనుబంధాలను కాపాడుకోవడమే... మీరు మీ వాళ్లకు ఇచ్చే అందమైన రిటర్న్ గిఫ్ట్!" అన్నాడు అపరిచిత వ్యక్తి.

"మిత్రమా మీ గురించి చెప్పకుండానే వెళ్తున్నారు!" సిద్ధార్థ అన్నాడు.

"నేను ఒక రచయితను. కథ కోసం ఆలోచిస్తూ పరధ్యానంగా నడుస్తూ మిమ్మల్ని ఢీ కొట్టాను. యాదృచ్ఛికమైన ఆ సంఘటన నాకో కథను పరిచయం చేసింది. మీ గురించి, మీరు ఇచ్చిన ప్రకటన గురించి చదివి ఉండడం వల్ల, ఒక రచయితగా నాకు తోచిన ఆలోచన చెప్పాను. జూపిటర్ ఫండ్ మేనేజ్‌మెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆండ్రూ ఫార్మికా తన సి. ఇ. ఓ. పదవికి రాజీనామా చేసి, స్వదేశమైన ఆస్ట్రేలియాకు వెళ్లి, వృద్ధులైన తన తల్లిదండ్రులతో గడపాలని అనుకున్నాడట. అతని ఆస్తుల విలువ అరవై బిలియన్ డాలర్లు... అంటే అయిదు లక్షల కోట్ల రూపాయలు! అతనికి ఆనందం తన సంపాదనలో లేదు. ఒక విధంగా ఆండ్రు ఫార్మికా చేసిన ఆనందమనే అన్వేషణ, తను తీసుకున్న నిర్ణయానికి నాంది పలికింది!" అంటూ ఆ అపరిచిత వ్యక్తి వీధి గుమ్మం వైపు అడుగు వేశాడు.

"మిత్రమా... మరి ప్రకటనలో చెప్పినట్టు నాలుగవ భాగం మీరు తీసుకోకుండానే వెళ్తున్నారు!" సిద్ధార్థ అన్నాడు.

"మీ కుటుంబంలో ఒక భాగం అయ్యాను! అది చాలు!" చిరునవ్వుతో అన్నాడు అపరిచిత వ్యక్తి.

"నా అన్వేషణకు దారి చూపిన మీరు, మీ పేరు చెప్పకుండానే వెళ్తున్నారు. భావ్యమా!" సిద్ధార్థ అన్నాడు.

ఆ అపరిచిత వ్యక్తి పకపక నవ్వి "నా పేరా? ఈ కథారచయిత పేరే!" చెప్పి ముందుకు నడిచాడు.

# మొక్కులు

రేపాక కామేశ్వర రావు



✆ 7032905901

***"డాక్టర్ గారు, మీరు కూడ నమ్ముతారా ఈ విధమైన మొక్కు చెల్లింపులు" అని ఎవరైనా అడిగితే, "ఏదైనా కోరికతో అమ్మవారిని మొక్కుకున్నాక ఆ కోరిక తీరినప్పుడు మొక్కు చెల్లించాలి గదండీ!" అని అంటారాయన.***

"ఓలమ్మో ఓలమ్మో నా మనవడికేటైపోనాది?" అచ్చమ్మ గుండెలు బాదుకుంటూ ఇంట్లో నుండి గడపలోకొచ్చింది. వెంటనే చుట్టుపక్కల వాళ్ళందరు అక్కడ గుమిగూడారు.

"ఏటయిందే అప్పా, అలాగ గుండిలు బాదుకుంటున్నావు?" పక్కింటి సూరమ్మ అడిగింది.

"పిల్లడు కళ్ళు తేలేసేస్తున్నాడే" అని ఏడుస్తూ చెప్పింది అచ్చమ్మ.

"నూన ఒత్తు ఎలిగించి పిల్లడికి చూపించు"

"నువ్వుల నూన ఉంతె పాదాలకి మర్దన సెయ్యు"

"పాలు పెట్టమని సెప్పు వాలమ్మకి"

"కొద్దిగ జరగండె, పిల్లడికి గాలాడకుండా మూసీసారు"

"ఊరమ్మోరికి దండమెట్టుకో, ముడుపు కట్టు"

ఇలా తలా ఒక మాట.

అచ్చమ్మకు కాళ్ళు చేతులు ఆడటం లేదు. లేక లేక కలిగిన బిడ్డ! వంశం నిలబడాలని అందరు దేవుళ్ళకి మొక్కుకున్నాది. ఆఖరికి ఊరూరు తిరుగుతూ వారి కులవంశాలను పొగుడుతూ జీవించే 'పొడపాతల' వారిచ్చిన మందుతో కోడలు నీళ్ళోసుకుంది. ఆశించినట్టుగానే కోడలు మగ పిల్లవాడికి జన్మనిచ్చింది.

అక్కడికొచ్చిన వాళ్ళందరు చెప్పినట్టు నువ్వుల నూనెతో మనవడి కాళ్ళు రుద్దింది అచ్చమ్మ. తరువాత ఉతికిన తెల్లని మడిపంచె తీసి, అందులో ఒక ముక్క చింపింది. ఆ గుడ్డకు పసుపు రాసింది. ఆ గుడ్డలో ఒక చారెడు బియ్యము, ఒక పసుపు కొమ్ము, ఒక ఇచ్చు రూపాయి కలిపి ముడి వేసి, ఊరమ్మోరుకి ముడుపు కట్టింది. తూర్పుకి తిరిగి దేవుడి బల్లమీద పెట్టి దండం పెట్టుకుంది.

అచ్చమ్మ కోడలు పిల్లవాడికి పాలివ్వడానికి ప్రయత్నిస్తుంది. కాని పిల్లవాడు తాగడము లేదు.

ఆ రోజుల్లో సరిఅయిన పోషకాహారము లేక, మందులు లేక... ఒకవేళ మందులున్నా ప్రజల మూఢనమ్మకాల వలన మందులు వాడక మరియు ఇతరత్రా కారణాల వలన శిశు మరణాలు ఎక్కువ ఉండేవి. అప్పటికి సుమారు తొంభై శాతం నిరక్షరాస్యులుగా ఉన్న మన దేశములో మూఢనమ్మకాలు ప్రబలముగా ఉండడముతో చిన్నపిల్లలకి ఏ జబ్బుచేసినా గ్రామదేవతలకు కోపమొచ్చిన కారణంగానే అని భావించేవారు.

"ఓలప్పా, మొక్కినమ్మకు తెచ్చి మొక్కిస్తె బాగుంటాది"

"ఇది ఏ అమ్మోరు పనో మనకి తెలుస్తాది"

"ఇప్పుడు సీకటైపోతుంది రేపు పొద్దున ఆపని సెయ్యాలె"

"జింకిబద్రలో 'కొమరమ్మ' అని ఉంతాది కదా, ఇప్పుడెల్లి సెప్తె రేపు పెందిలి కాడ వస్తాది"


"కంచిలిలో కూడ ఉన్నాదె ఇంకొకావిడి"

"ఎందుకె, మైలు దూరం లోపున్నదాన్ని ఒదిలేసి కోసుదు దూరమెల్తామా?"

అందరి సలహాలు విన్న అచ్చమ్మ ఆలస్యం చెయ్యకుండా, వెంటనే కొడుకుని జింకిబద్ర పంపించింది.

★★★

అచ్చమ్మ ఆ పేటలో అందరికి తలలో నాలుక వంటిది. ఏ తల్లి పురుడు పోసుకున్నా, అది అచ్చమ్మ చేతి చలవే! ఆ ఊరిలో మొదటిలో గవర్నమెంటు ఆసుపత్రి లేదు. ప్రైవేటు డాక్టర్లు కూడా లేరు. డబ్బున్న వాళ్ళు పెద్ద పట్టణాలకు పోయి పురుడు పోసుకునే వారు. మిగిలిన వాళ్ళందరికి అచ్చమ్మలాంటి నాటు మంత్రసానులే! తరువాత కొన్నాళ్ళకి గవర్నమెంటు ఆసుపత్రి వచ్చింది. ఒక మంత్రసానిని పోస్ట్ చేసారు గాని, ఆ అమ్మగారిని పిలిస్తే తనకు ఒక రిక్షా పంపించాలి. పని అయ్యేంతవరకు ఆ రిక్షావాడు అక్కడే ఉండాలి అమ్మగారిని తిరిగి తీసుకెళ్ళడానికి. కనీసం వంద రూపాయలు ముట్టజెప్పాలి. ఆ పేటలో ఒక్కరికి కూడ సాధ్యమయ్యే పని కాదు. వారి నెల బత్తెము ఖర్చులతో కలిపి వంద రూపాయల కన్నా తక్కువే!



తల్లికి, పిల్లడికి పురిటి స్నానము చెయ్యించిన రోజున పిలిచి, భోజనము పెట్టి అయిదు రూపాయల తెల్ల మడిపంచె ఇస్తే చాలు అచ్చమ్మకు. అది కూడ ఇవ్వలేని వాళ్ళే ఎక్కువ మంది. వారు భోజనము పెట్టి పంపిస్తారు. అందుకే అందరు అచ్చమ్మ పైనే ఆధార పడతారు. తన కోడలికి కూడ తనే పురుడు పోసింది. మనవడిని అడ్డాలలో వేసుకుని బొడ్డు కోసింది.

అలాంటి అచ్చమ్మకు కష్టము వస్తే ఎవరు ఊరుకోగలరు? పేటలోని వారందరు వచ్చి గుమిగూడారు. ఎవరికి తోచిన సలహా వారు ఇస్తున్నారు.

★★★

నల్లగా నిగనిగలాడుతున్న సుమారు ఆరడుగుల స్ఫురద్రూపం. తలపై మూడొంతులు నెరిసిన ఉంగరాల జుట్టు. అది కూడ మెడ వరకే. ముఖముపై పసుపు రాసుకున్న ఛాయలు. నుదుటిపై రూపాయి కాసంత ఎర్రటి కుంకుమ బొట్టు. ఒంటి మీద నల్లటి పువ్వులున్న తెల్లటి కోక. చిరు మందహాసంతో కూడిన ఒకింత గర్వము తొణికిసలాడే మోము. చెవులకు బంగారపు నాగులు. ముక్కున రెండు పక్కల సెరమ కమ్మలు, మధ్యలో బులాకి. ముంజేతులకు వెండి కడియాలు, పాదాలకు పావకోళ్ళు రక్షణ. ఎక్కడికెళ్ళినా ఇదే 'కొమరమ్మ' ఆహార్యం.

ఈమెను 'దేవుడమ్మ' అని కొందరు, 'మొక్కినమ్మ' అని కొందరు అంటారు. ఎవరికైనా జబ్బు చేస్తే... ముఖ్యముగా చిన్నపిల్లలకి జబ్బు చేస్తే, దేవుళ్ళ లేక దేవతలకు తమపై ఆగ్రహము కలిగిందని భావించి ఈమెను తెప్పించి, మొక్కించి ఏ కారణముగా జరిగిందో తెలుసుకుంటారు. ఇది అక్కడి వారి నమ్మకం.

"ఏమే అచ్చమ్మా, ఏమయింది?" వస్తూనే కొమరమ్మ పలకరింపు.

అచ్చమ్మకు కొమరమ్మకు ముందు పరిచయం ఉంది. ఆ వీధిలో ఎవరికి ఏ జబ్బు చేసినా కొమరమ్మని తెచ్చి మొక్కించమని అచ్చమ్మ సలహా ఇస్తుంది. అందుకే కొమరమ్మ స్నేహపూర్వకమైన పలకరింపు.

"రాయమ్మా, నీ కోసమే చూస్తున్నాము" అంటు కొమరమ్మను ఇంట్లోకి తీసుకెళ్ళింది.

కొమరమ్మ వచ్చి తన కోసం వేసిన పీటపై తూర్పు దిశగా కూర్చోగానే, అప్పటికే సిద్ధం చేసుకున్న అయిదు సోలలు బియ్యము, అయిదు పసుపు కొమ్ములు అయిదు రూపాయి బిళ్ళలు నింపిన వెదురు చేటను అచ్చమ్మ ఆమె ముందు ఉంచింది. ఒక ఇత్తడి చెంబుతో పసుపు నీళ్ళు తెచ్చి పెట్టింది. కొమరమ్మ రాకతో ఆ చుట్టుపక్కల వాళ్ళంతా అచ్చమ్మ ఇంటికి చేరుకున్నారు.

కొమరమ్మ కళ్ళు మూసుకొని, రెండు చేతులను చెవులపై పెట్టి ఇష్టదైవాన్ని ప్రార్థిస్తున్నట్టు ఉంది. బయటకు వినబడని మంత్రాలేవో ఉచ్చరిస్తున్నట్టు ఆమె పెదవుల కదలిక బట్టి అనిపిస్తున్నది.

"ఏమిటే సోద్దెం సూస్తన్నారు, లెగండి. మొక్కినమ్మకి గాలి ఆడదు, కొద్దిగ జరగండి!" పక్కింటి సూరమ్మ గట్టిగా అరిచింది.

"నువ్వూరుకోయే, గోల సెయ్యకు. అమ్మోరు వచ్చేసిందే. ఆయమ్మ మొకము సూడు, ఎర్రగ కందగడ్డలాగ మారిపోయింది!" ఇంకొకామె తాజా కబురు.

ఇలా అయిదు నిముషాలు గడిచేసరికి కొమరమ్మ ఊగిపోవడం మొదలయ్యింది. పెద్ద పెద్ద కేకలతో... "ఏమే మనవడు పుట్టిన తరువాత నన్ను మరిచిపోయావే! ధూప దీప నైవేద్యాలతో నా సంబరం చేస్తానన్నావు, ఇంకెప్పుడు చేస్తావు..." అనడంతో, "అమ్మా సెమించేయమ్మ తప్పైపోనాది. ఇంతకీ ఏ తల్లివమ్మా?" అంటూ అచ్చమ్మ రెండు చేతులతో దండం పెడుతూ మొక్కినమ్మ ఎదురుగా నిలబడింది.

"అదేటే అప్పా, మన ఊరమ్మోరే, దండమెట్టుకో" అన్నది సూరమ్మ.

"నన్ను మరిచిపోయావే!" మొక్కినమ్మ కోపం ఎక్కువై పళ్ళు పటపట మని కొరుకుతున్నది.

"ఆ పల్లు కొరకడం చూసారా, అది మన ఊరమ్మోరే. దానికి కోపమెక్కువ. మొన్న నరసప్ప మనవడికి బాగు లేకపోతే మొక్కించింది. నేను చూసాను పల్లు ఇలాగే కొరికింది!" అని సూరమ్మ నిర్ధారించింది.

కాని అక్కడి ప్రజలకు తెలియనిదేమిటంటే అమ్మవారు ఎవరన్నదానితో సంబంధము లేకుండా “పల్లు కొరకడం” అన్నది మొక్కినమ్మ చేసే ప్రక్రియలో భాగం.

“మనవడు కావాలని నీవు కోరుకోగానే పండంటి బిడ్డను ప్రసాదించానే, నన్నే మరిచి పోతావా?” అంది మొక్కినమ్మను ఆవహించిన అమ్మవారు.

“లేదమ్మా కవిటి సింతామనమ్మా! నీకు సంబరం సేస్తానని మొక్కుకున్న మాట నిజం తల్లి. పొటేలు ఏట కూడ ఏస్తానమ్మా. ఎలాగైనా, నా తల తాకట్టు ఎట్టి అయినా గంధమమాసలోపు నీ సంబరం సేస్తానమ్మా!” అచ్చమ్మ వేడుకోలుకు అమ్మవారు శాంతించింది అన్నట్టుగా మొక్కినమ్మ కళ్ళల్లో క్రమేపీ ఎరుపుదనం తగ్గుముఖం పట్టింది. ముఖములో ఆవేశం స్థానములో నిర్మలత్వం కనిపించింది.

కొంతసేపు నిశ్శబ్దం తరువాత మొక్కినమ్మ తన ఆసనము నుండి లేచి నిలబడింది.

వీధి చివరనున్న తాతయ్య బడ్డీ కొట్టునుండి తెచ్చి పెట్టుకున్న లిమ్కా బాటిల్‌ను ఓపెన్ చేసి కొమరమ్మకు అందించింది అచ్చమ్మ. తరువాత చేటలోని బియ్యము, పసుపు కొమ్ములు, రూపాయలు ఒక గుడ్డలో పోసి మూట కట్టి కొమరమ్మ చేతికిచ్చింది.

“అచ్చమ్మా, చింతామణి అమ్మవారికి మల్లీ ముడుపు కట్టుకో. అలాగే పిల్లవాడికి నయమైతే కొండకొస్తానని సింహాద్రి అప్పన్నకు కూడ ముడుపు కట్టుకొని దండమెట్టుకో.” కొమరమ్మ సలహా ఇచ్చింది.

“అలాగేనమ్మా” అంటు తలూపింది అచ్చమ్మ. తరువాత వీధి చివరి వరకు వెళ్ళి కొమరమ్మను సాగనంపింది.

సింహాద్రి అప్పన్నకు కూడ ముడుపు కట్టి, పిల్లవాడికి నయమైతే నడిచి కొండెక్కుతానని అచ్చమ్మ మొక్కుకుంది.

★★★

తరువాత పిల్లవాడి ఆరోగ్యం కొంచెం కుదుటపడ్డట్టు అనిపించినా, రెండు రోజులు తిరిగే సరికి ఒంటి నిండా ఎర్రటి దద్దుర్లు వచ్చాయి.

అది చూసిన పక్కింటి సూరమ్మ “అప్పా పిల్లడికి గాలి జల్లింది, ఇది అమ్మోరు పనే, ఆటలమ్మ. రెండు పూటలా ధూపమేసి, ఏప కొమ్మలతో ఒల్లంతా మంతిరిస్తె పోతుంది.”

ఇంకొకామె “ఇండీసన్లు ఇప్పించాలె, లేకపోతె అవి తగ్గవు”

“ఇది అమ్మోరు పని అని మొక్కినమ్మ సెప్పింది కదే, మల్ల ఇండీషన్లు ఎందుకే” అంది సూరమ్మ.

“ఇండీషన్లు ఇస్తే అమ్మోరుకి కోపమొచ్చి జబ్బు పెద్దదైపోతాదే” మరో అమ్మ.

ఇలా అక్కడ చేరిన వారందరు పలు రకాలుగా సూచనలిస్తున్నారు.

“అమ్మోరుకి, సిమ్మాదిరప్పన్నకి ముడుపు కట్టి దండమెట్టుకున్నాము కదా, ఆ ముడుపులెలాగైనా సెల్లిస్తాము. ఇండీసన్లు కూడ ఇప్పిస్తే మంచిదేమో!” అనే ఆలోచన అచ్చమ్మకొచ్చింది.

అనుకున్న వెంటనే అచ్చమ్మ పక్క వీధిలో ఉన్న కాంపౌండర్ చిరంజీవి దగ్గరికి వెళ్ళి విషయం చెప్పింది.

చిరంజీవి ఆ ఊరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంపౌండరు. అచ్చమ్మ గురించి బాగా ఎరిగినవాడు. ఆమె బాధను చూసి వెంటనే వచ్చాడు.

"అయ్యా, నా మవడికి ఎలాగైనా తగ్గిపోవాల. పెద్ద ఇండీసనివ్వండి" అన్నది అచ్చమ్మ.

"అలాగే ఇస్తానులే. ఒక రోజుకి తగ్గిపోదు. మూడు రోజులు వరుసగా మూడు ఇంజక్షన్లు ఇస్తాను. తగ్గిపోతుందిలే కంగారుపడకు!" అని సముదాయించి వెళ్ళిపోయాడు చిరంజీవి.

కాంపౌండర్ చిరంజీవి ఇచ్చిన ఇంజక్షన్లతో పాటు, మూడు రోజులు మనవడి శరీరములో ఉన్న అమ్మవారికి ధూపమేసి వేప కొమ్మలతో మంత్రించడం కూడ చేసింది అచ్చమ్మ.

అచ్చమ్మ మొక్కుల ఫలమో లేక కాంపౌండర్ చిరంజీవి ఇంజక్షన్ మందు ఫలితమో గాని, మూడు రోజులయ్యేటప్పటికి పిల్లవాడి ఆరోగ్యం కొద్దిగా కుదుటపడింది. మరో వారము గడిచేసరికి పూర్తిగా నయమైపోయింది.

అప్పటికే జంతుబలి నిషేధచట్టం ఆంధ్రప్రదేశ్‌లో వచ్చినా, దాన్ని అమలు చెయ్యడంలో ప్రభుత్వం పూర్తిగా శ్రద్ధ చూపలేదు. ఫలితముగా గ్రామదేవతలకు జంతుబలి ఇంకా కొనసాగుతుంది. అచ్చమ్మలాంటి నిరక్షరాస్యులకైతే అలాంటి చట్టము ఒకటుందని అసలు తెలియదు.

అచ్చమ్మ ఆలస్యం చెయ్యకుండా కవిటి చింతామణి అమ్మవారికి సంబరము చేసింది. గొర్రె పొటేలును వేట వేసింది. కొడుకు కోడలు మనవడితో కలిసి సింహాచలం కొండకు వెళ్ళి ఆ మొక్కు కూడ తీర్చుకుంది.

అచ్చమ్మ మనవడి పేరు చింతామణిరావు. తరువాత బాగా చదువుకుని డాక్టర్ అయ్యారు. అదే ఊరిలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యునిగా నియమితుడై డాక్టర్ చింతామణిగా ప్రసిద్ధికెక్కారు. ఆయన కూడ ఇద్దరు ఆడపిల్లలు పుట్టాక తనకు కొడుకు కావాలని చింతామణి అమ్మవారికి మొక్కుకున్నారు. కొడుకు పుట్టిన తరువాత మొక్కు చెల్లించుకోవడానికి అమ్మవారి సంబరము చేసారు.

"డాక్టర్ గారూ, మీరు కూడ నమ్ముతారా, ఈ విధమైన మొక్కు చెల్లింపులు?" అని ఎవరైనా అడిగితే, "ఏదైనా కోరికతో అమ్మవారిని మొక్కుకున్నాక ఆ కోరిక తీరినప్పుడు మొక్కు చెల్లించాలి గదండీ?" అని అంటారు ఆయన.

# సుకాయించిన!

వారణాసి భానుమూర్తి రావు



✆ 9989073105

***"ఏమన్నా. . మా నాయన అడగమన్నాడు. రేటు పెరిగిందా?" అని పెద్ద భూకామందులా అడిగాను.***
***"సామీ... మీ నాయనకు చెప్పు... ఇంకా ఆరు నెలలు రేటు పెరగదంట! కావాలంటే ఈ రేటుకే డబ్బులు ఇచ్చేస్తాను. సుకాయించుకోమంటావా?" అని అన్నాడు.***
***"సరే... సుకాయించుకో అన్నా... ఈ రేటుతో సుకాయించి మా డబ్బులు మాకు ఇవ్వు!" నేను పెద్ద రైతులాగా ఫోజులు కొడుతూ అన్నాను.***

మాకు రెండు ఎకరాల పొలం మా రాసపల్లెలో ఉండాది. అది ఇప్పుడు గూడ ఉండాది అనుకోండి. మా నాయనకు మా సేను అంటే బాగా ప్యానం! ఆయప్పే దుక్కు దున్ని, గింజలు ఏసి, కలుపు తీసి, వేరుశనగ పంటను పండిస్తాడు. ఒక్కడే సెక్రం తిప్పినట్లు పనిసేస్తాడు. మా యమ్మ మొత్తుకొంటుంది... 'కూలోళ్ళను పెట్టుకోని పని చేయించు కొంటాము అబ్బా!' అని అంటుంది. మా నాయన ఇనినే ఇనడు. "ఎవరిస్తారు కూలోళ్ళకు దుడ్లు?" అని ఎగిరి గంతేస్తాడు.

మా అమ్మను, మా యన్నను, నన్ను తెల్లవార్లూ సేను కాడ పని చేయిస్తాడు.

ఆ ఎండకు వంటి మీద నిప్పులు పెట్టినట్లు వుండినా, సేన్లో పని చెయ్యాల్సిందే! ఇట్లా మూడు నెలలు మమ్మల్ని సంపేత్తాడు మా నాయన.

సెనిక్కాయల పంట గూడా ఊరికేనే పండదు! దుక్కి దున్నాల, చేనుకు ఎరువు తోలల్ల. మా ఇంట్లో ఎనకాల దిబ్బ వుండేది. ఆకులు, అలములు, ఎనుములు, ఆవుల వదిలిన పేడ, మేకల పెంట... అన్నీ ఆ దిబ్బలోనే ఏసే వాళ్ళము. మా ఇంటి సెత్త, సెదారం అందులోనే పోసే వాళ్ళం. వానాకాలంలో దిబ్బ బాగా తడిసి, వాన పాములు బాగా తిరిగేవి దిబ్బ లోపల. వాన పాముల వల్లనే మా దిబ్బ బాగా కుళ్ళి మంచి ఎరువు తయారయ్యేది.

మా ఎద్దలబండిలో డొల్ల ఏసుకొని, మేమంతా దిబ్బని పారలతో చెక్కి ఇనప గోళాలు నెత్తిన పెట్టుకొని బండికి ఏసే వాళ్ళము. మా నాయన ఆ ఎద్దలబండిని చేన్లోకి తోలి, ఎరువునంతా సేన్లో నింపేవాడు.

మా ఊర్లో అరవోళ్ళకు మేకలు, గొర్రెలు శ్యానా వుండేవి. మా నాయన వాళ్ళను అడుక్కొని, మా సేన్లో ఒక రాతిరి నిద్ర పొయ్యేట్లు మాట్లాడుకొంటాడు. అదెట్లా అంటే పంట సేతికొచ్చినాక, వాళ్ళకు నాలుగు సెనిక్కాయల మూటలు యీవల్ల అనే ఒప్పందం కుదిరించు కొంటాడు మా నాయన! సరే... ఇంక గింజలు ఏస్తామనంగా మా చేన్లో మేకల మందలు ఆ రాత్రి అంతా పడుకొనేయి. ఆ రాత్రి ఏసిన మేకల పెంట మా సేనుకు మంచి ఎరువుగా వుండేది. జూన్ నెలలో ముంగేటి వానలు పడతానే, సేను పనులు సేసే దానికి రెడీ గావల్ల అందరూ! ఎరువు అంతా మళ్ళా చేనంతా పారలతో తవ్వి పొయ్యాల.

ఆ సంవచ్చరం వాన బాగా కురిసింది. సెనిక్కాయల పంటకు అంత ఎక్కువ వానా, అంత తక్కువ వానా రాగూడదు. బుడ్డలు దిగేటప్పుడు కొంచెం వాన పడల్ల. చేన్లు అప్పుడు తడి తడిగా పచ్చని ఆకులుతో, పసుపు పచ్చని పూలతో గాలికి వూగుతావుంటాయి. అప్పుడు మా సేను సూడల్ల... నా సామి రంగ... ఎంత బాగుంటుందో!

ఆ సంవచ్చరం మొక్కలు బాగా పెరిగినాయి. పంట బాగా వచ్చింది. బుడ్డలు బాగా దిగినాయి. అన్నీ నాలుగు, మూడు గింజలుండే సెనిక్కాయ బుడ్డలే! మా నాయన ముకంలో ఒకటే నవ్వు. ఈ సారయినా మా అక్క పెళ్ళికి చేసిన అప్పు తీరుస్తాము అనే ధయిర్నం మా నాయనకు వచ్చింది. నవంబర్ నెలలో సెనిగి చెట్లు బాగా బూమిలో దిగుంటాయి. భూమి లోపల సెనిక్కాయలు చెట్ల వేర్లకు కాస్తాయి. కాయలు బయటకు కనబడవు. మళ్ళీ ఒకసారి మడకబెట్టి, సాలు మధ్యలో దున్నుకొంటూ పోతే చెనిగిచెట్లు కాయలతో సహా పైకి వస్తాయి. ఆ చెట్లను పీకి చెనిక్కాయల వాములు వేసుకొంటారు రైతులు ఆ చేన్లల్లోనే!

మా నాయన గూడా మా చేన్లో ఒక గుడిసె లాంటిది వేసి, అక్కడే పది, పదునైదు రోజులు పడుకొంటాడు. లేదంటే దొంగలు వాముల్లోని పంటను దొంగలిస్తారని భయం.

ఒక రోజు అర్ధరాత్రి! భయంకరమైన అనుభవం అయింది మాకు.



ఒక్క రోజు మా నాయనకు జ్వరం వచ్చి, సేను గాడ పడుకోవడానికి చాతగాలేదు. మా నాయన నన్నూ, మా యన్ననూ ఆ రోజు రాత్రి పడుకోమన్నాడు.

నన్ను మాయన్న తోడుగా రమ్మన్నాడు. నాకు అలవాటు లేదు. భయం భయంగా రాత్రి ఏడు గంటలకు అన్నాలు తినేసి టార్చిలైట్, మఫ్లర్ వేసుకొని బయలుదేరినాము. అలవాటు లేని ప్యానం. గుడిసెలో పడుకోవడం ఒక కొత్త అనుభూతి.

ఎక్కడో గట్టిగా అరుపులు... కుక్కల మొరుగులు... దూరంగా ఏట్లో నక్కలు అరుస్తా ఉండాయి.

చెనిక్కాయల పంట చేతి కొచ్చేటప్పుడు శ్యానా మంది సేన్లల్లో గుడిసెలు ఏసుకొని కాపలా కాస్తా ఉంటారు. మనుషులు కొందరు గట్టిగా మాట్లాడతా ఉండే మాటలు వినిపిస్తా ఉండాయి. ఎక్కడో పల్లెలోంచి ఏడ్పులు... కీచులాటలు.

రాత్రి అయ్యిందంటే పల్లెల్లో గొడవలు... భార్యాభర్తలు తాగేసి కొట్టుకొంటూ వుంటారు. ఇవన్నీ మామూలే!

నాకు ఆ శబ్దాలు విని చాలా భయం వేసింది. గుడిసె లోపలికి వెళ్ళి దూరి పడుకొన్నాను. క్రింద ఏవో చాపలు, బొంతలు పరచినారు. ఈతాకులతో కప్పిన గుడిసె చుట్టూ, గోనె సంచులు కప్పినాడు మా నాయన పురుగూ పుట్ర రాకుండా!

అర్ధరాత్రి వరకూ నిద్ర రాలేదు. ఆకాశంలో మేఘాలు నల్లగా, నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ కనబడుతున్నాయి.

మా వేరుశనగ వాము తట్టు చూసినాను... గుడిసె బయటకు తల పెట్టి, తేరిపారా చూసినాను.

అంతే... ఎవ్వరో ఒక మనిషి గోనె సంచి నెత్తిన కప్పుకొని దొంగలాగా మా వాము దగ్గరకు వచ్చి నట్లున్నాడు.

ఒక్క ఉదుటున లోపలికి దూరి... "అన్నా దొంగ... దొంగ!" అని గట్టిగా అరచి గజగజమని వణికి పొయ్యాను. మాయన్న తక్కున లేచి టార్చి లైట్ వేసి 'ఎవరక్కడ?' అని గట్టిగా అరచినాడు. మా యన్న నా కంటే పదేళ్ళు పెద్ద. అందుకే భయపడడు.

చేను చుట్టూ కట్టె పట్టుకొని టార్చి లైట్ వేసుకొని తిరిగినాము... కొంచెం సేపు! ఎవ్వరూ కనబడలేదు.

"అంతా నీ బెమరా సామీ! ఎవ్వరూ లేరు. పోయి పడుకో!" అని అన్నాడు మా అన్న.

దుప్పటి కప్పుకొని ముడుచుకొని పడుకొన్నాను నేను ఆ రాత్రంతా.

తరువాత గుడిసెలో పడుకొనే అవకాశం నాకు ఎప్పుడూ రాలేదు.

మా చేన్లో పడుకోవడం ఒక విచిత్రమైన అనుభూతి నాకు.

★★★

జనవరిలో వచ్చే సంక్రాంతి పండగరోజు లోపల కొందరు రైతులు వారి పంట ఫలాన్ని అమ్మేస్తారు. మహల్ కోమిటోళ్ళు వచ్చి ఇంటింటికీ పెద్ద త్రాసు పెట్టి, చెనిక్కాయల మూటల్ని తూకం వేసి ఎద్దల బండ్ల మీద వేసి బలంగా త్రాళ్ళతో కట్టుకొని తీసుకొని వెడతారు.

మా పంట అంతా మూటలు నింపి తూకం వేసి ఎత్తుకొని పొయినారు. మహల్ సాయబులు కిరాయికి ఎద్దల బండ్లు కడతారు. ఒక్కో బండికి ఇరవై, ముప్పయి మూటలు ఏసుకొని పెద్ద పెద్ద నార తాళ్ళతో గట్టిగా కట్టి మహలుకు తీసుకొనిపోతారు.

సంవత్సరమంతా అప్పు చేసిన రైతుకు, వడ్డీ మీద వడ్డీ వేసి ఆ మొత్తాన్ని ఈ పంటకు వచ్చే రాబడిలో తగ్గించి, ఖర్చులకు జమ వ్రాసుకొని మిగిలిన డబ్బు చేతికిస్తారు మహల్ కోమిటోళ్ళు. అందులో వాళ్ళు చాలా మోసాలు చేస్తారు అని తెలిసినది. తూకంలో మోసం, ఖర్చు పద్దులు ఎక్కువ వ్రాయడం, దాని మీద వడ్డీలు లెక్క గట్టడం... ఈ మోసాలకు అమాయక రైతులు బలి అయి పొయ్యేవాళ్ళు.

మాకు ఈ సారి పంట బాగా వచ్చింది. రెండు ఎకరాలకు నలభై మూటలు వచ్చినాయి.

మా నలభై మూటల చెనిక్కాయల పంటకు పదహారు వేలు వస్తుందన్నాడు రెడ్డప్పశెట్టి. మేము వీళ్ళ అంగట్లోనే అన్ని సామాన్లు కొంటాము. వాళ్ళకు జవిలంగడి గూడా వుండడం వల్ల కొత్త గుడ్డలు పండగలకి అక్కడే కొంటాము. అంతా లెక్క రాసుకొని, మా కొచ్చే పంటను కొనుక్కొని లెక్కలు రాసుకొంటాడు శెట్టి గారు.

"ఇప్పుడే సుకాయిస్తే మూటకు, అంటే నూరు కేజీలు, నాలుగు వందలరూపాయలు... సంక్రాంతి తరువాత సుకాయిస్తే రేటు పెరుగుతూంది... నాలుగు వందల ఏభై కావచ్చు" అన్నాడు శెట్టి.

'సరేనని' మా నాయన సంక్రాంతి వరకు ఆగుదామని సెప్పినాడు. దుడ్లు ఆ శెట్టి ఆ రోజు మాకు ఇవ్వలేదు. మా పంటను అంతా తూకాలు ఏసుకొని, సంచుల్లో పోసి, దబ్బనంలోకి పురితాడు ఎక్కించి మూటలన్నీ కుట్టేసుకొని ఎద్దుల బండికి ఎక్కించినాడు శెట్టి.

కొన్ని రోజుల తర్వాత... నేను అప్పుడు తొమ్మిదవ తరగతి మహల్లో చదువుతున్నాను. మా ఇంటిలో హైస్కూల్లో చదివేది నేనొక్కడ్నే! మా అన్నా... మా అక్కా ఐదవ తరగతితోనే మానేసి, మా నాయనకు సేద్యానికి సహాయం చేసేవాళ్ళు. అట్లాగే కూలికి గూడా పొయ్యే వాళ్ళు.

ఒకరోజు మా నాయన మూట ధర ఎంత పలకతా వుందో కనుక్కోని రమ్మన్నాడు నన్ను! నేను స్కూలు నుండి మా పల్లెకు పొయ్యే ముందు శెట్టిగారి అంగట్లో దూరినాను.

"ఏమన్నా... మా నాయన అడగమన్నాడు. రేటు పెరిగిందా?" అని పెద్ద భూకామందులా అడిగాను.

"సామీ... మీ నాయనకు చెప్పు... ఇంకా ఆరు నెలలు రేటు పెరగదంట! కావాలంటే ఈ రేటుకే డబ్బులు ఇచ్చేస్తాను. సుకాయించుకోమంటావా?" అని అన్నాడు.

"సరే... సుకాయించుకో అన్నా... ఈ రేటుతో సుకాయించి మా డబ్బులు మాకు ఇవ్వు!" నేను పెద్ద రైతు లాగా ఫోజులు కొడుతూ అన్నాను.

లెక్కల బుక్కు తీసి అందులో మా నాయన పేరున్న పేజీని తిప్పాడు. చేంతాడంత లెక్కలు అందులో వ్రాసినాడు రెడ్డప్పశెట్టి.

ఖర్చు... జమ... వడ్డీ అని నాకు అక్కడక్కడా కనబడింది.

అంతా లెక్క చూసి నా చేతిలో నాలుగు వేలు పెట్టాడు. ఆ కాలంలో నాలుగు వేలు గూడా పెద్ద మొత్తం గదా!

ఇంటికి వెళ్ళి గర్వంగా ఫీల్ అయి ఆ నాలుగు వేలు మా నాయన చేతిలో పెట్టాను.

మా నాయన లబోదిబోమన్నాడు.

"ఖర్చులు, వడ్డీ పోనూ, ఎనిమిది వేలు రావలసినది... నాలుగు వేలు ఎందుకిచ్చార్రా నీకు? నిన్ను ఎవ్వరు ఈ రేటుకు సుకాయించుకోమన్నారు?" అని బాగా తిట్టినాడు మా నాయన.


మరుసటిరోజు పరుగు పరుగున మహల్‌కు పోయి రెడ్డప్పశెట్టిని, కలిసి వాదులాడుకొన్నారంట, కొట్టుకొన్నారంట!

సంక్రాంతి పండక్కి ధర బాగా పెరిగిందంట. నేను ముందుగానే సుకాయించడం వల్ల ఆ శెట్టి పెరిగిన ధరకు మాకు వచ్చే మొత్తాన్ని జమ చేసుకోలేదు. శెట్టికి రెండు మూడు వేలు లాభం వచ్చింది.

ఇదీ నేను చేసిన ఘన కార్యం. ఇది తలచుకొంటే నాకు చాలా బాధ కలుగుతుంది. నేను చేసిన ఈ తప్పు పనికి నేను అనుకొన్నప్పుడల్లా ఏడుపు వస్తుంది.

# ఛీ

మెడికో శ్యామ్



✆ +1(803)2375741

***ఆ రాత్రి గడిచింది.***
***గడిచింది ఆ రాత్రి.***
***భాస్కరరావు చురుకైనవాడు. చదువుకున్నవాడు.***
***అతడు వైనమెరిగినవాడు.***
***తెలివైనవాడు.***
***ఇప్పుడు వాళ్ల కాపురంలో రెండు మొగ్గలూ, ఓ కాయా పూచి విరిసేయి. కాచి ఆగేయి.***

సుజాత అసుందరాంగి కాదు!

కట్టుకున్న ఎర్ర పట్టుచీర, కుట్టుకున్న పూలజడ, కప్పుకున్న పైటా, మెళ్ళో సూత్రాలు, వెనక మంగళాలాపనలు... ఆమెకి లేని అందాల్ని కలగచేస్తున్నాయి!

ఆమె ముఖం మీద వింతకాంతులు వెలుగుతున్నాయి. ముఖం మీద చిరుచెమటలూ, ముంగురులూ మెరుస్తున్నాయి. వెనక ఆడమళయాళపు రెకరెన్స్ జోక్స్, ఆ వాతావరణానికి వన్నె తెస్తున్నాయి.

ఆమె ముఖం ముడుచుకుని వుంది.

"ఏం పిల్లా ముడిచావ్ ముఖం?" అందో ప్రౌఢ పదేళ్ల వెనక తన అనుభవాల్ని తలుచుకుంటూ బహుశా!

"అది ముకుళించిన కమలం. వికసించును ఈ దినం, సోకిన భాస్కర కిరణం" అందో కుర్ర కవయిత్రి.

"మీ ఆయన పేరేంటి పిల్లా?" అంది మరో ముసలి మగువ.

"అబ్బా! అర్థం కాలేదూ? మన రాధ చెప్పడం లేదూ భాస్కరమనీ..." కసిరిందో డిస్టర్బ్డ్ తలపుల తెఅవ.

గదిలోకి పంపి తలుపులు వేశారు.

భాస్కరం సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తున్నాడు.

పొగ పీలుస్తున్నా, ఆలోచనలు తెగటం లేదు.

ఎన్ని సినిమాలు చూశాడు. కథలు చదివాడు... విన్నాడు.

అయినా స్వానుభవం స్వానుభవమే!

మరో సిగరెట్ వెల్గించాడు.

వాచీ చూసాడు.

బయట గొడవ గొడవగా వుంది.

మోటు మొరటు హాస్యంతో అమ్మలక్కలు చేస్తున్న గోల చిరాకు కలిగిస్తోంది.

భాస్కరం ఉంగరాల జుట్టు చుట్టూ అతడు వదలిన పొగ విచిత్రంగా రింగులు తిరుగుతోంది.


అతని నున్నని సన్నని మీసం మీద చిరునవ్వు కనీకనిపించినట్టు ఆనందాన్ని చినికిస్తోంది.

ఆ జుబ్బా, పంచీ అదో అందాన్ని వెదజల్లుతున్నాయి.

ఏ మాటకామాట చెప్పుకున్నట్టే, ఏ అచ్చటా ఏ ముచ్చటాక్కూడా!

విసుగ్గా సిగరెట్ పీక పారేయడం, సుజాత గదిలో అడుగు పెట్టడం, తలుపులు వెయ్యడం ఒక్కసారే జరిగినాయి.

తలెత్తి చూసాడు.



అతనికా క్షణం,

ఈ రాతిరి ఈ గదిలో అవతరించిన అప్సరాంగన కాదుకదా!

నాకోసం ఏతెంచిన సున్నితాంగి... ఎవరీ ఈ సున్నితాంగి?

నేనెవరు? తానెవరు?

ఈ చుట్టుపక్కలెవరు? చుట్టపక్కాలెవరు? ఎవరు వీరెవరు?

ఒక్కక్షణం కళ్ళు బైర్లు కమ్మినా, తమాయించుకు... రండి అనాలా? రా అనాలా? సుజాతా అనాలా? సుజీ అనాలా?

యోచించి, “రా సుజీ!” అన్నాడు మృదువుగా... వీలైనంత మృదుమధుర భావాల్ని గొంతులో నింపి!

ఆమె ముఖంలో ఏ భావమూ లేదు.

ప్రశాంతంగా ఉంది.

ఆమె ఎంత గరళాన్నైనా మింగి సహించగల స్త్రీ జాతి ప్రతినిధిలా ఉంది.

"రా కూర్చో" అన్నాడు.

కూర్చుంది.

"ఇటు తిరుగు..." తిరిగింది.

"నేనంటే నీకిష్టమేనా?"

మౌనం!

"అయిష్టమా?"

కాదని తలాడించింది.

సిగ్గు కాబోలనుకున్నాడు... తాను సిగ్గుపడుతూ భాస్కరరావు.

భుజం మీద చెయ్యేసి, గెడ్డాన్ని పైకెత్తి దగ్గరగా తీసుకుబోయాడు.

ఒక క్షణం ఆగి...

ఒక్క తోపు తోసి 'ఛీ' అని మూల్గి, "అలాంటిదాన్ని కాను!" అంది దూరంగా జరిగి.

భాస్కరరావు నోట మాట రాలేదు.

అవాక్కైపోయాడు!

ఛీ... ఛీ... అనుకుని.

మరి ఆ రాత్రెలా జరిగిందని, గడిచిందని అడక్కండి.

ఇది జరిగి పదేళ్లైనా, ఆమె పుట్టింట్లోనే ఉంది.

"నా కోయి వుమంగ్ హై... మేరా జిందగీ హై క్యా ఏక్ కటీ పతంగ్ హై" అని గీతాలాలాపిస్తూ... కన్నె సొగసులు వెన్నెలల పాల్జేసి బహుశా!

లేదు... లేదు...

ఆ రాత్రి గడిచింది.

గడిచింది ఆ రాత్రి.

భాస్కరరావు చురుకైనవాడు. చదువుకున్నవాడు.

అతడు వైనమెరిగినవాడు.

తెలివైనవాడు.

ఇప్పుడు వాళ్ల కాపురంలో రెండు మొగ్గలూ, ఓ కాయా పూచి విరిసేయి. కాచి ఆగేయి.

★★★

పాఠకుడు రివాల్వర్ తీసి ఆరుసార్లు కాల్చాడు.

అదృష్టవశాత్తూ రచయిత అక్కడలేడు.

ఒకాయన తన ఫోటో పంపాడు. 'తన బట్టతలకి కారణం మీ కథే' అంటూ, ఇంత రణానికీ, దారుణానికీ కారణం సంపాదక మహాశయుడు.

మర్చిపోయిన ఈ N.B. (nota bene)

కొందరు సుకుమారులైన సుజాతలని కదిలించే భాస్కరాలు లేకపోతే 'కటీ పతంగ్'. వుంటే 'కయీ వుమంగ్" సులభంగా చెప్పాలంటే " FRIGIDITY" అర్థం చూడండి మరి!

FRIGID హిమాంగినులని కదిలించి, కరగించవలసింది నువ్వూ భాస్కరరావూ!

★★★

*ఈ కథ 1976 ప్రాంతంలో రాసింది... ఆ సమయంలో మిత్రుడు దాట్ల నారాయణమూర్తిరాజు.. "ఒకేవొక్క అక్షరంతో కథ పేరు ఉండాలి. అలా రాయగలరా?" అని అడిగితే ఈ కథ రాసేను. అతను హడావిడిగా పైలోకాలకి వెళ్ళిపోయాడు గాని, కథ నా దగ్గరే ఉండిపోయింది... ఇన్నాళ్ళూ! అందుకే... అతని జ్ఞాపకానికి!*

# శాస్త్రాంగనలు

ఎలక్ట్రాన్



✆ 9949594396

**విశిష్ట అతిథి కథ**

***"దృష్టి లేకపోవడం మూలాన నేను పోగొట్టుకొన్నదేదో నాకు తెలిసింది. యిప్పుడు నాకు నేనెలా ఉంటానో తెలియడమే కాకుండా, ముగ్గురి రూపాలు నా మనసులో ముద్రితమైపోయాయి. అవి కనిపెంచిన నా తల్లిదండ్రులవీ, ఆ అదృష్టం కలిగించిన యిలాంటి మంచి స్నేహితురాలిదీను!"***

నాకు రంగులేదు, రూపంలేదు, అలాగని అంగసౌష్టవం ఉందా అంటే అదీ లేదు. నన్ను నేనే అద్దంలో చూసుకోడానికి యిష్టపడనప్పుడు, నన్ను చూడ్డానికెవరు యిష్టపడ్తారు? మా అమ్మానాన్నల గుండెలమీద నేను నిప్పుల కుంపటిలా కాకుండా అంతకంటే ఘోరమైన కట్టెల పొయ్యిలా తయారయ్యాను. దండిగా కట్నమిచ్చి వదిలించుకోవాలంటే వాళ్ల దగ్గర డబ్బు కూడా లేదు. మా నాన్న చూడ్డానికి బాగానే ఉంటాడు. మా నాన్న అమ్మానాన్నలు కట్నానికి ఆశపడి మా అమ్మని తమ గడపలోకి తెచ్చుకొన్నారు. మా నాన్న మంచివాడు కావడం మూలాన మా అమ్మతో కుదురుగానే కాపురం చేశాడు. ఎవరి కడుపున, ఎప్పుడు పడ్తామో, ఎలా పుడ్తామో మన చేతుల్లో లేదు కదా? గ్రెగరీ మెండేల్ సంభావ్యతా సిద్ధాంతాన్ని గురించి జీవశాస్త్రంలో చదివాను కాబట్టి ఏదో కాస్త మిడిమిడి జ్ఞానం తప్ప, సంతానం యొక్క రూపురేఖల్ని నిర్ధారించడంలో తండ్రి బీజం ముఖ్యమో, లేక క్షేత్రంలోని తల్లి అండం ముఖ్యమో నాకంత యిదిగా తెలిసేది కాదు!

అయితే నాకీ రూపు వచ్చినందుకు ఎవర్ని నిందించాలో నాకు తెలియదు. డబ్బుకాశపడిన పితామహ, పితామహిల్నా? లేక డబ్బిచ్చి కట్టబెట్టిన మాతామహ, మాతామహిల్నా? అయ్యో, మనకి పుట్టబోయే సంతానం తాలూకు రూపురేఖలు ఎలా దిద్దుకుంటాయి, వాళ్లకీ వయసొస్తుంది, కోరికలు చెలరేగుతాయి, వివాహాలు ఎలా జరుగుతాయి అన్న యింగితజ్ఞానం అమ్మా నాన్నలకి పిసరంతైనా ఉండొద్దూ? నాకు ఈ ప్రపంచంలో అస్తిత్వాన్ని కలిగించినందుకు వారిని గౌరవించినా, యిలాంటి అవతారంతో పుట్టినందుకు అపుపడప్పుడూ ఒళ్లు మండుతూ ఉండేది!

ఆలోచన అంటే ఏమిటో తెలిసిన తర్వాత. చిన్నప్పట్నుంచీ యిలాంటి న్యూనతాభావంతోనే పెరిగాను. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో, కళాశాలలో నావైపు ఎవరూ చూసేవారు కాదు. మగపిల్లలు నా దరికి రాకపోయినా, దూరంనుంచే నోటికొచ్చిన ఏవో కొంటెనామాలు, బిరుదులు గాలిలోకి వదిలేవారు. కళాశాలలో, ఆఖరికి నా సహవిద్యార్థినులు కూడా రెండు జాగాలు దూరంగా జరిగి కూర్చునేవారు! ఉపన్యాసకులు 'అర్థమయిందా?' అని అందమైన అమ్మాయిల్ని అడిగేవారు కాని, నేనే ప్రశ్న అడిగినా మార్గదర్శి పుస్తకాలు చూసి చదవమనేవారు. ఎలాఉంటుంది చెప్పండి? నేను తెలివితక్కువదాన్ని కాకపోయినా ఈ న్యూనతాభావం వెంటాడడం మూలాన అనుకొన్న రీతిలో మార్కులు వచ్చేవికావు. నాన్న కనుబొమలెగరేసి ప్రశ్నార్థకంగా చూసేసరికి కారణమిదీ అని చెప్పే ధైర్యం లేకపోయేది.

ఓరోజు మధ్యాహ్న విరామసమయంలో కాలేజీ ఆవరణలో, ఓమూలగా ఉన్న మర్రిచెట్టు నీడలో కూర్చుని టిఫిన్ డబ్బా తీసి

తినబోతే ఏదో ఆలోచన వచ్చి ఏడుపొచ్చింది... అందరు ఆడపిల్లలూ కబుర్లాడుకొంటూ ఆడపిల్లల గదిలోనో, కళాశాల నడవల్లోనో, వసారా మెట్ల మీదనో కూర్చుని అబ్బాయిలతో బాతాఖానీలు కొడ్తూ టిఫిన్లు చేస్తూంటే నేనిలా ఒంటరిగా కూర్చుని అఘోరించాల్సి వస్తోందని! సరిగా ఆ సమయానికి ఆ దారమ్మట పోతున్న మా తెలుగు ఉపన్యాసకులు శ్రీపతిశర్మగారు ఆగి, "ఏమైందమ్మా?" అని పలకరించారు.

అదో సువర్ణావకాశంగా ఎందుకు తీసుకొన్నానో నాకు తెలియదు కాని, "ఒక్కమాటలో చెప్పాలంటే సాధ్యం కాదు సార్! మీరో పదినిముషాలు ఓపిక పడ్తే నా గోడు వినిపించుకొంటాను!" అన్నాను.

బయటకు వచ్చి వంపు తిరిగిన ఓ వేరు మీద కూర్చుని, "పదినిముషాలు కాదు, నువ్వు చెప్పినంతసేపూ వింటాను. నాకీ మధ్యాహ్నం క్లాసులేమీ లేవు. అయితే నీ క్లాసు సంగతి ధ్యాసలో ఉంచుకో!" అన్నారు ఆప్యాయంగా.

నాకు కొండంత బలం వచ్చినట్లనిపించింది. నిస్సంకోచంగా నా మనసులోని బాధని వెళ్ళగ్రక్కుకొన్నాను. నా ఆకృతి కన్నా, నన్ను వెంటాడే న్యూనతాభావాన్ని చెప్పుకొని ఏడ్చాను. అంతా విని, "నీకు దూరంగా కూర్చునే అమ్మాయిలను గమనించాను. కాని యింతదూరం ఆలోచించలేకపోయాను. బాహ్యసౌందర్యానికే ప్రాముఖ్యతనిచ్చే సమాజం, అంతఃసౌందర్యాన్ని సులువుగా గుర్తించదు. భాగవతంలోని త్రివక్ర అనబడే కుబ్జ కథ వినే ఉంటావు. కొండంత ఆత్మ విశ్వాసంతో కంసుని రాణివాసపు కొలువులో పని చేసింది. సుగంధభరితమైన లేపనాలు తయారు చేయడంలో నైపుణ్యం సాధించింది. చివరికి శ్రీకృష్ణపరమాత్మకి ఆత్మసౌందర్యం కారణంగా సన్నిహితురాలైంది. నీకు నువ్వుగా ఓ గుర్తింపు సాధించుకోవాలి. దానికి శరీరాకృతే సాధనం కాకూడదు. మనిషికి గుర్తింపు తెచ్చేది ప్రజ్ఞ. యితర ఆలోచనలు మాని శ్రద్ధగా చదువు!" అని కాస్త ఊరట కల్గించి కదిలారు.

ఆ మధ్యాహ్నం జీవశాస్త్రం పాఠం జరుగుతోంది. ఉపన్యాసకులు రాజుగారు ఆ రోజు మెండేల్ సిద్ధాంతాన్ని గురించి చెప్పడాన్ని ఓ అవకాశంగా భావించి కావాలనే చాలా ప్రశ్నలు సంధించాను. "సమయం చాలదు, గైడ్ చదువు" అని సలహా యివ్వబోతే, "అదనంగా గైడ్ పుస్తకం కొనే తాహతు నాకు లేదు. ఎవర్నైనా అడిగినా యిస్తారన్న నమ్మకం నాకు లేదు" అంటూ నా పక్కన ఉన్న ఖాళీ జాగాని, యిరుక్కుని కూర్చున్న అమ్మాయిల్నీ చూపించాను.

ఆయన ఏమనుకొన్నారో, ఏమో గాని... "మీరందరూ అలా యిరుక్కొని కూర్చునే బదులు కాస్త జరిగి సుఖంగా కూర్చోండి.' అన్నాడు.

వారు కాస్త అయిష్టంగానే దగ్గరగా జరిగి కూర్చున్నారు. ఆయనకీ జ్ఞానోదయమైందనుకొంటాను, కప్పదాట్లు లేకుండా మెండేల్ సిద్ధాంతాన్ని ఆయనకి సాధ్యమైనంత పరిధిలో వివరంగానే చెప్పారు. నాకు తెలియాలని కాదుకాని నా సహ విద్యార్థులకి తెలియాలనే ఆ ప్రశ్నల్ని సంధించాను.

ఆ సాయంత్రం శ్రీపతిశర్మగారు వదిలిన ఆత్మసౌందర్యం అనే పదం గురించి ఆలోచించసాగాను. ఆ పదానికి భాష్యం చెప్పడం, ఉదాహరణలు చూపడం అంత సులువుకాదు. అస్పష్టమైన భావనలతో సరిపెట్టుకోవాలే కాని ఇదమిత్థంగా ఇదీ అని చెప్పడానికి వీలుకాదు. జీవితంలో అందమైన భాగస్వాములు నా పినతండ్రి, చిన్నమ్మలు. పినతండ్రి స్వభావం మంచిదికాదు. తను పనిచేసే సంస్థలో మరో యువతితో సంబంధ బాంధవ్యాలు పెంచుకొన్నాడు. సంస్కారం లేని మనిషి. చిన్నమ్మ మంచిది. మౌనంగా భరించిందే కాని రచ్చకెక్కలేదు. అది ఆత్మసౌందర్యానికి తార్కాణమా, లేక పిరికితనానికి నిదర్శనమా? మండల కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి లంచం తీసుకొంటూ అవినీతి నిరోధకశాఖ ఉచ్చులో పడ్డాడు. దినపత్రికలలో పడ్డ ఫోటో

ప్రకారం అతగాడు చాలా అందగాడు. బాహ్యసౌందర్యానికీ, అంతరాత్మ నడిపించే జీవన విధానానికీ పొంతన లేదనేగా? కామవరపుకోట హత్యకేసులో హంతకురాలు చాలా అందగత్తె. ప్రియుడి పొందు కోసం భర్తని హత్య చేయించింది. యిది ఆత్మనైతికతనేది లేకనా, కాక కామాగ్నులు చేయించిన సాహసమా? ఫలానా వ్యక్తి కరుకుగా మాట్లాడినా మనసు చాలా మంచిదనే కితాబుల సంఖ్యకీ కొదవలేదు. దీనికి విరుద్ధంగా 'మనిషి మంచివాడైనా గుణంమట్టుకు (వక్రమే)' అన్న నానుడి కూడా తెలిసినదే. ఏతావాతా ఈ ఆత్మసౌందర్యం అనే పదం వేదాంత ధోరణిలో చెప్పే స్వాంతవచనాలలో ఉపయుక్తమైన నీతీ, న్యాయమూ, సత్యమూ, అహింసా, ఓరిమీ, జాలీ, దానగుణాలలాంటి పదాలలో ఓ పదం తప్ప మరోటికాదు. వీటిని గురించి ప్రస్తావిస్తూనే ఆత్మసౌందర్యం అనే పదానికి నిర్వచనం చెప్పడం జరుగుతుంది. అయితే వివాహానికి సంబంధించి... కుటుంబం మంచిది, సాంప్రదాయం మంచిది, అంతఃకరణలు మంచివి అంటూ, చూస్తూ చూస్తూ స్త్రీపురుషులు బాహ్య సౌందర్యం లేని భాగస్వాముల ఎంపికలో వెనకడుగే వేస్తారన్నదీ సత్యదూరం కాదు.

అసలింతకీ నేనెందుకు బాధపడ్తున్నట్టు? గుర్తింపు లేదనా? పెళ్లి కాదనా?

గుజరాత్‌లో ఎంతో అందమైన కన్యలు పొంగులు వారే వయసులో, ఈ కాలంలో కూడా జైన్ సన్యాసినులుగా మారుతున్నారు. జీవితానికి వివాహమే పరమావధి కాకూడదు. దానికంటే నాకనే ఓ గుర్తింపు ముఖ్యం. శ్రీపతిశర్మగారు చెప్పినమాట నిజమే.

మర్నాడుదయం పక్కన కూర్చునే లత "సారీ,... యింతకాలమూ నీ పట్ల స్నేహభావం ప్రకటించలేనందుకు సిగ్గు పడ్తున్నాను. నీ మనస్సును చాలా కష్టపెట్టి ఉంటాం, క్షమించు!' అంది.

రెండో గంటలో తెలుగుపాఠం జరుగుతోన్నప్పుడు శ్రీపతిశర్మగారు మొదటి బెంచీమీద జరిగిన మార్పు గ్రహించి చిన్నగా నవ్వారు. ఆ మధ్యాహ్నం ఆయనతో క్రితంరోజు జీవశాస్త్రం క్లాసులో నేను అడిగిన ప్రశ్నల గురించీ, ఆ తర్వాత నాలో చెలరేగిన ఆలోచనల గురించీ చెప్పాను. ఆయన నవ్వుతూ, "చూశావా మరి? ముందస్తుగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకో. మార్గం దానంతట అదే సులభతరమౌతుంది. పట్టు విడవక ప్రయత్నించు. ఈ సాయంత్రం కాలేజీ అయిన తర్వాత యింటికి ఓసారి రా. కాలేజీ కాలనీలో పదో నెంబరు యిల్లు." అని నా తిరుగు సమాధానం కోసం ఎదురుచూడకుండా కదిలారు.

మాష్టారు ఎందుకు పిల్చారా అనుకొంటూ కాస్త సందేహంతోనే ఆయనింటికి వెళ్లాను. ఆయన భార్య పలకరించి, కూర్చోమని చెప్పి మంచినీళ్లు తెచ్చి యిచ్చింది. శర్మగారు లోపల్నించి ఓ అమ్మాయిని చెయ్యి పట్టుకొని నడిపించుకు వచ్చి, నాకెదురు కుర్చీలో కూర్చోబెట్టారు. తనూ కూర్చుంటూ, "ఈ పాటికి నీకు పరిస్థితి అర్థమయ్యే ఉంటుంది. స్వాతి నీ ఈడుదే. జన్మతః అంధురాలు. స్పర్శ, వినికిడి, వాక్కులతో కాలం నెట్టుకొంటూ వస్తోంది. బ్రెయిల్ లిపితో సాధన చేస్తోంది. అసలు దృశ్యంపట్ల అవగాహన లేని కారణంగా ఆ విషయమై ప్రస్తావించదు. 'ఈ గుడ్డిపిల్లతో ఆటలేమిటి?' అన్న తోటిపిల్లల మాటలు విన్నప్పుడు 'గుడ్డిపిల్ల అంటే ఏమిటి?' అని ప్రశ్నించింది. కంటి చూపుని గురించి చెప్పడం నాకు సాధ్యం కాకపోయింది. అయితే అమ్మాయికి ఆత్మవిశ్వాసం చాలా ఎక్కువ. అల్లికపనులు చక్కగా చేస్తుంది. తను అల్లినదాని అందం ఆమెకు తెలియదు. అయితే మనసు విప్పి మాట్లాడడానికి మట్టుకు స్నేహితులు కరువయ్యారు. ఆ లోపం తీర్చాలని నీకనిపిస్తే వీలైనప్పుడల్లా వచ్చి మా అమ్మాయితో కాస్త మాట్లాడుతో ఉండు. కావాలంటే నీ తల్లిదండ్రులతో చెప్తాను!" అన్నారు. తర్వాత వేరు సంభాషణ చెయ్యకుండా బయటకి వెళ్లారు.

నేను స్వాతితో అరగంటసేపు మాట్లాడాను. పరిచయాల పునాది బాగానే పడింది. శర్మగారు నన్ను మా యింటి వరకూ తీసుకొచ్చి దిగబెట్టారు. దారిలో అన్నారు. "ఉన్నచూపు మధ్యకాలంలో పోతే మనుషులు పడే బాధ వేరు. యిక్కడ, లేని చూపుతో

స్వాతి పుట్టినందుకు మేము పడే బాధ వర్ణనాతీతం. మా తర్వాత...? అన్న ప్రశ్న మమ్మల్ని సదా కలవరపెడ్తూనే ఉంటుంది. యింకో సంతానాన్ని కంటే ఆ బిడ్డ పరిస్థితీ యిలాగే ఉంటే..? అన్న భయంకొద్దీ శాశ్వతమైన తగు చర్యలు తీసుకొన్నాం!"

నా తల్లిదండ్రుల్ని శర్మగారికి పరిచయం చేశాను. వెళ్లేటప్పుడు నాన్న ఆయనతో వెళ్ళారు. నా గురించి శర్మగారు నాన్నతో చెప్పి ఉంటారనుకొంటాను, నా పట్ల నాన్న అప్పుడప్పుడూ చూపించే విసుగు ప్రవర్తన మళ్లీ తలెత్తలేదు! నా చదువు కోసం మంచి బల్లా, కుర్చీ ఏర్పాటు చేశారు. వ్యక్తిత్వ వికాసాన్ని గురించి ఆంగ్లంలోనూ, తెలుగులోనూ ఉన్న మంచి పుస్తకాల్ని కొని యిచ్చారు.

ఆ వారాంతంలో స్వాతిని మా యింటికి తీసుకువచ్చాను. మనసులు విప్పుకొని మాట్లాడుకొన్నాం. స్వాతి అందంగానే ఉంటుంది. ఆమె అందం సంగతి ఆమెకు తెలియదు. నా రూపాన్ని గురించి ఆమెకు అవగాహన కలిగించడం అసాధ్యమూ, అనవసరమూ కూడా! తర్వాత్తర్వాత చాలాసార్లు ఆమెను కలుసుకొని కబుర్లు చెప్పేదాన్ని. నాకు తెలిసిన సంగతుల్ని గురించీ, నేను నేర్చుకొన్న విషయాల గురించీ ఆమెతో ముచ్చటించేదాన్ని! చెప్పవలసిన విషయాలు చెప్పకపోయినా ఓ తప్పిదమే అనుకొంటూ, వయసు తెచ్చే కోరికల గురించీ, పునరోత్పత్తి గురించీ, వైవాహిక జీవితాన్ని గురించీ చెప్పాను.

"మీరనే ఈ కంటిచూపు లేని నన్నెవరు వివాహం చేసుకొంటారు?" ఓ రోజు స్వాతి ప్రశ్నించింది.

"చేసుకోకపోవచ్చు, కాని చెరచడానికి చూసే ప్రబుద్ధులకి కొదవలేదీ ప్రపంచంలో! కారణం నీ కంటిచూపు కాదు, నీ అందం!' అన్నాను.

అప్పుడు అందాన్ని గురించి ఆమెకు అవగాహన కలిగించడానికి విశ్వప్రయత్నమే చేయాల్సి వచ్చింది. ఆ ప్రయత్నంలో నా రూపాన్ని గురించి చెప్పాల్సి వచ్చింది. ఆమె చేతుల్ని బల్లపరుపుగా ఉన్న నా గుండెల మీదకు తీసుకువచ్చాను. తర్వాత ఆమె చేతుల్ని ఆమె గుండెల మీదకు తీసుకువెళ్లాను. యిది ఒక చిన్న ప్రయత్నం మట్టుకే. స్పర్శతో కనుముక్కుల తీరు ఓకేలా అనిపించినా, వాటి అమరికతో అందానికి ఎలా రూపమొస్తుందో చెప్పడం కష్టమైపోయింది. చివరికి "అవలీలగా నీ మాటలు అర్థమౌతున్నాయి!" అంది నెమ్మదిగా.

నా న్యూనతని పూర్తిగా విస్మరించి చదువు మీద ధ్యాస పెట్టాను. మొదటి తరగతిలో ప్రథమురాలిగా విజయం సాధించాను. ఆ తర్వాత గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు చేబట్టాను. ఓ కాలేజీలో జీవశాస్త్రవిభాగంలో ఉపన్యాసకురాలిగా ఉద్యోగం వచ్చింది.

మొదటి రోజు సహోపాధ్యాయులకి నా పొడ కిట్టింది కాదు. ఎందుకంటే నేను మొదటి పాఠం చెప్పినప్పుడు సగానికి సగం మంది హాజరు వేయించుకొని, ఉన్న ద్వారాల ద్వారా దర్జాగా నడుచుకొంటూ నడవలోకి దారి తీశారు. ఓ పది మంది ఆడపిల్లలూ, ఓ పదిమంది అబ్బాయిలూ క్లాసులో ఉండిపోయారు. మా ఉపన్యాసకుల గదిలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. వాళ్లకే కాదు, కుర్రాళ్లకి కూడా నా రూపం నచ్చలేదన్న వ్యాఖ్యానాలు వినబడ్డాయి. అయితే ఈ విషయమై నా మనసు ఎప్పుడో మొద్దుబారిపోయిన కారణంగా, నేను చిరునవ్వుతోనే ప్రవర్తించాను. రెండోరోజు మరో క్లాసుకి వెళ్ళాను. హాజరు వేసిన తర్వాత ఒక్కరూ క్లాసు వదల్లేదు. చివర్లో అందరూ కరతాళధ్వనులు చేశారు. ఒక కుర్రాడు లేచి, "మేడమ్! యింతవరకూ మాకు ఎవరూ ఏ సబ్జెక్ట్ లోనూ ఇంత చక్కగా పాఠం చెప్పిన సందర్భంలేదు. చాలా చాలా థాంక్స్!" అన్నాడు. జరిగిందేమిటంటే క్రితంరోజు నా క్లాసులో కూర్చున్న విద్యార్థినీవిద్యార్థులు నేను బాగా చెప్తానన్న విషయాన్ని ప్రచారం చేశారు. ఈ సంగతీ మా ఉపన్యాసకుల గదికి చేరడం మూలాన సామ్యాలు తప్పవని గ్రహించారో ఏమో, విసుర్లు విసరలేదు. ఆ తర్వాత్తర్వాత నాకేవిధమైన యిబ్బందీ

కలగలేదు. దీంతో నాకు కొండంత ధైర్యమొచ్చింది. ఎవరికైనా అవసరం వచ్చినప్పుడు వాళ్ల క్లాసుల్నికూడా తీసుకొనేదాన్ని! దాంతో నేనంటే గౌరవం పెరిగింది.

ఆ రోజు ఓ డజను బత్తాయిలు కొని స్వాతి యింటికి వెళ్లాను. శ్రీపతిశర్మగారి కాళ్లకి నమస్కరించి నాలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకొన్నాను. ఆయన మనసారా దీవించారు.

ఓ అంతర్జాతీయ పరిశోధనా సంస్థ ముంబయ్ మహానగరంలో ఓ సదస్సు నిర్వహించింది. ఎలక్ట్రానిక్ పరికరాలతో దృశ్యసంకేతాల్ని దృశ్యనాదులకి కలిపి అంధులకి దృశ్యమంటే ఏమిటో అవగాహన కల్గించడానికి పూనుకొంది. స్వాతిని, ఆమె తల్లిదండ్రుల్నీ తీసుకొని నేను ముంబాయ్ వెళ్లాను. ఆ సదస్సులో నేను 'ఆసియా దేశాలలో అంధత్వము–సామాజిక అంశాలు' అనే అంశంపై చదివిన విజ్ఞానశాస్త్రపత్రం బహువిధాలా ప్రశంసలనందుకొంది. స్వాతికి వారు వేదికమీద ప్రయోగాత్మకంగా దృశ్యమంటే అవగాహన కల్పించారు. అయితే వ్యక్తిగతమైన స్థాయిలో, వినికిడి యంత్రంలా ఆ సాంకేతిక నైపుణ్యాన్ని అందచేయడానికి చాలా అడ్డంకులు తొలగించాలనీ, అందుకు యింకా సమయం పడ్తుందనీ సంస్థ శాస్త్రవేత్తలు చెప్పారు.

"దృష్టి లేకపోవడం మూలాన నేను పోగొట్టుకొన్నదేదో నాకు తెలిసింది. యిప్పుడు నాకు నేనెలా ఉంటానో తెలియడమే కాకుండా, ముగ్గురి రూపాలు నా మనసులో ముద్రితమైపోయాయి. అవి కనిపెంచిన నా తల్లిదండ్రులవీ, ఆ అదృష్టం కలిగించిన యిలాంటి మంచి స్నేహితురాలిదీను!" అంటూ స్వాతి వేదిక మీదనుంచి అన్న మాటలు నాకు వెనుదిరగలేని ధైర్యాన్ని కలిగించాయి.

ఆ సంస్థ నన్ను ఓ పరిశోధకురాలిగా, స్వాతిని వారి పరిశోధనలకి ఉపయోగపడే ఓ వ్యక్తిగా ఉద్యోగాలిచ్చారు. యిప్పుడు మాకిద్దరికీ ఓ గుర్తింపు అనేది కలిగింది. మేమంటే మాకు యిప్పుడు నిరాశా నిస్పృహలు లేవు. కుబ్జని కనికరించిన శ్రీకృష్ణపరమాత్మలాంటి వ్యక్తులకోసం మేము ఎదురు చూడటల్లేదు. ఈ సంగతే మా తల్లిదండ్రులతో చెప్పాం. అదుగో, వేరేలా ఆలోచించకండి. మా జన్యువులు మా కారణంగా ముందు తరాలకి వెళ్లడం ససేమిరా మాకిష్టంలేదు. నిర్వేదంతో కాదు కాని ఆదర్శంతోనే, యోగమార్గంలో పయనించే జైన్ యోగినులు లాగే శాస్త్రానికే అంకితమైన అంగనలుగా ఉండిపోవడానికీ నిశ్చయించుకొన్నాం!

---

*"చైతన్యం సంకల్పబలం" అనే వెబ్ మాస పత్రికలో 2019 నుండి పునర్ముద్రణ*

# పెళ్లికూతురు

వేదగిరి రాంబాబు



## కథా మార్గదర్శి కథ

***తనకు పెద్దగా చదువులేదు. గొప్ప అందగత్తె కాదు. తనవాళ్ళకు మంచి కట్నం ఇచ్చే స్తోమత కూడా లేదు. తన వివాహం ఎలా అవుతుంది? ఒకవేళ ఎప్పటికైనా తనకి వివాహం జరిగితే ఈశ్వర్ తోనే జరుగుతుంది. అతను తనకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఏనాటికైనా తప్పక వస్తాడని ఆశ ఉంది.***
***ఆ ఆశే తనకి బతుకు మీద కోరిక కలిగిస్తోంది.***

ఆ గుడి అంతా చాలా హడావుడిగా తయారైంది క్షణాల్లో! ఆడపెళ్లివారు వచ్చేసి, ఉదయమే ఏర్పాటు చేసిన పందిరంతా ఆక్రమించేశారు. అరుగుల మీదా, కోనేటి దగ్గరా... ఎక్కడ చూసినా రంగురంగుల చీరలే! అప్పటికప్పుడు విషయం తెలుసుకొని, గుడి బయట ఇద్దరు సోడా బళ్ళవాళ్ళు వచ్చేశారు.

గుడినానుకునే ఉన్న పెంకుటింటిలో నుంచి పూజారి లక్ష్మీనరసింహాచారి పట్టుపంచె కట్టుకొని, పక్కనున్న గోడ తలుపు తీసుకొని, గుడిలోకి ప్రవేశించాడు. ఆ పెంకుటింటి కిటికీలోంచి ఇదంతా చూస్తున్న మయూరి నవ్వుకుంది.

ఆ గుడికి కళ వచ్చేది ఇలాంటప్పుడే లేదా దేవుడి ఉత్సవాలు జరిగేటప్పుడు. అంతే... మిగతా అన్నివేళలా కళాకాంతులూ, సందడీ లేనట్టు వెలవెలబోయినట్టు కనబడుతుంది.

"ఈ గుళ్ళో పెళ్ళి చేసుకున్నవారందరూ పిల్లాపాపాలతోనూ, సిరిసంపదలతోనూ కళకళలాడిపోతుంటారు!" అందరితో చెప్తుంటాడు తన తండ్రి.

ఆయనలా ఎందుకు చెప్తారో తనకు తెలుసు! ఆ మాటలకు ఆకర్షింపబడి, మరికొంతమంది వారింట జరిగే పెళ్లి వేడుకలు ఆ గుడిలోనే చేయాలని ఆయన ఆశ. ఏదేమైనా ఆ పెళ్లిళ్ల వేడుకలు ఆ కిటికీలోనే కూర్చొని తిలకించడం తనకూ అలవాటైపోయింది.

పెళ్లి ఎలా జరుగుతుందో తనిప్పుడు సులభంగా చెప్పేయ్యగలదు! నిజానికి చాలా వరకూ పెళ్లిమంత్రాలు కూడా తనకు కరతలామలకమైపోయాయి. వాళ్ళు ఒప్పుకోవాలేగాని తను పౌరోహిత్యం కూడా చేసెయ్యగలదు. నవ్వు వచ్చింది మయూరికి.

పెళ్లికూతురు కాబోలు... ఒక మూలగా కూర్చొని స్నేహితురాళ్లతో కబుర్లు చెప్తోంది. ఆమె వేపు పరీక్షగా చూసింది మయూరి. పరవాలేదు బాగానే ఉంది. ధనవంతుల అమ్మాయిలాగే కనబడుతోంది. మెరిసిపోయే నగలే చెప్తున్నాయి ఆ విషయం. అన్ని నగలుండాలేగాని తను అంతకన్నా ఎక్కువగా మెరిసిపోగలదు.

అక్కడ జరిగే పెళ్లిళ్ళన్నింటిలోనూ పెళ్లికూతుళ్లను తనతో పోల్చుకోవడం బాగా అలవాటైపోయింది. అవును, తానూ ఒకరోజు అలాగే పెళ్లికూతురవుతుంది. తన వివాహం కూడా ఆ గుడిలోనే జరుగుతుంది. వరుడు కూడా మరెవరో కాదు.... ఈశ్వర్!!

తనకి ఏడెనిమిదేళ్ళ వయసప్పుడు మొదటిసారిగా పరిచయమైంది అతనితో! తనప్పుడు కోనేటిగట్టున చెట్టుకింద బొమ్మలాట ఆడుకుంటోంది. వాళ్ళూ ఊరు కొత్తగా వచ్చారప్పుడు. తమ ఇంటికి రెండిళ్ళవతల ఉన్న మేడలో దిగారు. వాళ్ళ నాన్నకో మోటార్ సైకిల్ ఉండేది కూడా.

“ఏయ్ నేను కూడా ఆడతాను!” అన్నాడతను దగ్గరకొచ్చి నిలబడి. తనకూ ఒంటరితనం భరింప శక్యం కాకుండా ఉండడం వల్ల వెంటనే అందుకు అంగీకరించింది. అంతే, ఆరోజు నుంచి ఇద్దరూ జత. బడికి వెళ్ళడం, రావడం, ఆడుకోవడం... అన్నీ కలిసే.

అతనూ తన వయసు వాడే. అయినా తను కూపస్తమండూకంలా ఆ గుడి ఆవరణలోనే పెరగడం చేత, అతను చెప్పే విషయాలన్నీ నోరు తెరుచుకొని వింటూ ఉండేది. తన అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని, అతను విజృంభించి చెప్పే అబద్దాలను కూడా నిజమని నమ్మేసేది.

తన దృష్టిలో పెద్ద మొనగాడిలా పెరిగిపోయాడతను. వేసవి సెలవుల్లో మధ్యాహ్నమే తమింటికి వచ్చేసేవాడు. ఇద్దరూ కోనేటిగట్టు మీదనుంచి నడిచి, అవతలి వొడ్డుకు చేరి, అక్కడ అడవిలా పెరిగిపోయిన చెట్ల మధ్య నుంచీ, గుబుర్ల సందునుంచీ తిరుగుతూ, అంత వరకూ తనెన్నడూ వెళ్లలేకపోయిన కొత్తకొత్త ప్రదేశాలు చూస్తూ ఉండేవాళ్ళు. అలా చెట్ల గుబురుల్లోకి వెళ్ళడం తనకెంతో భయాన్ని కలిగించేది. కానీ అతను హీరోలా చెయ్యి పట్టుకొని లాక్కెళ్ళేవాడు.

ఒకసారి అలా వెళ్తుంటే, పెద్ద పామెదురైంది. అంతే! ఇద్దరూ ఒకరి చేతిని ఇంకొకరు గట్టిగా పట్టుకొని, ఒకటే పరుగుతో గుడికి చేరుకున్నారు. ఆ తరవాత మళ్ళీ ఎప్పుడూ అంత దూరం వెళ్లలేదు. గుళ్లోనే ఆడుకునేవాళ్ళు. గుళ్ళో పెళ్లిళ్లు జరుగుతుంటే తామిద్దరికీ ఎంతో సర్దాగా ఉండేది.

తను లంగా జాకెట్లు వేసుకోవడం మొదలుబెట్టాక, అదివరకట్లా అతనితో తిరగాలంటే బిడియంగా ఉండేది. అమ్మకూడా అలా ఇష్టం వచ్చినట్టు తిరగొద్దని ఆంక్షలు పెట్టేది. అతను మాత్రం తనకోసం ప్రతీరోజూ వస్తూ ఉండేవాడు. కిటికీ బయటనే నిలబడి, కాసేపలా వెళ్ళి ఆడుకుందాం రమ్మని వేధించేవాడు. తల్లిని బతిమాలి, ఇద్దరూ గుడిలోనే, అరుగుమీద కూర్చొని కబుర్లు చెప్పుకునేవారు. అతనితో ఉంటే అసలు సమయమే తెలిసేది కాదు.

ఓ రోజు జరిగిన సంఘటన తను ఎప్పటికీ మర్చిపోలేదు. ఆరోజు తల్లీ తండ్రీ గుళ్ళో జరుగుతున్న పెళ్లి హడావిడిలో ఉన్నారు. మామూలుగా మిట్టమధ్యాహ్నం తనకోసం అతనొచ్చాడు.

“మీ అమ్మా నాన్నా ఇంట్లో లేరా?” ఆనందంగా అడిగాడు.

“ఊహూ గుళ్ళో ఉన్నారు.”

“అలా అయితే మనం కోనేటి దగ్గరకు వెళ్ళి ఆడుకుందామా?

“అమ్మో! అమ్మ చూస్తే”

‘ఏం పర్లేదు. అందరూ పెళ్లి సందట్లో ఉన్నారు” రమ్మని బలవంతం చెయ్యసాగాడు.

కాసేపతనితో సర్దాగా గడపాలని తనకీ ఉంది. ఎంతో కాలమైంది తామిద్దరూ చెట్ల గుబురుల్లో ఆడుకొని. ఇద్దరూ పెళ్ళివాళ్ళ

మధ్యనుండి తప్పించుకొని, కోనేటి వైపు పరుగెత్తసాగారు. మంగళవాయిద్యాలు వాయించడం మొదలైంది అప్పుడే. కోనేటి ఒడ్డున కూర్చొని ఇద్దరూ పెళ్లి గురించి చాలా కబుర్లు చెప్పుకున్నారు. హఠాత్తుగా అడిగాడతను.

"మయూరీ మనం కూడా పెళ్లి చేసుకుందామా?"

"ఏంటీ పెళ్ళా?"

"ఉత్తుత్తి పెళ్లిలే!"

"ఛీ పాడు!"

"ఏం"

"అమ్మో ఎవరైనా చూస్తే"

"ఇక్కడికెవరొస్తారనీ! ఎవరూ రారు"

పైకి వద్దనేసిందిగాని, నిజానికి తనకీ సర్దా కలిగింది. మరుక్షణంలో ఇద్దరూ పెళ్లికొడుకూ, పెళ్లికూతురుగా మారిపోయారు. కోనేటిగట్టునే, చెట్ల గుబురుల్లో పెద్దపెద్ద అరిటాకుల్ని పరుచుకొని, ఇద్దరూ కూర్చున్నారెదురెదురుగా. గుడిలో మంగళసూత్రాలు కట్టే సమయంలో మంగళవాయిద్యాలు పెద్దఎత్తున మారుమోగాయి.

వెంటనే అతను లేచి అంతకుముందే సిద్ధంగా ఉంచుకున్న పసుపుదారం తన మెడలో కట్టేశాడు. తరవాత ఎండిపోయిన చెట్ల ఆకుల్ని తలంబ్రాలుగా ఇద్దరూ ఒకరి నెత్తిన మరొకరు పోసుకున్నారు. తన పొట్టి లంగాకీ, అతని నిక్కరుకీ ఓ తాడు ముడేసుకొని తాము కూర్చున్న స్థలం చుట్టూ ప్రదక్షిణలు చెయ్యసాగారు. ఆ సమయంలో తన చిటికెన వేలు పట్టుకోవడం కూడా మరచిపోలేదతను. తరవాత అంత వెల్తురులోనూ తనకి అరుంధతీ నక్షత్రం చూపించాడతను. కనిపించిందని తను తలూపింది కూడా. ఆ పెళ్లి ఉత్తుత్తి బొమ్మల పెళ్లని తనకు తెలిసినా నిజంగానే తన పెళ్లి జరుగుతోందన్నట్టు భావన కలగసాగింది.

"ఇప్పుడు మనిద్దరం మొగుడూ పెళ్ళాం అయ్యాం కదూ" అడిగాడు ఈశ్వర్.

తనకు తెలియకుండానే విపరీతమైన సిగ్గేసింది. అప్పట్లో తనకి వివాహమంటే ఏంటో పూర్తిగా తెలియకపోయినా ఆ పవిత్రమైన బంధంలోని అనుభూతి కదిలించి వేసింది.

"ఏయ్ మాట్లాడవేం" ఆప్యాయంగానే రెట్టించాడతను.

"మనం ఇలా చెయ్యడం తప్పు కదూ?"

"ఎలా?"

"ఇలా!" ఆ తరవాత చెప్పలేకపోయింది తను. హఠాత్తుగా అతనంటే సరికొత్త ఆకర్షణ ప్రారంభమైంది తనలో.

"ఏయ్, అలా మూగదానిలా అయిపోయావేంటి? మాట్లాడవేం?" తనకి దగ్గరగా వచ్చి తాకుతూ అడిగాడతను. అతని స్పర్శ తనలో వింత అనుభూతిని కలిగిస్తోంది. తను నెమ్మదిగా తలెత్తి అతని కళ్లలోకి చూసింది. తనవంకే చూస్తున్నాడతను. ఆ చూపుల్లో విద్యుత్ ప్రవహించినట్టైంది. సిగ్గుతో తల వాలిపోయింది. మధురస్మృతులు మనసును కమ్మేయసాగాయి.

అతని కౌగిలిలో నలిగిపోతున్నప్పుడుగాని, తిరిగి తనకి బాహ్యప్రపంచం గుర్తుకు రాలేదు. లేకపోతే ఆ కౌగిలి తమనెంత దూరం తీసుకెళ్లేదో! అంతవరకూ కలగాపులగంగా వినబడుతున్న మంగళవాయిద్యాలు ఆగిపోయి తమని పూర్తి స్పృహలోకి తెచ్చాయి.

"ఏయ్ వదులు" అంది భయంగా అతన్ని వెనక్కు తోసేస్తూ.

ఈశ్వర్ కూడా భయపడిపోయాడు. చటుక్కున తనని వదిలేసి, దూరంగా జరిగాడు.

"కోపం వచ్చిందా?" కొన్ని క్షణాల మౌనం తరవాత తానే అడిగాడు.

"ఊహూ లేదు. ఇంటికి వెళ్లిపోదాం" గబగబా బయల్దేరింది తను. వెనకే తనూ వచ్చేసాడు. దారిలో తనేమీ మాట్లాడలేదు. అతనూ మాట్లాడలేదు. ఆ తరవాత మూడు నాలుగురోజులు తామిద్దరూ కలుసుకోలేదు. కానీ అతనంటే తనకున్న అభిమానం ఇదివరకటికన్నా రెట్టింపైందని మాత్రం తను గ్రహించింది.

సరిగ్గా అప్పుడే వాళ్ళ నాన్నగారికి వేరే ఊరు ట్రాన్స్ఫర్ అయ్యింది. వెళ్ళేముందు తన దగ్గరకు వచ్చాడు ఈశ్వర్. అమ్మ వద్దని వారించినా వినకుండా అతని వెనుకే బయలుదేరింది. ఇద్దరూ గుడిలోకొచ్చి కూర్చున్నారు.

"మేం రేపెళ్లిపోతున్నాం!" దిగులుగా అన్నాడతను.

తనకంతకు ముందురోజు ఆ విషయం తెలిసినప్పట్నుంచీ మనసంతా అదోలా అయిపోయింది. అతనలా అనేసరికి కన్నీళ్లాపుకోలేకపోయింది.

"మళ్ళీ ఎప్పుడైనా వస్తావా ఇక్కడికి?" బొంగురుపోయిన గొంతుతో కళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

"పెద్దాడ్నయ్యాక తప్పకుండా వస్తాను. అప్పుడు మనిద్దరం గుడిలో అసలైన పెళ్లి చేసుకుందాం!"

తను తలెత్తి అతని వైపు చూసింది. 'నిజంగానా!"

"అవును. మనం పెళ్లి చేసుకుంటే ఎంతో బాగుంటుంది కదూ. అప్పుడు మనం ఇంచక్కా అమ్మా నాన్నగార్లలా కలిసే ఉండొచ్చు హాయిగా!"

"నువ్వు తప్పకుండా వస్తావా?"

"ఒట్టు" తన చేతిలో చెయ్యివేసి గిల్లుతూ అన్నాడతను.

★★★

అంతే... అతను వెళ్ళిపోయి దాదాపు పదిహేను సంవత్సరాలు కావస్తోంది. ప్రతీరోజూ అతని కోసం ఎదురు చూస్తూనే ఉంది. ఆ తరవాత గుడిలో ఎన్నో పెళ్లిళ్లు జరిగాయి. ఏ పెళ్లి చూసినా తన కళ్ళముందు మెదిలేది ఆనాటి తమ పెళ్లి ఆటే! ప్రతీ పెళ్ళిలోనూ పెళ్లికూతురు తానే అయినట్టూ, పెళ్ళికొడుకు ఈశ్వర్ అయినట్టూ ఊహించుకోవడం అలవాటైపోయింది.

★★★

"పిలుస్తుంటే పలకవేమే? పెళ్లి చూడ్డంలో పడితే ఇంట్లో పనే గుర్తుండదు నీకు!" తల్లి మాటలకు ఉలిక్కిపడి, ఆలోచనల్లోనుండి బయటపడింది మయూరి. తల్లిని చూస్తుంటే అభిమానం, ప్రేమా పెల్లుబికేయి ఒక్కసారిగా. తల్లి అలా తనకెందుకు పని చెప్తుందో తనకు తెలుసు. తన వయసు పెరిగిపోతోందనీ, తనకు పెళ్లి చేయలేకపోతున్నామనీ తల్లిదండ్రుల బాధ. తను కూడా అలాంటి బాధ పెట్టుకుంటుందేమోనన్న భయంతో పెళ్లి చూడనివ్వకుండా రోజంతా ఏదో పని పురమాయిస్తుంది అమ్మ.

తనకు పెద్దగా చదువులేదు. గొప్ప అందగత్తె కాదు. తనవాళ్ళకు మంచి కట్నం ఇచ్చే స్తోమత కూడా లేదు. తన వివాహం ఎలా అవుతుంది? ఒకవేళ ఎప్పటికైనా తనకి వివాహం జరిగితే ఈశ్వర్ తోనే జరుగుతుంది. అతను తనకిచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఏనాటికైనా తప్పక వస్తాడని ఆశ ఉంది. ఆ ఆశే తనకి బతుకు మీద కోరిక కలిగిస్తోంది.

గుళ్ళో మంగళవాయిద్యాలు పెద్దపెట్టున మార్మోగుతున్నాయి. వధువు మెడలో తాళి కడుతున్నాడు పెళ్లికొడుకు. మయూరి నెమ్మదిగా అక్కడ్నుంచి లేచి వెళ్ళి, తన పెట్టె తెరిచి, అందులో భద్రంగా దాచుకున్న సన్నని పసుపు దారం పైకి తీసి చూసుకుంది.

ఆనాడది ఈశ్వర్ తన మెడలో కట్టిన తాళి. తనివితీరా ఒకసారి మెళ్ళో వేసుకొని చూసుకొని, భద్రంగా పెట్టెలో దాచి, వంటింటివేపు నడిచిందామె. 'ఎప్పటికైనా ఈశ్వర్ తనకోసం వస్తాడు. అప్పుడే తన పెళ్ళవుతుంది" ఆశగా అనుకుందామె.

అయితే... నిజానికి గుడిలో జరుగుతున్న పెళ్ళిలోని వరుడు తన ఈశ్వరేననీ, అతను ఆనాటి పెళ్లినీ, స్మృతుల్నీ పిల్లలాటలా మరచిపోయాడనీ, ఇప్పుడతను పెళ్లిచేసుకుంటున్న అమ్మాయి వల్ల తన అంతస్తు మరింత పెరిగినట్టు భావిస్తున్నాడనీ ఆమెకు తెలియదు. ఊహించలేదు కూడా! ఆమెపాలిట శాపమో వరమోగాని, మానసికంగానే కాక, శారీరకంగా కూడా అతనిలో వచ్చిన విపరీతమైన మార్పులు ఆమెకతన్ని గుర్తించే అవకాశం ఇవ్వలేదు.

అతను గుర్తొచ్చినప్పుడల్లా అతని సరసన పెళ్లికూతురిగా ఊహించుకొని, సిగ్గు పడిపోవడమే తెలుసామెకు!

---

*అక్టోబర్ 1979, యువ మాసపత్రిక నుంచి పునర్ముద్రణ*

---

ఈ పత్రిక నిర్వహణకు ప్రతి నెలా ఒకరు ఆర్థికంగా సహాయపడుతున్నారు. ఆసక్తితో పాటు అవకాశం ఉన్నవారిని కథామంజరి కథాయజ్ఞంలో పాలుపంచుకోవలసినదిగా సవినయంగా కోరుతున్నాం. వివరాల కోసం సంప్రదించండి.


అవసరాల వెంకటరావు
9989976688

జయంతి ప్రకాశ శర్మ
9848629151


◈

సద్విమర్శ ఒక రచన ఆరోగ్యాన్ని పరిరక్షించే ఔషధం. కథకులకి మార్గదర్శి వంటిది.
కథామంజరి కథల పైన మీ అభిప్రాయాలను, విశ్లేషణలను, విమర్శలను ఆహ్వానిస్తున్నాం.
మీ అభిప్రాయాలను పంపవలసిన చిరునామా
submit@kathamanjari.in
మంచి రచనలతో కూడిన సంచికను రూపొందించే కార్యక్రమానికి చేయూతనివ్వండి.

◈

కథామంజరి పాఠకులను పెంచండి. కథామంజరిని కథాభిమానులకు చేరువ చేయండి.
వారి ఇమెయిల్ లను నమోదు చేసుకొనడానికి..
www.kathamanjari.in

◈

కొత్త, పాత రచయితలు, రచయిత్రుల నుండి కథలను ఆహ్వానిస్తున్నాం.
మీ రచనలను పంపవలసిన చిరునామా
submit@kathamanjari.in